అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 08-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 78
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50





సీపీఎస్‌ను రద్దు చేయాలి

- 40 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి :

పీఆర్సీ చైర్మెన్‌కు ఎస్టీయూటీఎస్ ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 40 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని ప్రకటించాలనీ, గతేడాది జులై ఒకటి నుంచి అమలు చేయాలని ఎస్టీయూటీఎస్ కోరింది. పీఆర్సీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యకు మంగళవారం హైదరాబాద్‌లో వేతన సవరణ ప్రతిపాదనలను ఆ సంఘం అధ్యక్షులసెం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్ నేతృత్వంలో సమర్పించారు. కనిష్ట వేతనం రూ.32 వేలు, గరిష్ట వేతనం రూ.3,41,300 ఉండాలని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని తెలిపారు. రిటైర్‌మెంట్ గ్రాట్యుటీని రూ.16 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు పెంచాలని పేర్కొన్నారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం 6/12/18/24 స్కేళ్లకు బదులుగా 5/10/15/20/25/30 ఏండ్లుగా సవరించాలని సూచించారు. హెచ్‌ఆర్‌ఏకు సంబంధించి జీహెచ్‌ఎంసీలో 35 శాతం, మున్సిపల్ కార్పొరేషన్లలో 30 శాతం, జిల్లా కేంద్రాల్లో 25 శాతం, మున్సిపాల్టీల్లో 20 శాతం, గ్రామ పంచాయతీల్లో 15 శాతం అమలు చేయాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సెంటివ్ అలవెన్సును కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎ సదయ్య, అసోసియేట్ అధ్యక్షులు జె గజేందర్, పీఆర్సీ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కందుకూరి దయానంద్, హెడ్‌క్వార్టర్ సెక్రెటరీ టి పోల్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇష్లాకారుద్దీన్, పి రామసుబ్బారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి ప్రవీణ్‌కుమార్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబేర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టానికి తూట్లు



ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలి

- ప్రజానేత సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి : కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం : మల్లు లక్ష్మి

నవతెలంగాణ-కట్టంగూర్/ అర్వపల్లి

వామపక్ష పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజానేతగా, నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం నల్లగొండ జిల్లాలో పలుచోట్ల నాగయ్యతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కట్టంగూరు మండలం పిట్టంపల్లి గ్రామంలో నాగయ్య ఉపాధి కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు యూపీఏ ప్రభుత్వంతో కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించి జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెచ్చింది సీపీఐ(ఎం) అని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి అభ్యర్థికి ఓటు వేయాలని, ప్రజలను ముంచే అభ్యర్థులను ఓడించాలని కోరారు. పూటకో పార్టీ మార్చే అవకాశవాదులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం కమ్యూనిస్టుల పోరాట ఫలాలని వివరించారు. అవి కమ్యూనిస్టుల త్యాగాల ఫలితంగా వచ్చాయన్నారు. 2000లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ముగ్గురు కార్యకర్తల ప్రాణత్యాగం, సీపీఐ(ఎం) సుదీర్ఘ ఉద్యమ ఫలితమే నేటి ఉచిత కరెంట్ సరఫరా అని చెప్పారు. బీజేపీ విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా.. పేదలకు పెనుభారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోటీశ్వరులకు పన్ను రాయితీలిస్తూ పేద ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. వీటన్నింటిపై చట్టసభల్లో కొట్లాడేందుకు నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, జాల రమేశ్, ముస్కు మారయ్య, ఎన్న నర్సిరెడ్డి, కారింగ్ రమణ పాల్గొన్నారు.

భీంరెడ్డి, మల్లు స్వరాజ్యం పోరాట ఫలితమే శ్రీరాంసాగర్ నీళ్లు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ



భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం పోరాట ఫలితంగానే శ్రీరాంసాగర్ నీళ్లు వచ్చాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ అన్నారు. వారి వారసుడిగా నిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతున్న సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ని గెలిపించాలని కోరారు. అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెంలో జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, అవినీతికర కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ సుత్తికొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో లౌకికవాద, ప్రజాస్వామ్య, భారత రిపబ్లిక్ ఉనికే ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం దేశంలో కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు, ప్రజలను మతపరంగా విభజించేందుకు యత్నిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతి దేశభక్తుని కర్తవ్యంగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెరుకు ఏకలక్ష్మీ, నాయకులు జె.నర్సింహారావు, వీరబోయిన రవి, వజ్జె శ్రీనివాస్, వజ్జె సైదులు, సిగ వెంకన్న, శ్రీను, రవి, శ్రీకాంత్, విజయ్‌కుమార్, నిమ్మలగుంటి అబ్బులు, బుచ్చిరాములు, సీనియర్ నాయకులు అరిగె వీరస్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి



- కనీస వేతనం రూ.30 వేలుండాలి
- జీఎస్‌డీపీ అభివృద్ధికి అనుగుణంగా వేతనాలు నిర్ణయించాలి
- పీఆర్సీ చైర్మెన్‌తో టీఎస్‌యూటీఎఫ్ చర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండో పీఆర్సీలో 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కోరింది. కనీస వేతనం రూ.30 వేలుండాలని సూచించింది. గతేడాది జులై ఒకటో తేదీ నుంచి ఆర్థిక లాభం ఉండేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర జీఎస్‌డీపీ అభివృద్ధికి అనుగుణంగా వేతనాలుండాలని కోరింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గౌరవ ప్రదంగా జీవించటానికి అవసరమైన వేతనాలను నిర్ణయించాలని తెలిపింది. పీఆర్సీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యతో మంగళవారం హైదరాబాద్‌లో వేతన సవరణ ప్రతిపాదనలపై టీఎస్‌యూటీఎఫ్ ఆఫీసు బేరర్లు చర్చలు జరిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా, ప్రపంచ కార్మిక సదస్సు నిర్ణయించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉద్యోగి కుటుంబం ఆరోగ్యంగా జీవించటానికి అవసరమైన కనీస వేతనాన్ని నిర్ణయించాలని చెప్పారు. ఐదేండ్లలో రాష్ట్ర జీఎస్‌డీపీ జాతీయ సగటుకన్నా 60.3 శాతం అభివృద్ధి సాధించిందన్నారు. ఆ మేరకు ఉద్యోగుల వేతనాలు కూడా పెరగాల్సిన అవసరముందని సూచించారు. గత పీఆర్సీ నివేదిక 30 నెలలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పీఆర్సీలో అలాంటి నష్టం జరగకుండా సకాలంలో నివేదికను ప్రభుత్వానికి అందజేసి, గతేడాది జులై ఒకటి నుంచి ఆర్థిక ప్రయోజనం వర్తింప జేయాలని కోరారు. వేతన సవరణ కమిటీ సిఫారసులు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలకు వర్తింపజేయాలనీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల సంక్షేమానికి కూడా తగిన సూచనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఎ వెంకట్, ఎం. రాజశేఖర్‌రెడ్డి, పి మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ప్రతిపాదనల్లోని ముఖ్యాంశాలు

- కనీస వేతనం రూ.30 వేలు, గరిష్ట వేతనం రూ.2,48,150
- మాస్టర్ స్కేలును కొనసాగించాలి.
- ఫిట్‌మెంట్ 30 శాతం తగ్గకుండా ఉండాలి.
- ప్రస్తుత మూల వేతనానికి 2023, జులై ఒకటి నాటికి రావాల్సిన డీఏ (33.67 శాతం) ఫిట్‌మెంట్ కలిపి మాస్టర్ స్కేల్‌లో తదుపరి స్టేజీలో వేతనం నిర్ణయించాలి.
- ఉపాధ్యాయుల వివిధ క్యాడర్ల వేతన స్కేళ్ల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలి.
- ఆటోమాటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను 5/10/15/20/25/30 ఆరు దశలుగా నిర్ణయించాలి.
- ఇంటి అద్దె అలవెన్సు (హెచ్‌ఆర్‌ఏ) గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం తగ్గించాలి. గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం అన్ని మున్సిపాల్టీల్లో 17 శాతం, జిల్లా కేంద్రాలు, కార్పొరేషన్లలో 20 శాతం, జీహెచ్‌ఎంసీలో 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉండాలి.
- గ్రామీణ ప్రాంత ఉద్యోగులను ప్రోత్సహించేందుకు 10 శాతం రిమోట్ రూరల్ ఏరియా అలవెన్సు ఇవ్వాలి. గరిష్టంగా రూ.5 వేలుండాలి.
- ఈహెచ్‌ఎస్ పథకంలో భాగంగా నగదు రహిత వైద్యం అందించాలి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. అన్ని విద్యా సంస్థల్లోని ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలి.
- కనీస పెన్షన్ రూ.30 వేలుండాలి. గ్రాట్యుటీ కనీసం రూ.5 లక్షలు, గరిష్టంగా రూ.25 లక్షలుండాలి.
- సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.

ఇలా అయితే...పని చేయలేం

- దాడికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయాలి
- భద్రత కల్పిస్తేనే సేవలందించగలం : కోరుట్ల ఘటనపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందిపై తరచూ దాడులు జరిగే పరిస్థితుల నేపథ్యంలో పని చేయలేమని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కార్యాలయం ముందు ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, డాక్టర్ నరహరి తదితరులు మాట్లాడారు. తగినంత మంది వైద్యులు, వైద్య సిబ్బంది లేకుండానే గత బీఆర్‌ఎస్ సర్కార్ ఆస్పత్రులను ఉన్నతీకరించిందని విమర్శించారు. కోరుట్లలో పేరుకు ఏరియా ఆస్పత్రి అయినప్పటికీ అక్కడ ఉండాల్సినంత మంది డాక్టర్లు, ఇతర సౌకర్యాలు లేవని తెలిపారు. మరోవైపు కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో అధిక మొత్తంలో జీతాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా... తాము పేదలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్నామని తెలిపారు. పేద రోగులకు సేవలందిస్తున్న తమకు భద్రత కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కోరుట్ల ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయించడంతో పాటు మిగిలిన ఆస్పత్రుల్లో సిబ్బందికి భద్రత కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడ్డ నిందితులను అరెస్ట్ చేయకపోతే విధులను నిర్వర్తించలేమని హెచ్చరించారు. దాడికి పాల్పడ్డవారిని వదిలేసి ఆ ఆస్పత్రి డాక్టర్ శ్రవణ్‌ను సస్పెండ్ చేస్తూ టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఆ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని తాము చేసిన డిమాండ్‌కు అజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. డిమాండ్లు నెరవేర్చకుంటే తదుపరి కార్యాచరణ ఉంటుందని చెప్పారు.

ఐసీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో కల్ప స్కూల్ విద్యార్థుల సత్తా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐసీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో కల్ప స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సత్తాచాటారు. ఈ మేరకు ఆ పాఠశాల యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ పాఠశాల నుంచి 57 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారని వివరించింది. 19 మంది విద్యార్థులు 90 శాతానికిపైగా మార్కులు సాధించారని తెలిపింది. 49 మంది విద్యార్థులు 86 శాతం మార్కులతో డిస్టింక్షన్ సాధించారని పేర్కొంది. 500కు 496 (99.2 శాతం) మార్కులతో మహేక్ గుప్తా టాపర్‌గా నిలిచారని తెలిపింది. ఆమె కంప్యూటర్ అప్లికేషన్లలో 100 మార్కులు, ఇతర నాలుగు సబ్జెక్టుల్లో 99 మార్కులు సాధించారని వివరించింది. ఎస్ స్వర, చైత్ర వెంకట నాగసాయి ఇద్దరూ 492 (98.3 శాతం) మార్కులు సాధించారని పేర్కొంది. వారిద్దరూ హిస్టరీ, సివిక్స్, జాగ్రఫీ, కంప్యూటర్ అప్లికేషన్లలో వంద మార్కులు పొందారని తెలిపింది. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తున్నామనీ, అందుకే ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమైందని పేర్కొంది. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించింది.

భారీ వర్షం.. నీళ్లపాలైన ధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

విరిగి పడ్డాయి. సిద్దిపేటలో పిడుగుపాటుకు రైతు మృతిచెందాడు. కల్లాల్లోని ధాన్యం తడిసి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. వర్షం వల్ల సాయంత్రం జరగాల్సిన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సభలు రద్దయ్యాయి. హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వడగండ్ల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీళ్లపాలైంది. రాయికల్, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలంలో పిడుగుపాటుకు గేదె మృత్యువాత పడింది. వేములవాడ, జూలపల్లి గన్నేరువరంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుల్తానాబాద్, చొప్పదండిలో భారీ వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లోని వందల క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయింది. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో జరగాల్సిన కాంగ్రెస్ జనజాతర సభ రద్దయింది.

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దహెగాం మండల కేంద్రంలో తాటిచెట్టుపై పిడుగుపడి పూర్తిగా కాలిపోయింది. ఐనం, బీబ్రా, బోర్లకుంట తదితర గ్రామాల్లో గాలి వానతో పాటు వడగండ్లు పడ్డాయి. బీబ్రా గ్రామంలో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడగా.. తీగలు ఇండ్లపై పడ్డాయి. బోర్లకుంట గ్రామంలో బొందుగుల స్వామి ఇల్లు కూలింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. పెంచికల్‌పేట్ మండల వ్యాప్తంగా కల్లాల్లో ఉన్న వరిధాన్యం తడిచింది. బెజ్జూర్ మండలంలోని కుకుడ, ముంజంపెల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. కౌటాల మండలంలో నాగెపెల్లి గ్రామంలో పిడుగు పడి రైతు మోర్లె దస్రుకు చెందిన ఎద్దు మృత్యువాత చెందింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్లి(కె), పల్లి(బి) గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా జైపూర్, మందమర్రి మండలాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. వరి ధాన్యం తడిసి పోయింది. వడగళ్ల వానకు కోత దశకు వచ్చిన వరిపైరు నేలకొరిగింది. మామిడి పంట నేలరాలింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట, కాగజ్‌నగర్, కౌటాలా, సిర్పూర్(టీ) భారీ వర్షం కురిసింది.

తడిసి ముద్దాయిన ధాన్యం కుప్పలు

భూపాలపల్లి జిల్లా మహముత్తారం, గణపురం మండలాల్లో మోస్తరు వర్షాలు కురిసాయి. ధాన్యం గింజలు నేల రాలిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. పలుచోట్ల ధాన్యం తడిసి ముద్దవగా, కొన్నిచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల వ్యాప్తంగా ఉదయం నుండి సాయంత్రం వరకు ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. మల్హర్‌రావు మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్లు విరిగి కరెంట్ తిగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిపిపోయింది. వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామంలో ఈదురు గాలులకు మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకొని దాదాపు 20 ఎకరాల వరకు పంట బూడిదైపోయింది. 10 ఎకరాలలో డ్రిప్ పైపులు పనికిరాకుండా కాలిపోయాయి. పంట విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డివిజన్ పరిధిలో వర్షానికి పంటల నష్టం జరిగింది. వరంగల్ కాశీబుగ్గ సర్కిల్ పరిసర ప్రాంతంలో వర్షపు నీరు మోకాలు లోతు వరకు నిలవడంతో చెరువును తలపించింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఖానాపూర్, చెన్నారావుపేట, పర్వతగిరి, రాయపర్తి, గీసుగొండలో ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో భారీగా వర్షం కురిసింది. రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. పొలాల్లో ఉన్న పశు గ్రాసం ఈదురు గాలులకు కొట్టుకుపోయింది. మామిడి కాయలు నేలరాలాయి.

హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్..!

జంటనగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాలాలు, డ్రైయినేజీలు పొంగి పొర్లాయి. పలు బస్తీలు, కాలనీలలో ఇండ్లలోకి వర్షం నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వాహనాదారులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సికింద్రాబాద్, చిలకలగూడ, మారేడుపల్లి, బోయిన్‌పల్లి, ప్యారడైజ్, ప్యాట్నీ, మలక్‌పేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట, యూసఫ్‌గూడ, అల్వాల్, ఎల్బీనగర్, కాప్రా, సుచిత్ర జీడిమెట్ల, ముషీరాబాద్, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి వరదనీరు చేరగా.. మియాపూర్, చందానగర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్‌లో రోడ్లపై భారీగా వర్షం నీరు చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రాయదుర్గం బయోడైవర్సిటీ నుంచి ఐకీయా వరకు, ఖాజాగూడ చౌరస్తా నుంచి డీపీఎస్ వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. పలుచోట్ల చెట్లు విరిగి పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్ అయింది. ఇదిలా ఉండగా నగరంలో కురిసిన భారీ వర్షంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సమీక్షించారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో పిడుగుపడి వ్యక్తి మృతిచెందాడు. చెందిన సంఘటన కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుమ్మరి మల్లేశం(33) బర్రెల పాల పితకడం కోసం వ్యవసాయ బావి దగ్గరకి వేళ్లగా ఆకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో వర్షం పడింది. దాంతో మల్లేశం చెట్టుకిందకు వెళ్లాడు. చెట్టుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరుగాలం కష్టపడిన రైతులు వర్షం వల్ల ఆగమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది.

మూడో దశలో 63 శాతం పోలింగ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు మూడో విడత పోలింగ్ 63 శాతం జరిగింది. మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 93 స్థానాలకు పోలింగ్ జరిగింది. అత్యధికంగా అసోం(4)లో 75.26 శాతం, గోవా(2)లో 74.27 శాతం, పశ్చిమ బెంగాల్(4)లో 73.93 శాతం పోలింగ్ జరిగింది. కర్నాటక (14)లో 67.76 శాతం, ఛత్తీస్‌గఢ్ (7)లో 66.99 శాతం, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ (2)లో 65.23 శాతం, మధ్యప్రదేశ్ (9)లో 63.09 శాతం, ఉత్తరప్రదేశ్ (10)లో 57.34 శాతం, గుజరాత్ (25)లో 56.76 శాతం, బీహార్ (5)లో 56.55 శాతం, మహారాష్ట్ర (11)లో 54.77 శాతం పోలింగ్ జరిగింది.

బూత్‌లోకి రానీయకుండా..

మరోవైపు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను బూత్‌లోకి రాకుండా అడ్డుకున్నారని సీపీఐ(ఎం) అభ్యర్థి, రాష్ట్ర కార్యదర్శి ఎండి సలీం ఆరోపించారు. రాణినగర్ ప్రాంతంలోని బూత్‌లోకి ప్రవేశించకుండా టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకున్నారని పేర్కొంటూ ఎన్నికల కమిషన్‌కు సలీం ఫిర్యాదు చేశారు. ఒక బూత్‌లో, నకిలీ టీఎంసీ ఏజెంట్‌ను సలీం గుర్తించారు. తరువాత ఏజెంటును పోలీసులు అరెస్టు చేశారు."నాకు రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదు. ఓటర్లకు సహాయం చేయడానికి నేను అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశా. ఓటర్లను పోలింగ్ బూత్‌లలోకి రాకుండా అడ్డుకునే అవాంఛనీయ వ్యక్తులను పట్టుకుంటా" అని ఆయన విలేకరులతో అన్నారు. టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను బెదిరిస్తున్నారని ఆయన అన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గంలో బూత్‌లను దోచుకునేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నించారని, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులను పోలీసు స్టేషన్‌లలో నిర్బంధించారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. తన భార్య, సిట్టింగ్ ఎంపీ డింపుల్ యాదవ్ పోటీలో ఉన్న మెయిన్‌పురి నియోజకవర్గానికి సైఫాయ్ (ఇటావా)లో ఓటు వేసిన యాదవ్, కొన్ని చోట్ల ఓట్లు రిగ్గింగ్ జరిగినట్లు ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు తాము ప్రయత్నిస్తున్నామని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. ఎక్కడైతే బోగస్ ఓటింగ్ జరిగిందో అక్కడ తమ కార్యకర్తలు అడ్డుకుంటారని చెప్పారు. మెషీన్ (ఈవీఎం) ఏదైనా మెషీన్ అని, తానెప్పుడూ ఈవీఎంలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘఢ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలో మీ ఓటు ఎటు వెళ్లిందో మీరు చూడలేరని అన్నారు. వీవీప్యాట్ మెషీన్‌లో సాఫ్ట్‌వేర్ ఉంటుందని, అసలు ఏం జరగాలనేది ఆ సాఫ్ట్‌వేర్ నిర్ణయిస్తుందని దిగ్విజయ్ పేర్కొన్నారు. మనం ఏం చేసినా సాఫ్ట్‌వేర్ తాను కోరుకున్నదే ప్రింట్ చేస్తుంది..దాన్నే ఎన్నికల అధికారులు కౌంట్ చేస్తారని దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.మూడో విడత పోలింగ్ సందర్భంగా ప్రధాని మోడీ పోలింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే ఓటు వేశారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ పరిధిలోని అహ్మదాబాద్‌లో ఉన్న నిషాన్ హైస్కూల్‌లో ప్రధాని మోడీ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కేంద్ర హోం శాఖ మంత్రి, గాంధీనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అమిత్ షా సైతం తన కుటుంబంతో కలిసి అహ్మదాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సతీమణి సోనాల్ షా, కుమారుడు, బీసీసీఐ కార్యదర్శి జైషా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ విదిశ లోక్‌సభ అభ్యర్థి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషీ, జ్యోతిరాదిత్య సింధియా, బారామతి ఎంపీ అభ్యర్థులు సుప్రియా సూలే, సునేత్ర పవార్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుజరాత్‌లోని అహ్మాదాబాద్‌లో అదానీ గ్రూపు చైర్మెన్ గౌతమ్ అదానీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహమ్మద్‌పురా ప్రైమరీ స్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లో ఆయన ఓటేశారు. యాక్టర్స్ రితీశ్ దేశ్‌ముఖ్, జెనీలియా మహారాష్ట్రలోని లాతుర్ లో ఓటు వేశారు.



రైతుల నోట్లో మట్టికొట్టాయి

బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై కోమటిరెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ల దుష్ట రాజకీయ పన్నాగాలకు రైతులు బలవుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్రమైన బాధలో ఉన్నారని తెలిపారు. స్వార్థరాజకీయాల కోసం ఆ పార్టీలు రైతుల నోటికాడ బుక్కను లాక్కున్నాయని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖజానాలో రూపాయి లేకుండా చేసిందని విమర్శించారు. రూపాయి రూపాయి కూడబెట్టి తమ ప్రభుత్వం రైతుభరోసా (రైతుబంధు) వేస్తే, బీజేపీ కుటిల రాజకీయం చేసి అడ్డుకున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన సమయానికి రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. రైతులంతా తమ అకౌంట్లలో డబ్బులు పడుతున్నాయని సంతోషపడే లోపే... ఈసీని అస్త్రంగా చేసుకుని నిధులను ఆపేలా కుట్ర చేసిందని పేర్కొన్నారు. మొదటి నుంచి బీజేపీకీ అన్నదాతలు అంటే అక్కసు, ఆగ్రహం... అందుకే నల్ల చట్టాలు తెచ్చి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు.

ఆ చటాలకు వ్యతిరేకంగా పోరాడిన వందలాది రైతులను పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బీజేపీ తన గుప్పిట్లో ఉన్న ఈసీని అడ్డం పెట్టుకొని బ్యాంక్ ఖాతాలో పడ్డ రైతుభరోసా సొమ్ములను కూడా నిలిపి వేసిందని పేర్కొన్నారు. ఇంత కంటే దారుణం ఎక్కడా ఉండబోదని తెలిపారు. రెండు పార్టీలకు రైతులే తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 08-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 78
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మే 13న వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలతో పాటు, విద్యాసంస్థలు, ఫ్యాక్టరీలు విధిగా సర్కార్ ఉత్తర్వులను అమలు చేయాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. అన్ని జిల్లాల ...11లో

రైతు భరోసాకు ఈసీ బ్రేక్

- మే 13 పోలింగ్ తర్వాతే పంపిణీ చేయాలని ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రైతు భరోసా నిధుల పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. రాష్ట్రంలో లోక్‌సభ పోలింగ్ ముగిసిన తర్వాతే నిధులు విడుదల చేయాలంటూ ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. మే 13న పోలింగ్ ముగిసిన తర్వాతే రైతుల ఖాతాల్లో ...11లో



కవితకు కస్టడీ పొడిగింపు

- ఈడీ కేసులో14, సీబీఐ కేసులో 20 వరకు రిమాండ్
- రేవణ్ణను దేశం దాటించి, నాలాంటి వాళ్లను అరెస్ట్ చేస్తారా?: కవిత
- బెయిల్ పై నేడు ఢిల్లీ హైకోర్టు ముందుకు..

10లో



కేజ్రీవాల్ బెయిల్ పై విచారణ

- సుప్రీంకోర్టు షరతులు
- 20 వరకు పొడిగించిన జ్యుడీషియల్ కస్టడీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పై అత్యున్నత న్యాయ స్థానం విచారణ జరిపింది. అయితే బెయిల్ పై సుప్రీంకోర్టు షరతులు విధించి, తీర్పును రిజర్వ్ చేసింది. మధ్యంతర బెయిల్ ...11లో

కష్టమే..



ప్రజా సమస్యలు ముందుకు.. వెనక్కి పోయిన హిందూత్వ

- కాలం చెల్లిన మెజారిటీవాద రాజకీయాలు
- మసకబారుతున్న మోడీ ప్రాభవం

దేశంలో సార్వత్రిక ఎన్నికల పోరు కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే మూడు దశల పోలింగ్ ముగిసింది. మరో నాలుగు విడతల పోలింగ్ జరగాల్సి ఉంది. ఎన్డీఏ నేతలు కలలు కంటున్నట్లు 400కు పైగా స్థానాలు వచ్చే అవకాశాలు ఏ కోశానా కన్పించడం లేదు. మోడీ మానియా క్రమేపీ అదృశ్యమవుతోంది. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. మోడీ ఛరిష్మాకు కాలం చెల్లిందని రాజకీయ పండితులు తేల్చేశారు.

న్యూఢిల్లీ : బీజేపీ, దాని మిత్రపక్షాలకు 400కు పైగా లోక్‌సభ స్థానాలు వస్తాయని మోడీ గతంలో చెప్పే వారు. 2014, 2019 ఎన్నికల్లో మోడీ ప్రభంజనం స్పష్టంగా కన్పించింది. అయితే ఇప్పుడది ఎక్కడా కానరావడం లేదు. ఓటర్లను ప్రభావితం చేసే ఏకైక అంశం కూడా ఏదీ లేదు. తాను అన్నింటికీ అతీతుడినని మోడీ భావిస్తారు. తనకు ఎదురే లేదని అనుకుంటారు. దేశాన్ని అమృతకాలంలోకి నడిపిస్తానని చెబుతారు. హిందూ మత పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా అసంపూర్తిగా నిర్మితమైన రామమందిరాన్ని అయోధ్యలో అట్టహాసంగా ప్రారంభించారు. తను ఏం చేసినా ప్రజల మద్దతు ఉంటుందని విశ్వసిస్తారు. బీజేపీ కూడా తదుపరి ప్రధాని మోడీయేననే ధీమాతో ఉంది. 'మోడీకీ గ్యారంటీ' పేరుతో ప్రధాని ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నారు. ఉచితంగా ఆహారం, గృహవసతి, వంటగ్యాస్, కుళాయి నీరు వంటివి వాటిలో కొన్ని. అయితే క్రమంగా మోడీ, ఇతర బీజేపీ నేతల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతోంది. రెండో దశ పోలింగ్ ప్రచారం సందర్భంగా ప్రధానిలో అసహనం కన్పించింది. ఆయన తన ఎన్నికల ప్రసంగాల్లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తున్నారు. మైనారిటీలకు కాంగ్రెస్ కొమ్ము కాస్తోందని, హిందువుల సంపదను గుంజుకొని వారికి ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. ఓటర్ల మనోగతాన్ని పసిగట్టేందుకు పలువురు విశ్లేషకులు హిందీ రాష్ట్రాల్లో పర్యటించారు. 2019తో పోలిస్తే బీజేపీ బలం తగ్గుతుందని వారు తేల్చి చెప్పారు. 2019లో హిందీ బెల్ట్‌లో బీజేపీ గరిష్ట సంఖ్యలో స్థానాలు సాధించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో మెజారిటీవాద రాజకీయాలు నడిపి ఓట్లు దండుకుంది. అయితే ఇప్పుడు ఆ వాతావరణం కన్పించడం లేదు. ఆయా రాష్ట్రాల్లో మోడీ ప్రాభవం ఇప్పుడు మసకబారింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ప్రజా సమస్యలు ఒక్కసారిగా ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో హిందూత్వ వాదం వెనక్కి పోయింది. మోడీకి కంచుకోటలుగా ఉన్న హిందీ రాష్ట్రాల్లో బీజేపీ ఎన్ని స్థానాలు కోల్పోతుందో చూడాల్సి ఉన్నదని రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ చెప్పారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మెజారిటీకి అవసరమైన 272 స్థానాలు గెలుచుకోవడం కూడా మోడీకి సవాలేనని ఆయన తెలిపారు.

తప్పుడు వాదనలు

ప్రధాని బీజేపీ బహిరంగ సభల్లో తప్పుడు వాదనలు వినిపిస్తూనే ఉన్నారు. మే 1న గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన బహిరంగ సభలో .. "ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 272 సీట్లు గెలవడం అవసరం. బీజేపీ తప్ప మిగిలిన దేశంలోని ఏ రాజకీయ పార్టీ 272 స్థానాల్లో పోటీ చేయడం లేదు. అయినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటున్నారు." అని చెప్పుకొచ్చారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 327 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం.

మూడో దశలో 63 శాతం పోలింగ్

- గుజరాత్‌లో 56.76, ఉత్తరప్రదేశ్‌లో 57.34 శాతమే
- కమళంలో కలవరం

వివరాలు 2లో



మోడీకి సీఎం రేవంత్ సవాల్

ఏమిచ్చినవో చెప్పి వరంగల్‌కు రా..

ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్ ఏమైనయ్..?

- కడియం కావ్యను లక్ష మెజారిటీతో గెలిపించాలి : హన్మకొండ, వరంగల్‌లో రోడ్‌షోలు




నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి
ఏం అభివృద్ధి చేసినవో చెప్పినంకనే వరంగల్‌కు రావాలని ప్రధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. వరంగల్‌లో విమానాశ్రయాన్ని పునరుద్ధరించలే.. అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించలే.. కాజీపేటకు మంజూరైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని లాతూర్‌కు తరలించి చివరకు కాజీపేట రైల్వే జంక్షన్‌ను రద్దు చేసే పరిస్థితికి తీసుకొచ్చిండు.. వీటిపై సమాధానం చెప్పినంకనే వరంగల్‌కు రావాలని అన్నారు. మంగళవారం సాయంత్రం హన్మకొండ చౌరస్తాలో హన్మకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రోడ్డుషోలో సీఎం ప్రసంగించారు. ప్రధాని మోడీ వరంగల్‌కు ఎన్ని కోట్ల ...11లో

తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి

- జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, పోలీసు అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- లోతట్టు కాలనీలు, ట్రాఫిక్, విద్యుత్ సమస్యపై సమీక్ష
- సహాయక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు

వివరాలు 10లో



అధికారంలోకి రాగానే అగ్నివీర్ రద్దు

అమరవీరుల విభజన సరికాదు

- గిరిజనంపై బీజేపీ అరాచకాలెన్నో
- పేదమహిళలకు రూ.లక్ష సాయం : రాహుల్ గాంధీ

గుమ్లా (జార్ఖండ్) : లోక్‌సభ ఎన్నికల తరువాత ఇండియా వేదిక అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ మంగళవారం ప్రకటించారు. అగ్నివీర్ పథకాన్ని ...11లో

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..

మతోన్మాద బీజేపీని ఓడించండి

- సీపీఐ(ఎం) అభ్యర్థి ఎమ్‌డి.జహంగీర్‌ను గెలిపించండి : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య





నవతెలంగాణ-చౌటుప్పల్
ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి.. నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ రోడ్డుషో నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో వీరయ్య మాట్లాడారు. మతోన్మాద, నియంతృత్వ, ప్రజా వ్యతిరేక బీజేపీని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం మతం, కులం పేరుతో ఓట్ల రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం, రోజు కూలి అందించడంలో విఫలమైందని, రోజుకు రూ.178 కూలి సరిపోతుందని చెప్పడం దుర్మార్గమని అన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. రైతులే కూలీలుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందన్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే కార్మికులు, రైతులు, ప్రజల మధ్య కూడా చిచ్చుపెడ్తారని అన్నారు.

అభివృద్ధి శూన్యం
సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు సార్లు కాంగ్రెస్, ఒకసారి బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినా అభివృద్ధి చేయలేదని ...11లో



నన్ను నమ్మండి..ప్లీజ్

నేను ముస్లింలకు వ్యతిరేకం కాదు : ప్రధాని నరేంద్ర మోడీ

- ఇదంతా ఓటు రాజకీయమే : ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: నేను ఇస్లాంను, ముస్లింలను వ్యతిరేకించనని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోన్న తరుణంలో ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన ఈవిధంగా స్పందించారు.
"అది మా విధానం కాదు. నెహ్రూ కాలం నుంచే వారు (విపక్షాలను ఉద్దేశించి) ఈ కథనాలు ప్రచారం చేస్తున్నారు. ముస్లిం వ్యతిరేకులు అంటూ మాపై ఆరోపణలు చేస్తున్నారు. దానినుంచి లబ్ది పొందాలని చూస్తున్నారు. మమ్మల్ని వ్యతిరేకులుగా చూపించి.. తాము వారికి ...11లో

స్కూటీలు రాలే.. లూటీలు షురూ

పాత పథకాలే అమలు చేస్తలే..

- ఒట్టు పెట్టుడు.. కేసీఆర్‌ను తిట్టుడే రేవంత్ పని
- బీజేపీ.. దోపిడీదారులు, పెట్టుబడిదారుల పార్టీ
- మత విద్వేషం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే ఆ పార్టీ పని
- మోడీ మళ్లీ వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు '400 పార్'
- తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం కాపాడేది బీఆర్ఎస్సే.. : కామారెడ్డిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



నవతెలంగాణ-కామారెడ్డి
'అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ కల్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు ఇస్తే దానికి అదనంగా తులం బంగారం ఇస్తామన్నారు. ఎవరికైనా తులం బంగారం వచ్చిందా..? చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు కొనిస్తమన్నారు. స్కూటీలు రాలే కానీ లూటీలు మొదలైయ్యాయి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం రోడ్‌షో, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. '9వ తేదీ లోగా రైతుబంధు వేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయనే కుట్ర చేసి, ...10లో



భారీ వర్షం.. నీళ్లపాలైన ధాన్యం

ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల వడగండ్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- సిద్దిపేట జిల్లాలో పిడుగుపాటుకు రైతు మృతి
- హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

నవతెలంగాణ- విలేకరులు
ఎండ, వడగాడ్పులతో మధ్యాహ్నం వరకు ఉక్కిరిబిక్కిరి చేయగా.. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి పలు జిల్లాల్లో ఈదురు గాలులు.. ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ వడగండ్లు, పిడుగులు పడ్డాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు ...2లో

మేడిగడ్డకు మరమ్మతులు వృథానే !

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక స్పష్టీకరణ

- దెబ్బతినకుండా ఉంటుందని చెప్పలేం
- 2019 జూన్‌లోనే బ్యారేజీకి నష్టం
- వానాకాలంలో బ్యారేజీల గేట్లన్నీ తెరిచే ఉంచాలి
- పరీక్షలు చేసి, మరమ్మత్తులకు పూనుకోవాలి
- దీనికి బాధ్యత డ్యామ్ ఓనర్ (సీఈ రామగుండం)దే: బ్యారేజీల మరమ్మతులపై బాంబు పేల్చిన ఎన్‌డీఎస్‌ఏ
- రూ.లక్ష కోట్ల ప్రజాధనం గంగపాలేనా ?



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతులు చేసినా దెబ్బతినకుండా ఉంటుందనే నమ్మకం లేదనీ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) బాంబు పేల్చింది. యథాతథస్థితిని కొనసాగించడానికి మాత్రమే మరమ్మత్తులు ఉపకరిస్తాయనీ, బ్యారేజీ మరింత దెబ్బతినకుండా మరమ్మతులు తప్పనిసరి అని తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికలకు కేవలం ఐదు రోజుల ముందు ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక రావడం బీఆర్ఎస్‌కు శాపం కానుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇక గత చరిత్ర కానుందా ? అనే అనుమానాలు ఈ నివేదికతో స్పష్టమవుతున్నది. ఈ నివేదికను బీఆర్ఎస్‌కు ఖేదాన్ని మిగిల్చగా, కాంగ్రెస్ ఇతర పార్టీలకు మోదాన్ని అందించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్టీ), గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్(జీపీఆర్) పరీక్షలతోపాటు బ్యారేజీ స్థితిగతులు, నిర్మాణ ఏజెన్సీలు, అధికారుల నివేదికలు, డిజైన్లు, డ్రాయింగులు పరిశీలించి, నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులందరినీ ...11లో

నవతెలంగాణ

నవ్వించడం ఒక యోగం.. నవ్వడం ఒక భోగం..
నవ్వలేకపోవడం ఒక రోగం - జంధ్యాల

బుధవారం 8 మే 2024
www.navatelangana.com

సంపాదకీయం

ద్వేషపు నోళ్లు!



సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ముస్లింలపైకి హిందువులను ఉసిగొలిపే పూర్తి మతత్వంతో కూడిన వ్యాఖ్యలు చోటు చేసుకుంటున్నాయి. మోడీ పరివార ప్రచారమంతా విద్వేషం చిందిస్తూనే సాగుతోంది. ఎందుకంటే ఈసారి ఎన్నికల్లో తమని కాపాడే మంత్ర దండం అదేనని మన విశ్వగురువు నమ్ముతున్నాడు. అందుకే మొదటి నుంచి ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మొన్నటి ఎన్నికల ప్రచారం లో భాగంగా తెలంగాణకు వచ్చిన బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా 'ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కల్పిస్తాం' అన్న మాటలే దీనికి తాజా ఉదహరణ. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ సంపద మొత్తం ముస్లింలకు దోచిపెడతారు' అన్న మాటలు రెండు వారాల కిందట స్వయానా మోడీ నోటి నుంచే విన్నాం. అప్పుడు ఆయన అబద్దాల అక్రమ ప్రచారం అలా... ఇప్పుడు ఈయన ఇలా... విడతల వారీగా సాగుతున్న ఎన్ని కల పోలింగ్ కమలం గుండెల్లో గుబులు రేపుతున్నది. అందుకే తమ విద్వేష ప్రసంగాలను మరింత తీవ్రతరం చేస్తున్నారు.

ఇక దేశంలో హిందూరాజ్యమే మా ధ్యేయమని చెప్పుకుంటున్న బీజేపీ వల్ల హిందూ ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అంటే అదీ లేదు. మోడీ పదేండ్ల పాలనలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి, ప్రజలు ఉన్న ఉపాధిని కోల్పోయారు, కొత్త ఉద్యోగాలు రాలేదు, జీఎస్టీ పేరుతో పన్నుల భారం పెంచారు. దళితులపై, మహిళలపై దాడులు పెరిగిపోయాయి. ఇలా బీజేపీ పాలనలో బాధపడుతున్న వారిలో హిందువులే అధికంగా ఉన్నారనే నిజాన్ని గుర్తించాలి.

అసలు రిజర్వేషన్లకే వ్యతిరేకమైన బీజేపీ, ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల గురించి తెగ మాట్లాడుతుంటే నవ్వు తెప్పిస్తోంది. వినేటోళ్లు ఉంటే హరికథను ఇంగ్లీష్‌లో చెప్తారనే ఓ నానుడి ఉంది. ఇప్పుడు బీజేపీ నాయకుల మాటలు కూడా అలాగే ఉన్నాయి. 'మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం' అని కూడా నడ్డా వారు సెలవిచ్చారు. అయితే రాజ్యాంగం, దాని విలువ, దానిని గౌరవించాలనే విషయం బీజేపీకి ఇప్పుడే గుర్తొచ్చిందనుకుంటే మనం తప్పులో కాలేసినట్టే. మతాలను, రాజ్యాంగాన్ని, రాముడిని, సనాతన ధర్మాన్ని ఎప్పుడు ఎలా వాడుకోవాలో కమల నాధులకు తెలిసినంత బాగా బహుశా మరెవ్వరికీ తెలియదనుకుంటా!

ఆనాడు రాజ్యాంగ రచనను, అమలును తీవ్రంగా వ్యతిరేకించిన ఆరెస్సెస్ తానులోని గుడ్డే కదా ఈ బీజేపీ. అందుకే దేశంలో మతాలతో సంబంధం లేకుండా అట్టడుగు, వెనకబడిన వారి అభ్యున్నతిని కోరుతూ అంబేద్కర్ నాయకత్వాన లిఖించిన రాజ్యాంగాన్ని 'తిరగ రాస్తాం, సమూలంగా మార్చేస్తాం' అంటూ రాజ్యాంగ విలువల్ని ధ్వంసం చేస్తున్న వాళ్లు ఇప్పుడు రాజ్యాంగం, దాని విలువల గురించి మాట్లాడడం విడ్డూరం! దేశంలో వెనకబడిన, అట్టడుగు జనాభాలో ముస్లింలు కూడా ఉన్నారనే విషయం బీజేపీకి తెలియనిది కాదు. ఇవన్నీ వారి ఓటు రాజకీయాల్లో భాగంగా చేస్తున్నదని దేశంలోని హిందువులు తెలుసుకోవాల్సిన కీలకమైన సమయమిది.

మిగిలిన పార్టీలన్నీ ముస్లింలకు అనుకూలమైన వనీ, తామొక్కరమే హిందువులను ఉద్ధరించేందుకు పుట్టినట్టు ప్రతి సభలో ఢంకా బజాయించి మరీ చెప్పుకుం టున్నారు బీజేపీ నాయకులు. మైనార్టీలైన ముస్లింలకు కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్ల వల్లనే దేశంలోని మోజార్టీ హిందువులకు తీవ్రమైన నష్టం కలిగినట్టు ఇప్పుడు చిత్రీకరిస్తున్నారు. ముస్లింల పట్ల తీవ్ర వ్యతిరేకతను సృష్టిస్తున్నారు. దేశ ప్రజల్లో మతోన్మాదాన్ని రెచ్చగొడుతు న్నారు. ఇలా బహిరంగ సభల్లో రాజ్యాంగానికి, ప్రజాస్వా మ్యానికి తూట్లు పొడిచే విధంగా మాట్లాడుతున్నా ఎలక్షన్ కమిషన్ చూసీ చూడనట్టు వ్యవహరించడం అత్యంత దారుణం.

ఇక దేశంలో హిందూరాజ్యమే మా ధ్యేయమని చెప్పుకుంటున్న బీజేపీ వల్ల హిందూ ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అంటే అదీ లేదు. మోడీ పదేండ్ల పాలనలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపో యాయి, ప్రజలు ఉన్న ఉపాధిని కోల్పోయారు, కొత్త ఉద్యో గాలు రాలేదు, జీఎస్టీ పేరుతో పన్నుల భారం పెంచారు. దళితులపై, మహిళలపై దాడులు పెరిగిపోయాయి. ఇలా బీజేపీ పాలనలో బాధపడుతున్న వారిలో హిందువులే అధికంగా ఉన్నారనే నిజాన్ని గుర్తించాలి.

దేశంలోని ఆదివాసీలు, గిరిజనుల కంటే కూడా ముస్లింలు అత్యంత దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. సచార్ కమిటి ఈ విషయాన్ని స్పష్టంగా వివరించింది. ఎన్నో పోరాటాల ఫలితంగా చివరకు ముస్లిం లకు ఆ మాత్రమైనా రిజర్వేషన్‌లు అమల్లోకి వచ్చాయి. కనీసం వీటిపై కూడా అవగాహనలేని ముస్లిం జనాభా మన దేశంలో నేటికీ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీటన్నింటినీ పక్కన పెట్టి కేవలం తమ అధికార పీఠాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలను తమ ఓటు బ్యాంకుగా వాడుకుంటు న్నారు కమల నాథులు. కార్పొరేట్ల భజన తప్ప సామాన్యుల సమస్యల గురించి పట్టించుకోని కాషాయ దళం ఇంతకు మించి గొప్పగా ఆలోచిస్తారను కుంటే అత్యాశే అవుతుంది.

కొన్ని రోజులు కష్టపడితే చాలు, మరో ఐదేండ్లు దేశాన్ని దర్జాగా దోచుకోవచ్చని కమల దళం ఉవ్విళ్లూరుతోంది. దేశం ఏమైనా మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తోంది. మళ్లీ అందలమె క్కాలని తహతహలాడుతోంది. దేశంలో ప్రమాద ఘంటికలు మారు మోగుతున్న నేపథ్యంలో బీజేపీ అబద్ధాల, మత విద్వేష ప్రచారం పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. కాలే కడుపులు, ఆకలి మంటలు మరిచి తమ మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పాలకులను ప్రజలు ఎన్నటికీ సహించరని నిరూపించాల్సిన సమయమిదే.

మెయిల్ @ నవతెంగాణ

డ్రెయినేజీ సమస్య పరిష్కరించండి సారూ...

నగరంలోని ఉప్పల్ నుంచి బోడుప్పల్ వెళ్లే రోడ్డుపై ఉన్న డ్రెయినేజీ నీరు వారానికి ఓసారి పొంగి పొర్లుతోంది. ఈ నీరంతా కూడా కాలనీల్లోకి ప్రవేశించడంతో రోడ్ల మీద పాదచారులకు నడవం ఇబ్బంది అవుతున్నది. అలాగే డ్రెయినేజీ కంపుతో దుర్వాసన వస్తున్నది. దీనికి శాశ్వత పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్‌కు కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా కంప్లయింట్ ఇస్తే వచ్చి క్లియర్ చేస్తారు. కానీ రోడ్లపైనున్న డ్రెయినేజీ చెత్తను తొలగించడం లేదు. దీంతో మరల కంప్లయింట్ ఇస్తే వచ్చి క్లియర్ చేసేసరికి మళ్లీ రోడ్డు మీద డ్రెయినేజీ పొంగుతున్నది. ఇది రోజూ షరామామూలైంది. ఈ సమస్యపై దాదాపు ఏడాది కాలంగా కార్పొరేటర్‌కు విన్నవిస్తే పట్టించుకోవడం లేదని కాలనీవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఒక్క డ్రెయినేజీనే కాదు రోడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉన్నది. చిన్నపాటి వర్షానికి పూర్తిగా గుంతలు, రాళ్లు పైకి లేచి వస్తున్నాయి. చిన్నచిన్న యాక్సిడెంట్స్ కూడా అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం అనేక స్కూల్ బస్సులు, ఆటో లు ఈ రోడ్డున వెళు తుంటాయి. అయినా కూడా అధికారులు రోడ్డును బాగు చేద్దామనే ఆలోచనకు రావడం లేదు. కనీసం కార్పొరేటర్ అయినా పట్టించుకుంటారనే ఈ సమస్యలను గాలికొదిలేశారు. వాస్తవానికి ఈ డ్రెయినేజీ సమస్య చాలా చిన్నది. పైనుంచి వస్తున్న దురేనేజ్ లైన్‌ను స్ట్రెయిట్‌గా కలిపేస్తే ఆ వాటర్ ఇరు పక్కలకు పొంగకుండా ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉన్నది. ఇప్పటికైనా ఈ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- ఎస్ఎస్ఆర్ఎ ప్రసాద్,
9490300867

ఆపితే నెతన్యాహు, కొనసాగిస్తే జోబైడెన్ పతనం!



ఎం కోటేశ్వరరావు
8331013288

పాలస్తీయునులపై ఇజ్రాయిల్ మారణకాండ రోజురోజుకూ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఓవైపు హమాస్‌తో చర్చలు అంటూనే మరోవైపు ఎడతెగని దాడులకు పాల్పడుతున్నది. బహిరంగంగా యుద్ధం ఆపాలని చెబుతున్నవారే, మళ్లీ వెనుకనుంచి ఆపొద్దని నెతన్యాహును హెచ్చరిస్తున్నారు. ఇది ఇలా కొనసాగుతుండగానే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండ పట్ల అమెరికాలో పెల్లుబికుతున్న నిరసనలు జోబైడెన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ యుద్ధం అమెరికాలో జరగబోయే ఎన్నికల మీద ప్రభావం చూపే అవకాశమున్నది. అందుకే నెతన్యాహు, జోబైడెన్ ఇప్పుడు ఇరకాటంలో పడ్డారు.

పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ మారణకాండ మంగళవారం నాటికి 214వ రోజుకు చేరుకుంది. కాల్పుల విరమణ ఒప్పందం గురించి చర్చలు సాగుతున్నాయి. తమకు అంగీకారమే అని హమాస్ చెప్పింది. ఎటూ తేల్చకపోగా రఫా నగరం మీద సైనికచర్యకు ముందుకు పోవాలని ఇజ్రాయిల్ యుద్ధ మంత్రివర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. మరొకవైపు చర్చలకు తమ ప్రతినిధులను పంపుతామని చెబుతూనే సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారే వరకు వైమానిక దాడులు జరుపుతూ రాఫా-ఈజిప్టు సరిహద్దు ద్వారం దగ్గర పాలస్తీనా వైపు ప్రాంతాన్ని ఇజ్రాయిల్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గాజాలోని పౌరులకు ఐరాస అందిస్తున్న సహాయాన్ని కూడా అడ్డుకుంటున్నాయి.దాడుల్లో అనేకమంది మరణించారు. మధ్యవర్తులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను హమాస్ ఆమోదించినప్పటికీ తమకు అంగీకారం కాదని, తమ డిమాండ్లకు చాలా దూరంగా ఉందని నెతన్యాహు కార్యాలయం చెప్పింది. సోమవారం నాటికి గాజాలో 34,735 మందిని ఇజ్రాయిల్ చంపివేసినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గాయపడిన వారు 78,108 మంది, గత 24 గంటల్లో మరణాలు 52, క్షతగాత్రులు 90 మంది అని వెల్లడించింది. రాఫాను ఖాళీ చేయాలని పౌరులను ఇజ్రాయిల్ ఆదేశించింది. ఇతర దేశాలకు ప్రత్యేకించి పక్కనే ఉన్న ఈజిప్టుకు వెళ్లకుండా దిగ్బంధనం గావించింది.ఇది రాసిన సమయానికి ఏం జరగనుందో తెలియని స్థితి.జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఒకటి స్పష్టం.ఏదో ఒక ఒప్పందం చేసుకొని హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని విడిపించాలని నెతన్యాహు మీద రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోంది.మరోవైపు హమాస్‌ను తుడిచిపెట్టకుండా వెనుదిరిగితే మీ సంగతి చూస్తామనే దురహం కారులు, మారణకాండకు మద్దతు ఇవ్వటాన్ని ఏమాత్రం సహించం అంటున్న విద్యార్థులపై జో బైడెన్ సర్కార్ కాల్పులకూ పాల్పడింది. గాజా దక్షిణ ప్రాంతంలోని రాఫా నగరం మీద దాడులకు దిగితే అక్కడ ఉన్న పిల్లలు పెద్ద సంఖ్యలో మరణించే అవకాశం ఉన్నందున హమాస్ ఒక అడుగు వెనక్కు తగ్గేందుకు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఒక్కముక్కలో చెప్పాలంటే మారణకాండను కొనసాగించకపోతే నెతన్యాహు, ముందుకు పోతే ఎన్నికల్లో జో బైడెన్ పతనం ఖాయంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. మారణకాండను అంతర్జాతీయ న్యాయ స్థానం కూడా అడ్డుకోలేకపోయింది. తన ఆదేశాన్ని ధిక్కరించిన ఇజ్రాయిల్‌ను ఏమీచేయలేని అశక్తురాలిగా మారింది.పాలస్తీనా పౌరులకు సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు యూదు వ్యతిరేకులంటూ అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ నిందించి మరింతగా రెచ్చగొట్టారు.

గాజాలో మారణకాండను ఖండిస్తూ అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగటంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్ ఇరకాటంలో పడ్డాడు. ఉద్యమాన్ని అణచివేసేందుకు పూనుకోవటంతో పాటు ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ మీద ఒత్తిడి తెస్తున్నట్లు నాటకం ప్రారంభించాడు.రాఫాపై దాడులను వ్యతిరేకిస్తున్నట్లు బైడెన్ స్పష్టం చేసినట్లు జాతీయ భద్రతా మీడియా సలహాదారు జాన్ కిర్బీ చెప్పాడు. అర్ధగంటపాటు నెతన్యాహు-జో బైడెన్ ప్రయివేటుగా నిర్మాణాత్మకంగా మాట్లాడుకున్నారని అన్నాడు. నెతన్యాహుతో మాట్లాడిన తరువాత జో బైడెన్ వైట్‌హౌస్‌లో జోర్డాన్ రాజు రెండవ అబ్దుల్లాకు అనధికారిక మధ్యాహ్న విందు ఏర్పాటు చేశాడు. ఇజ్రాయిల్ గనుక రాఫాపై దాడులకు దిగితే పెద్ద ఎత్తున మారణకాండ జరిగే అవకాశముందని అబ్దుల్లా హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి.

మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో అనేక మంది మరణించినట్లు వార్తలు. వైమానిక దళం జరిపిన దాడుల్లో అనేక భవనాలు నేలమట్టం కాగా అనేక మంది శిధిలాల్లో చిక్కుకుపోయారు. ఎందరు గాయపడింది, మరణించిందీ ఇంకా స్పష్టం కాలేదు. తమ ఆసుపత్రికి పదకొండు మృతదేహాలు వచ్చినట్లు రాఫాలోని కువాయిట్ ఆసుపత్రి వెల్లడించింది. హమాస్ వద్ద ఉన్న తమ బందీలను విడిపించే వరకు దాడులు కొనసాగిస్తూనే ఉంటామని, మరోవైపు చర్చలకు తమ ప్రతినిధి బృందాన్ని పంపు తామని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇరవైలక్షల మందికి పైగా పాలస్తీనియన్లు గాజాలో వున్నారు. వారి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఇజ్రాయిల్ మిలిటరీ తరలిస్తున్నది. ఈ క్రమంలో 64చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న రాఫా నగరం, పరిసరాల్లో లక్షల మంది తలదాచుకుంటున్నారు. హమాస్ సాయుధులు జనంలో కలసిపోయినందున వారిని పట్టుకోవాలంటే పెద్ద ఎత్తున దాడులు చేయకతప్పదని ఇజ్రాయిల్ చెబుతున్నది. అసలు ఆ సాకుతోనే ఏడు నెలలుగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే.రాఫా నుంచి వెళ్లిపోవాలని ఆదేశించటం ఏ మాత్రం సహించరాదని ఐరాస ప్రధాన కార్యదర్శి చెప్పారు. ఈ దాడులను వ్యతిరేకిస్తున్నట్లు అమెరికా కబుర్లు చెబుతున్నది. బందీల విడుదలకు తాత్కాలిక కాల్పుల విరమణ అని ఇజ్రాయిల్ చెబుతుండగా పూర్తిగా గాజా నుంచి వైదొలగాని హమాస్ పట్టుబట్టటంతో ఈజిప్టు రాజధాని కైరోలో జరుగుతున్న చర్చలు నిలిచిపోయాయి. సంప్రదింపుల ప్రక్రియ వెంటిలేటర్ మీద ఉంది, అందుకే ఒక మధ్యవర్తిగా ఉన్న కతార్‌తో చర్చలు జరిపేందుకు సిఐఏ డైరెక్టర్ బిల్ బరన్స్ వెళ్లినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొన్నది. మూడు దశల్లో ఒప్పందం అమలు జరుగుతుందని, తన వద్ద బందీలుగా ఉన్న 132 మందిలో 33 మందిని 42 రోజుల వ్యవధిలో విడుదల చేస్తుందని దీనికి ఇరు పక్షాలూ అంగీకరించినప్పటికీ తదుపరి రెండు దశల గురించి వివాదం ఏర్పడిందని తొలుత వార్తలు వచ్చాయి. కొత్త ప్రతిపాదనలను అంగీకరిస్తున్నట్లు సోమవారం హమాస్ ప్రతినిధి ఈజిప్టు, కతార్ మంత్రులకు ఫోన్ ద్వారా తెలిపినట్లు వార్తలు. ఇజ్రాయిల్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోగా రాఫా ప్రాంతం నుంచి పాలస్తీనియన్లు వెళ్లిపోవాలని విమానాల నుంచి వెదజల్లిన కరపత్రాల్లో ఆదేశించటమేగాక, రాత్రి నుంచి దాడులను కూడా ప్రారంభించింది. ఒప్పందం కుదిరినా, కుదరకున్నా దాడులు చేసి తీరుతామని నెతన్యాహు చెబుతున్నాడు.

కైరో చర్చలు సఫలమౌతాయని, తక్షణ, శాశ్వత కాల్పుల విరణమకు దారితీస్తాయని కతార్ విదేశాంగశాఖ ప్రతినిధి మహమ్మద్ అల్ అన్సారీ చెప్పారు.వ్యవధి కోసం హమాస్ నాటకమాడుతున్నదని, దాడులను నిలిపివేసేందుకు, చర్చల వైఫల్య నెపం తమపై నెట్టేందుకు చూస్తున్నదని ఇజ్రాయిల్ ఆరోపిస్తున్నది. రాఫా ఇప్పుడు బాలల నగరంగా మారిందని, దాడులు జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం ఉంటుందని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసిందని, రక్షణ కోసం పిల్లలు ఎక్కడకు వెళ్లాలో



రాఫా ఇప్పుడు బాలల నగరంగా మారిందని, దాడులు జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం ఉంటుందని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసిందని, రక్షణ కోసం పిల్లలు ఎక్కడకు వెళ్లాలో తెలియని స్థితిలో ఉన్నారని సంస్థ డైరెక్టర్ కాథరీన్ రసెల్ చెప్పారు. ఇప్పటికే అక్కడి పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎంతో బలహీనపడ్డారని, పిల్లలతో పాటు మొత్తం జనాన్ని రక్షించాల్సి ఉందన్నారు. ఇజ్రాయిల్ దాడులకు ముందు నగరం, పరిసరాల జనాభా రెండున్నరలక్షలు కాగా ప్రస్తుతం అక్కడ పన్నెండు లక్షల మంది తలదాచుకుంటున్నారని, వారిలో దాదాపు ఆరులక్షల మంది పిల్లలే ఉంటారని చెబుతున్నారు. హమాస్ ఒక మెట్టు దిగిరావటానికి ఇది కూడా ఒక కారణం అని చెప్పవచ్చు. దాడుల ప్రభావం పెద్దల మీద కంటే పిల్లల మీద ఎక్కువగా ఉంటుందని యూనిసెఫ్ హెచ్చరించింది.

తెలియని స్థితిలో ఉన్నారని సంస్థ డైరెక్టర్ కాథరీన్ రసెల్ చెప్పారు. ఇప్పటికే అక్కడి పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎంతో బలహీనపడ్డారని, పిల్లలతో పాటు మొత్తం జనాన్ని రక్షించాల్సి ఉందన్నారు. ఇజ్రాయిల్ దాడులకు ముందు నగరం, పరిసరాల జనాభా రెండున్నరలక్షలు కాగా ప్రస్తుతం అక్కడ పన్నెండు లక్షల మంది తలదాచుకుంటున్నారని, వారిలో దాదాపు ఆరులక్షల మంది పిల్లలే ఉంటారని చెబుతున్నారు. హమాస్ ఒక మెట్టు దిగిరావటానికి ఇది కూడా ఒక కారణం అని చెప్పవచ్చు. దాడుల ప్రభావం పెద్దల మీద కంటే పిల్లల మీద ఎక్కువగా ఉంటుందని యూనిసెఫ్ హెచ్చరించింది. రాఫా మీద దాడి అంటే ఏదో విహారయాత్ర అని భావిస్తే పొరపాటు తమ వారిని రక్షించేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. దాడులకు పాల్పడవద్దని సౌదీ అరేబియా విదేశాంగశాఖ ఇజ్రాయిల్‌ను హెచ్చరించింది.

తమ నేత జో బైడెన్‌కు గాజా మరో వియత్నాంగా మారుతున్నదని, అయితే డోనాల్డ్ ట్రంప్‌ను వెనక్కు కొట్టేందుకు తాను బైడెన్‌కు మద్దతు ఇస్తున్నట్లు డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ ప్రకటించాడు. గాజాలో మారణకాండను ఖండిస్తూ అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగటంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్ ఇరకాటంలో పడ్డాడు. ఉద్యమాన్ని అణచివేసేందుకు పూనుకోవటంతో పాటు ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ మీద ఒత్తిడి తెస్తున్నట్లు నాటకం ప్రారంభించాడు.రాఫాపై దాడులను వ్యతిరేకిస్తున్నట్లు బైడెన్ స్పష్టం చేసినట్లు జాతీయ భద్రతా మీడియా సలహాదారు జాన్ కిర్బీ చెప్పాడు. అర్ధగంటపాటు నెతన్యాహు-జో బైడెన్ ప్రయివేటుగా నిర్మాణాత్మకంగా మాట్లాడుకున్నారని అన్నాడు. నెతన్యాహుతో మాట్లాడిన తరువాత జో బైడెన్ వైట్‌హౌస్‌లో జోర్డాన్ రాజు రెండవ అబ్దుల్లాకు అనధికారిక మధ్యాహ్న విందు ఏర్పాటు చేశాడు. ఇజ్రాయిల్ గనుక రాఫాపై దాడులకు దిగితే పెద్ద ఎత్తున మారణకాండ జరిగే అవకాశముందని అబ్దుల్లా హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. ఏడు నెలల దాడుల తరువాత గాజాలో తీవ్రమైన కరవు పరిస్థితి ఏర్పడిందని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమ అధిపతి సిండీ మెకెయిన్ చెప్పాడు.తన మీద ప్రపంచ నేతలెవరూ ఏమాత్రం ఒత్తిడి తేలేరని, ఏ అంతర్జాతీయ సంస్థా ఇజ్రాయిల్ తనను తాను కాపాడుకోవటాన్ని అడ్డుకోజాలదని నెతన్యాహు ఆదివారం నాడు చెప్పాడు.

కొలంబియా విశ్వవిద్యాలయాన్ని అదుపులోకి తీసుకున్న న్యూయార్క్ పోలీసుల్లో ఒకడు విద్యార్థుల మీద కాల్పులు జరిపినట్లు వార్తలు వచ్చాయి. వారి వెనుక బయటి శక్తుల హస్తం ఉందనే సాకుతో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నది.దీనికి కార్పొరేట్ మీడియా మరింతగా ఆజ్యం పోస్తున్నది.ప్రభుత్వ యంత్రాంగం ఎంతగా రెచ్చగొడుతుంటే అంత ఎక్కువగా విద్యార్థులు ఆందోళనలకు దిగుతున్నారు. గుడారాలను పీకివేస్తే వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. దొంగే దొంగని అరచినట్లుగా విద్యార్థుల నిరసనలను తప్పుదారి పట్టించేందుకు ఇజ్రాయిల్ అనుకూలురను రెచ్చగొట్టి పోటీ ప్రదర్శనలను చేయించటం, ఆ ముసుగులో పొరదుస్తుల్లో ఉన్న పోలీసులు, బయటివారిని రప్పిస్తున్నట్లు అనేక చోట్ల స్పష్టమైంది. వారు విద్యా ప్రాంగణాల్లో ప్రవేశించి దాడులు చేస్తున్నారు. యూదు వ్యతిరేక నినాదాలు చేస్తూ విద్యార్థుల ఆందోళనను తప్పుదారి పట్టించేందుకు చూస్తున్నారు. ఇలాంటి వారి చర్యలను చూపి మీడియా దాడులకు దిగుతున్నది. మీడియాకు జరుగుతున్నదేమిటో తెలిసినప్పటికీ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది కనుక దాని ప్రాపకం కోసం కట్టుకథలు రాస్తున్నది, పిట్టకథలు చెబుతున్నది. పార్లమెంటు సభ్యుల కమిటీల పేరుతో విద్యాసంస్థల చాన్సలర్లు, అధ్యక్షులు, ఇతర అధికారులతో సమావేశాలను ఏర్పాటు చేసి ఆందోళనను అదుపు చేసేందుకు తీసుకుంటున్న చర్యలేమిటని అడ్డదిడ్డంగా ప్రశ్నిస్తున్నారు. గట్టిగా వ్యవహరించక పోతే రాజీనామా చేసి ఇంటికిపొండని ఒత్తిడి తెస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచి వేయకపోతే తాము ఇచ్చిన విరాళాలను స్తంభింపచేస్తామని బెదిరించేందుకు దాతలను రంగంలోకి దించారు. నిజానికి వీరంతా బయటివారు తప్ప ఆందోళన చేస్తున్న వారు లేదా వారికి మద్దతు ఇస్తున్నవారు కాదు. ఇలాంటి వారిని చూసి ఆందోళనలకు దూరంగా ఉన్నవారు తొలిరోజుల్లో పొరపాటు పడినా అనేకమంది ఇప్పుడు తోటి విద్యార్థులతో చేతులు కలుపుతున్నారు. అమెరికా పాలకుల నైజాన్ని బయటపెడుతున్నారు.

నోటాతో మోడీ పోటీ!



భరత్ చౌహాన్
9030666999

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వా మ్య దేశంగా గొప్పలు చెప్పుకునే దేశంలో అసలు ప్రతిపక్షం అనేది ఉండకూడదా? ప్రతిపక్షాలు ఆందోళన పడుతున్నట్టుగా నిజంగానే మోడీ మరోసారి అధికారం చేపడితే భారత దేశంలో ఇవే చివరి ఎన్నికలా? ఇన్నాళ్లుగా తన అధికారం కోసం కుల, మతాల మధ్య వైషమ్యాలు పెట్టి అది పారక ప్రతిపక్ష పార్టీల నేతలను ఈడి పేరుతో జైళ్లో పెట్టించాడు. కానీ ఇప్పుడు ఏకంగా కుర్చీ కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులనే ట్యాంపర్ చేస్తూ తనకు ప్రత్యర్థులు లేకుండా చేసుకుంటు న్నాడు. అంటే ఇదో రకంగా మోడీ నోటాతో పోటీ పడుతున్నట్టే. ఎందుకంటే ఏ స్థానాలైతే అసంబద్ధంగా కైవసం చేసుకోవాలని చూస్తున్నాడో, ఆ పార్లమెంటు నియోజకవర్గాల ప్రజల పరిస్థితి ఏంటి? వారికి ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఎక్కడుంటుంది?

లోక్‌సభ ఎన్నికలలో ఎన్నో దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభాని నామినేషన్ రద్దుకావడం, ఇతర ఇండిపెండెంట్లు బరిలోనుంచి తప్పుకోవడంతో బీజేపీ అభ్యర్థి ముకేష్ దలాల్ పోటీ లేకుండా అసంబద్ధంగా ఏకగ్రీవమయ్యారు. అక్కడ దాదాపు 18 లక్షల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని, తమకు నచ్చిన ప్రజా ప్రతినిధి ఎన్నుకునే అవకాశం లేకుండా పోయింది. తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బమ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని బీజేపీలో చేరడం రాజకీయం మరింత రాజుకుంది. మే 13న మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి ఇండోర్ లోక్‌సభా స్థానానికి మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు నామినేషన్ల ఉపసంహరణకు సరిగ్గా చివరి రోజు వెళ్లి తాను పోటీ నుంచి తప్పుకుంటున్నాని అందరూ చూస్తుండగానే మీడియా ముఖంగా తన నామినేషన్ ఉపసంహరించు కున్నారు."ప్రధాని మోడీ మార్గదర్శ కత్వంలోని బీజేపీ ప్రగతిశీల ఆలోచనలు నచ్చి మా సహచరుడు కైలాస్ విజయ వర్గీయ, ఎమ్మెల్యే రమేష్ మెండోలాతో కలిసి, లోక్‌సభ అభ్యర్థిత్వం నుంచి వైదొలిగి బీజేపీలో చేరుతున్న అక్షయ్ కాంతి బమ్‌కు సాదర స్వాగతం పలుకుతున్నా" అని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రకటిం చారు. దీన్నిబట్టి చూస్తే ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందని తెలుస్తోంది.



ఇండోర్‌లో అక్షర కాంతి బామ్ నామినేషన్ ఉపసంహరించుకోవడంలో ఉన్న ఆంతర్యమేమిటి? నిజంగానే మోడీ సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యా డా? కానీ వాస్తవంగా పరిశీలిస్తే దీనికి వెనుక పెద్ద రాజకీయ కుట్రకోణం దాగుందనిపిస్తోంది. సరిగ్గా అభ్యర్థి తన నామినేషన్ ఉపసంహరించుకొనే మూడు రోజుల ముందు 17 ఏండ్ల కిందటి స్థల వివాదం కేసును బయటకు తీశారు. ఓ వ్యక్తిని బెదిరించాడని సెక్షన్ 307 కింద కోర్టుకు హాజరు కావాలని నోటీసులు అందాయి. ఆ తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పార్టీలో చేరాడు. ఇదంతా యాధృచ్ఛికంగా జరిగిందనుకుంటే పొరపాటే! నాగపూర్ తర్వాత ఇండోర్ ఆరెస్సెస్‌కు అత్యంత ముఖ్యమైన స్థావరం. అలాంటి ఇండోర్‌లో గత 40 ఏండ్లుగా అంటే 2019 వరకు అక్కడ సుమిత్ర మహజన్ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. అయితే 2019లో శంకర్ లల్వానీకి టికెట్టిచ్చి ఐదు లక్షల భారీ మెజార్టీతో గెలిపించింది బీజేపీ. అంత మెజార్టీ స్థాయిలో గెలిచిన పార్లమెంటు సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ని ఎందుకు విత్‌డ్రా చేయించింది? దీన్ని బట్టి చూస్తే ఓటమి భయం బీజేపీని వెంటాడుతుందా? అంటే దీన్నిబట్టి చూస్తే అదే అర్థమవుతున్నది. అందుకే బీజేపీ అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ఇండోర్ వరకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తుందా? అన్న వాదనలకు బలం చేకూరుస్తున్నది.

ఇప్పటికే తన అధికారానికి అడ్డుగా ఉన్నారని కేజ్రీవాల్, లొంగడం లేదని హేమంత్ సోరెన్ లాంటి ముఖ్యమంత్రుల మీద కేసులు పెట్టించి ఈడి పేరుతో జైల్లో పెట్టడం చూశాం. అది చాలదంటూ ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నాయకులన సామ, దాన, భేద, దండో పాయాలు ఉపయోగించి లొంగదీసుకుంటున్నాడు. ప్రతిపక్ష నాయకులు 'ఉంటే మోడీ జేబులో ఉండాలి.. లేదంటే జైల్లో ఉండాలి' అనే విధంగా తయారైంది బీజేపీ రాజకీయ వ్యవహారం. మొన్న ఖజురహో! నిన్న సూరత్! నేడు ఇండోర్, మరి రేపు ఎక్కడో? మోడీ అధికార దాహానికి ఎన్ని స్థానాల్లో ఓటర్లు ఓటేయకుండా బలికావాలి? బీజేపీ ఇంత అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా కూడా ఎన్నికల కమిషన్ చూసీ చూడనట్లు వ్యవహరించడం శోచనీయం.

మొన్న ఖజురహోలో సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి మీరా యాదవ్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీనికి కారణాలు బయటకు పొక్కకున్నా ఇందులో బీజేపీ పాత్ర ఉందనేది ప్రతిపక్షాల ఆరోపణ. ఇండోర్‌లో కేవలం ఒకే ఒక్క జాతీయ పార్టీ బీజేపీ మాత్రమే పోటీలో ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత, ప్రజల కొరకు, ఎన్నుకోబడిన వారే ప్రజాప్రతినిదులు కావాలి కానీ బీజేపీ ఎవరు పోటీలో ఉండాలో, ఉండకూడదో నిర్ణయిస్తున్నది. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం. ఇలా పోటీలో ప్రతిపక్షం అనేది ఉండకూడదు అనుకున్నపుడు ఇంకా ఎన్నికలు నిర్వహించడం ఎందుకు? ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ముందుకు వచ్చి పౌరుడు తనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే స్వేచ్ఛని ఉండాలి. ప్రజల్లో ఓటు గొప్పతనాన్ని చాటి చెప్పి ఓటింగ్ శాతం పెంచే విధంగా కృషి చేయాలి. కానీ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఏకపక్షంగా ప్రతిపక్షం లేకుండా ఏకగ్రీవం చేయడం, వారికి పోటీ అనుకున్నవారిని బలవంతంగా తప్పించడం బీజేపీ నిజస్వరూపాన్ని బయటపెడుతున్నాయి.

ఇప్పటికే తన అధికారానికి అడ్డుగా ఉన్నారని కేజ్రీవాల్, లొంగడం లేదని హేమంత్ సోరెన్ లాంటి ముఖ్యమంత్రుల మీద కేసులు పెట్టించి ఈడి పేరుతో జైల్లో పెట్టడం చూశాం. అది చాలదంటూ ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నాయకులన సామ, దాన, భేద, దండో పాయాలు ఉపయోగించి లొంగదీసుకుం టున్నాడు. ప్రతిపక్ష నాయకులు 'ఉంటే మోడీ జేబులో ఉండాలి.. లేదంటే జైల్లో ఉండాలి' అనే విధంగా తయారైంది బీజేపీ రాజకీయ వ్యవహారం.

మొన్న ఖజురహో! నిన్న సూరత్! నేడు ఇండోర్, మరి రేపు ఎక్కడో? మోడీ అధికార దాహానికి ఎన్ని స్థానాల్లో ఓటర్లు ఓటేయకుండా బలికావాలి? బీజేపీ ఇంత అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా కూడా ఎన్నికల కమిషన్ చూసీ చూడనట్లు వ్యవహరించడం శోచనీయం. ఇదంతా చూస్తూ ఉంటే వామపక్షాలు చెబుతున్నట్టు 2024లో మళ్లీ మోడీ అధికారంలోకి వస్తే ఇవే చివరి ఎన్నికలవుతాయి అనేది నిజం కాబో తుందా? ప్రజాస్వామ్య మనుగడ అనేది ఇక ప్రశ్నార్థక మేనా? ప్రజలు ఆలోచించాల్సిన సమయమిది.

ఓటు విలువ తెలుసుకో..



ఓటంటే ఒట్టి మాటల కోట కాదు
ఓటంటే ప్రజాస్వామ్య బాట
ఓటంటే ఇంకు చుక్క కాదు
ఓటంటే వ్యవస్థనే
మార్చుకునే వెలుగు చుక్క

ఓటంటే చిత్తుకాగితం కాదు
ఓటంటే ప్రజా చైతన్యగీతం
ఓటంటే కీర్తి కిరీటం కాదు
ఓటంటే స్ఫూర్తి పోరాటం

ఓటంటే అసామాన్య స్వరబాణి కాదు
ఓటంటే సామాన్య జనవాణి
ఓటంటే అమ్ముకునే సరుకు కాదు
ఓటంటే నీ అంబులపొదిలో శరము

ఓటంటే అపరిచిత పదం కాదు
ఓటంటే ఆత్మశుద్ధి వాక్యం
ఓటంటే స్వార్థాల వ్యవహారం కాదు
ఓటంటే నిస్వార్థాల సమహారం

ఓటంటే నిన్ను ఎత్తుకునే సంపతి కాదు
ఓటంటే నున్ను హత్తుకునే సోపతి
ఓటంటే రాచరికపు పీఠం కాదు
ఓటంటే రాజ్యాంగపు పాఠం

ఓటంటే వాగ్దానాల వర్షం కాదు
ఓటంటే వమ్ముకాని హర్షం
ప్రజాస్వామ్య పరిరక్షణకే ఈ యుద్ధం
బాధ్యతగా వేసే ఓటే ప్రగతికి అద్దం..!

డా.కటుకోఝ్వల రమేష్
సెల్: 9949083327



పొంగులేటి సమక్షంలో చేరికలు

నవతెలంగాణ -కూసుమంచి
మండలంలోని నాయకన్ గూడెం గ్రామం నుంచి కంచర్ల వీరారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అజ్మీర తండా, హర్యాన్ తండా, గోరిలపాడు నుంచి పలువురు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అన్ని వర్గాల వారికి లబ్ధి కలుగుతుందని చెప్పారు. పార్టీలో చేరిన వారందరికీ అండగా ఉంటామని అభయమించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా శ్రమించి.. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు లింగారెడ్డి, సింగం దామోదర్, జహంగీర్, షరీఫ్, కాంగ్రెస్ నాయకులు మారోజు భీష్మ చారీ, గొల్లపూడి వీరన్న, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచర్ల సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు మృతి



నవతెలంగాణ-ఖమ్మంరూరల్
మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరాలు బొడ్డు పార్వతమ్మ (93) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌లు బొడ్డు పార్వతమ్మ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఆమెకు భర్త పుల్లయ్య, కుమారుడు కోటయ్య ఉన్నారు. కోటయ్య సుమారు 15 సంవత్సరాల పాటు కొండాపురం సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శిగా సేవలందించారు. పార్వతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సీపీఎం నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, కే.నర్సయ్య, జి.ఉపేందర్, తమ్మినేని రంగయ్య, గుర్రం సూరయ్య, తమ్మినేని వీరభద్రయ్య, దండ్యాల సత్యనారాయణ, గ్రామ పెద్దలు దండ్యాల వెంకటేశ్వరరావు, నాగండ్ల శ్రీనివాసరావు, యలమద్ది వెంకటనారాయణ, పలువురు కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి సిటిజన్స్ ఫోరమ్ మద్దతు



నవతెలంగాణ-సత్తుపల్లి
ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డికి తెలంగాణ సిటిజన్స్ ఫోరమ్ (టీసీఎస్) సంపూర్ణ మద్దతును ప్రకటించింది. మంగళవారం ఆ ఫోరమ్ కన్వీనర్ ఎన్ కృష్ణమోహన్ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను ఫోరమ్ సభ్యులతో కలిసి ఆమె క్యాంపు కార్యాలయంలో కలుసుకొని మద్దతును ప్రకటించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి అంగీకరించారని ఫోరమ్ బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ 317 జీవో బాధితులకు న్యాయం చేయడం, పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల, ఆరోగ్య కార్డుల సక్రమ అమలు, బకాయిల చెల్లింపులు, 398 స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా చూస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఫోరమ్ బాధ్యులు దామోదరరెడ్డి, చంద్రశేఖర్, శ్రీను, కొండలరావు, సీతారామయ్య, రమణ, కృష్ణయ్య, మధుసూదనరాజు పాల్గొన్నారు.

మద్యం బాటిల్స్ పట్టివేత

నవతెలంగాణ-ముదిగొండ
పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఎన్నికల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో మంగళవారం పోలీసులు బెల్ట్ షాపులు తనిఖీలు నిర్వహించారు, తనిఖీల్లో వల్లాపురం, బాణాపురం గ్రామాల్లో రూ.10 వేలు విలువ చేస్తే మద్యం బాటిల్స్‌ను పట్టుకుని సీజ్ చేసి వల్లాపురానికి చెందిన ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఆశా వర్కర్లకు చీరెలు పంపిణీ

నవతెలంగాణ- ఎర్రుపాలెం
కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా ప్రతి గ్రామంలో తమ సేవలు అందించిన ఆశ కార్యకర్తలకు మంగళవారం చీరెలు పంపిణీ చేశారు. బనిగండ్లపాడు గ్రామంలో గల సుదర్శన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 48 మంది ఆశా కార్యకర్తలకు చీరెలను పాస్టర్ బాణాల జగదీష్ పాల్ అందించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ తమ కుటుంబాలకు అండగా ఉండాల్సిన కష్ట సమయాలలో ప్రజల ప్రాణాలు కాపాడటానికి అహర్నిశలు కృషి చేశారని, వారిని గౌరవించడం అభినందనీయమన్నారు.

వర్షంతో ఉపశమనం

నవతెలంగాణ-ఎర్రుపాలెం
తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగలాడిపోతున్న సమయంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు వేడి నుండి ఉపశమనం పొందారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎండ వేడితో సతమతమవుతున్న ప్రజలకు కొంత ఉపశమనం పొందారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్
వైరాలోని ప్రముఖ వ్యాపారవేత్త నాళ్ళ సాంబశివరావు తన తల్లి జ్ఞాపకార్థం మంగళవారం 'నీ తోడు' వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎనిమిదవ వార్డు బ్రాహ్మణపల్లిలోని పేదలైన వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇండ్లకు వెళ్లి దాదాపు 50 భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది నాళ్ళ సాంబశివరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, నీ తోడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు నందిగామ మనోహర్ అన్నారు. కార్యక్రమంలో నీ తోడు వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో రెండు గేదెలు మృతి

నవతెలంగాణ-కారేపల్లి
బాజుమల్లాయిగూడెం సమీపంలో సోమవారం వీచిన ఈదురుగాలులకు కరెంట్ వైర్లు తెగి పడ్డాయి. పుసులూరి రాంబాబు, కొంక రాములకు చెందిన పాడిగేదెలు ఆ ప్రాంతానికి మేతకు వెళ్ళిన క్రమంలో నేలపై పడిన విద్యుత్ వైర్లు తాకి విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. బాధిత రైతులను విద్యుత్ అధికారులు ఆదుకోవాలని చీమలపాడు మాజీ సర్పంచ్ అజ్మీర కిషోర్ కోరారు.

రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



నవతెలంగాణ- ముదిగొండ
ఖమ్మం పార్లమెంటు ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండల పరిధిలో వనంవారి కిష్టాపురంలో ముదిగొండ సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారు. రఘురామిరెడ్డి గుర్తు అయిన హస్తం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యలగొండస్వామి ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దమ్మాలపాటి సరస్వతి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించండి

- కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్



నవతెలంగాణ ఖమ్మం
సీపీఐ(ఎం) బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం ఖమ్మంలోని రేవతి సెంటర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ మాట్లాడుతూ మూడోవ సారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని, దేశంలో సంక్షోభం వస్తుందని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి దేశంలో సంక్షోభం వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపి పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అండగా మోడీ ఉన్నారని తెలిపారు. మత ఉన్మాదాన్నీ పెంచి పోషిస్తున్న బిజెపిని ఓడించి, రాజ్యాంగాన్ని లౌకిక విధానాలను పరిరక్షించే ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, టి.విష్ణు, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సిహెచ్ బద్రం, బుర్రి శోభారాణి, జె.వెంకన్న బాబు, డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రచారంలో పొంగులేటి సతీమణి మాధురి



నవతెలంగాణ-వైరాటౌన్
మండల పరిధిలోని ముసలిమడుగు, కేజీ సిరిపురం(కేజి), పుణ్యపురం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి మాధురి ప్రచారం నిర్వహించారు. పొంగులేటి మాధురికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, పొంగులేటి మాధురీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిని గెలిపించాలని కోరారు. పుణ్యపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పొంగులేటి సతీమణి మాధురి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, బానోత్ విజయాబాయి, రాంపూడి రోశయ్య కట్ల రంగారావు, వెంకట నర్సిరెడ్డి, మచ్చా వెంకటేశ్వరరావు, సిరిపురం మాజీ సర్పంచ్ ప్రసుమాంభ, మచ్చ నరసింహారావు, పమ్మి అశోక్, నంబూరు కనకదుర్గ, గద్దే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-ఖమ్మం రూరల్
సీపీఐ(ఎం), సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని యం.వెంకటాయపాలెం, మద్దులపల్లి, కాచిరాజుగూడెం గ్రామాల్లో సీపీఎం శ్రేణులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడారు. మతోన్మాద బిజెపి అధికారంలోకి రాకుండా ఉండాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో అభ్యుదయవాదులు హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, మండల నాయకులు పి.మోహన్‌రావు, పి.సంగయ్య, తోట పెద్ద వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, పొన్నం వెంకటరమణ, ఏపూరి వరకుమార్, గురవయ్య, మురళి, తిరుమలయ్య, పి.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కుక్కల సైదులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ అభ్యర్థికే మా మద్దతు

ఎన్డీఏతో పొత్తులో భాగంగా నిర్ణయం

టీడీపీ ఖమ్మం పార్లమెంటు అధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం

నవతెలంగాణ- ఖమ్మం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఎన్డీఏతో పొత్తులో భాగస్వామ్యమై వెళ్తున్న సందర్భంగా తెలంగాణలో కూడా ఎన్డీఏకు తెలుగుదేశం పార్టీ మద్దతిస్తుందని ఖమ్మం పార్లమెంటు అధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం అన్నారు. మంగళవారం ఖమ్మంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టీడిపి అభ్యర్థి పోటీలో లేనందున ఖమ్మం పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా పోటీలో ఉన్న తాండ్ర వినోదరావుకి అధిష్టానం నిర్ణయం ప్రకారం కార్యకర్తలు ఓటు వేసి పూర్తి మద్దతు ఇస్తామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కొండబాల కర్ణకర్, మల్లాది హనుమంతరావు, కేతినేని హరీష్, మల్లెంపాటి అప్పారావు, కాపా కృష్ణమోహన్, కనుకుంట్ల కుమార్, గుత్తా సీతయ్య, చేకూరి చలపతిరావు, ఆరెం వరలక్ష్మి, చుండూరు రాజేశ్వరి, మేడేపల్లి రాణి, కల్యాణపు లక్ష్మీపతి, ఆర్ఎం రామయ్య, సానబోయిన శ్రీనివాస్‌గౌడ్, మందపల్లి కోటి, ప్యారిస్ వెంకన్న, నాగార్జున శ్రీనివాస్, పసలం వెంకటేశ్వర్లు, క్రిష్ణ ప్రసాద్, కర్నాటి అశ్వనీకుమార్, దొడ్డా క్రిష్టారావు, చావా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-ఖమ్మం
ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువాళ్ళ దుర్గ ప్రసాద్, ఖమ్మం నగర అధ్యక్షుడు ఎండీ జావేద్, కార్పొరేటర్ కమర్తపు మురళీ సమక్షంలో 42వ డివిజన్ కార్పొరేటర్ పాకలపాటి విజయనిర్మల, శేషగిరి ఆధ్వర్యంలో 42వ డివిజన్ నుండి బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బెజ్జనబోయిన రమాదేవి, డివిజన్ మహిళా సెక్రటరీ ఎస్కే పర్వీన్, రేగుల అమల, నాగటి మౌనిక, భూమిక, రషీద్, రాంప్రసాద్, రాంబాబు, రమేష్ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ఎస్కే గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు
46 డివిజన్లో ఖమ్మం నగర ఓటీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షుడు రజి ఆధ్వర్యంలో కురుమ సంఘం, కుమ్మరి సంఘం, రజక సంఘం కుటుంబాలు బిఆర్ఎస్‌కు మూకుమ్మడిగా రాజీనామా చేసి సుమారుగా 500 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, పీసీసీ మెంబర్ మొహమ్మద్ జావేద్, ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రం బాలగంగాధర్ తిలక్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. భారీ మెజారిటీతో రఘురాంరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

పార్లమెంట్‌లో మన సమస్యలు వినిపించే గొంతుక 'నామ'



నవతెలంగాణ-ఖమ్మంరూరల్
తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీయేనని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని ముత్తగూడెం, ఆరెకోడు, కాచిరాజుగూడెం, ఏదులాపురం గ్రామాల్లో ఉపాధిహామీ పని ప్రదేశాల్లో మంగళవారం నామా గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాదాన్ని వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కారు గుర్తుకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను గెలిచినా, ఓడినా నిత్యం ప్రజల్లోనే ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలు ఒకసారి మోసపోయారని...ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పాలేరు నియోజకవర్గంలో నామాకు అత్యధిక మెజార్టీ రావాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు గోపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బోనకల్ : పార్లమెంటులో మన సమస్యలు వినిపించే గొంతుక ఖమ్మం బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. మండల పరిధిలోని చిరునోముల, ముష్టికుంట్ల, బోనకల్ గ్రామాలలో నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కమల్‌రాజు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి నామా నాగేశ్వరరావు కరపత్రాలను పంపిణీ చేశారు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి నామా నాగేశ్వరరావుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రావడం కోసం పార్లమెంట్ బిల్లుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడు నామ నాగేశ్వరరావు అని అన్నారు. నామ నాగేశ్వరరావుని అత్యధిక మెజారిటీతో గెలిపించడం వలన ఖమ్మం జిల్లా ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం చిరునోముల గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి నామ నాగేశ్వరరావుని అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ నామ నాగేశ్వరరావుని మండల, గ్రామ, బూత్ లెవెల్ నాయకులు కష్టపడి పని చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంటులో దేశవ్యాప్తంగా ఎక్కువ సమయం ప్రజా సమస్యల కోసం మాట్లాడిన ఏకైక ఎంపీ నామా నాగేశ్వరరావు అని అన్నారు అటువంటి వ్యక్తి పార్లమెంటులో ఉంటే ప్రజలకు ఉపయోగమన్నారు. ఎన్నికల అప్పుడే ప్రజల వద్దకు వచ్చే పార్టీల అభ్యర్థులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం అభివద్ధి కోసం నామా నాగేశ్వరరావు 10 సంవత్సరాలు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ముష్టికుంట్లలో బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజి మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ కొండ, రైతు రైతుబంధు మాజీ మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, ముష్టికుంట్ల మాజీ ఉపసర్పంచ్ షేక్ హుస్సేన్ సాహెబ్ నాయకులు కాకాని శ్రీనివాసరావు, కంచర్ల అచ్చయ, గుండపనేని సుధాకర్ రావు, మాజి సర్పంచ్ జెర్రిపోతుల రవీంద్ర, మొర్ల నరసింహారావు, మంద హైమావతి, గుగులోతు శ్రీనివాసరావు, చెల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ విపి గౌతమ్



నవతెలంగాణ- ఖమ్మం
జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుండి ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దష్ట్యా అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బుధవారం సాయంత్రంలోగా ఖమ్మం నగరపాలక సంస్థకు నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో నాణ్యత విషయమై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుండి సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ ఎక్కడైనా లీకేజీలు ఉంటే నీరు కలుషితమవుతుందని, ఇందుకై జాగ్రత్తలు తీసుకోవాలని, లీకేజీలను వెంటనే నియంత్రించాలన్నారు. తాగునీటి వనరులు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. కొత్త కాలనీలకు లైన్లు వేసి, కనెక్షన్లు ఇచ్చి, నీటి సరఫరాకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. బోర్లు ఎండిపోయిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్యలకు వెంటనే స్పందించాలని, అధికారులు సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మిషన్ భగీరథ ఎస్ఇ సదాశివ కుమార్, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ హరికిషన్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల కనీస సౌకర్యాల కల్పన పనులు ఈ నెల 10లోగా పూర్తి చేయాలి
పోలింగ్ కేంద్రాల కనీస సౌకర్యాల కల్పన పనులు ఈ నెల 10లోగా పూర్తి చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న లోకసభ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా పోలింగ్ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు ఒక రోజు ముందుగానే చేరుకుంటాయని, అందుకు వీలుగా ఈ నెల 10 లోగా మంజూరు పనులన్నీ పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 438 పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు రూ.13.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలకు రూ.25 నుండి 50 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చామన్నారు. ఎంపిడిఓలకు రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేశామన్నారు. ఎంపిడిఓలు పనుల పూర్తికి బాధ్యత వహించాలన్నారు. జిల్లాలో కొత్తగా టాయిలెట్ కమ్ బాత్రూంల నిర్మాణాలకు మంజూరులు ఇచ్చినట్లు, ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి నీటి అవసరాలకు సంప్‌లు లేని పాఠశాలలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసినట్లు, ఇబ్బందులు కలగకుండా ఆయా పాఠశాలల్లో సంప్‌ల నిర్మాణాలకు మంజూరులు ఇచ్చామని, ఈ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు, ఎస్డీఎఫ్, సిడిఎఫ్‌ల కింద చేసిన మంజూరు పనులు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ రోజుకు ముందు రోజు, పోలింగ్ రోజున పోలింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న ప్రతిఒక్కరికి నీడ ఉండాలని, ఈ దిశగా షామియానాల ఏర్పాటుకు కార్యాచరణ చేయాలన్నారు. చల్లని తాగునీరు అందించాలని ఆయన తెలిపారు. వడగాలుల దృష్ట్యా పోలింగ్ సిబ్బంది సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. పోలింగ్ రోజున సీనియర్ సిటీజన్స్, దివ్యాంగుల రవాణాకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు, అ వాహనాలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్టిక్కరింగ్ చేయాలని, ఈ వాహనాలను పోలింగ్ కేంద్రం లోపలకు క్యారిడార్ వరకు అనుమతించేలా చూడాలని ఆయన తెలిపారు. ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణతో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డిఇఓ సోమశేఖరశర్మ, జెడ్పీ సిఇఓ వినోద్, డిపిఓ హరికిషన్, మిషన్ భగీరథ ఎస్ఇ సదాశివ కుమార్, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఆర్అండ్‌బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, విద్యాశాఖ ఇఇ నాగశేషు, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోని పూడిక మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
చెరువుల్లోని పూడిక మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పనుల కింద చెరువుల్లో పూడికతీత పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులు సంబంధిత ఎంపిడివో, అదనపు ప్రోగ్రాం అధికారులను సంప్రదించి ట్రాక్టర్ రవాణా ఖర్చును భరించి ఉచితంగా పూడిక మట్టిని తమ పంట పొలాలకు తీసుకెళ్లవచ్చని ఆయన అన్నారు. ఉపాధి హామీ కింద జిల్లాలోని 20 మండలాల్లో 304 చెరువు పూడికతీత పనులు 277 గ్రామ పంచాయతీలో జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. చెరువు పూడికతీత ద్వారా వచ్చిన మట్టిని ఇప్పటి వరకు 3820 మంది రైతులు తమ పొలాలకు తరలించుకుంటున్నట్లు ఆయన అన్నారు. పూడిక మట్టితో చాలా లాభాలు ఉన్నట్లు, పూడిక మట్టి పంటకు జీవమని కలెక్టర్ అన్నారు. చెరువు మట్టిలో ఎన్నో పోషక విలువలుంటాయని, తగినంత పాళ్లలో నత్రజని, పొటాషియం, ఫాస్పరస్, జింక్, బోరాన్, సేంద్రియ కార్బన్ పదార్థాలు, మొక్కల ఎదుగుదలకు దోహదం చేసే బ్యాక్టీరియాలు పూడిక మట్టిలో ఉన్నాయని, పరిశోధనల్లో తేలిందని ఆయన తెలిపారు. రైతులు పూడిక మట్టి వాడడం వల్ల 50 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని, పంట దిగుబడి పెరుగుతుందని ఆయన అన్నారు. పూడిక మట్టి పంటలకు సేంద్రియ ఎరువుగా పనిచేస్తుందని, రైతుల పంట సాగుకు అయ్యే ఖర్చు కూడా తగ్గి, భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని, పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో దళితవాడకు మంచినీటి సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతుంటే సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ చొరవతో మంచినీటి సమస్య పరిష్కారమైందని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు పోట్రూ సత్యం అన్నారు. కొంతకాలంగా ఎర్ర బోయినపల్లి గ్రామానికి మంచినీటి సమస్య ఉన్నప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నటువంటి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దృష్టికి ఎన్నిసార్లు తీసుకొనిపోనప్పటికీ మా సమస్య తీర్చక పోగా కనీసం కాలనీకి ఉన్న తాగునీటి బోరు కూలిపోతే కనీసం మరమ్మతులు చేయించి తాగు నీటిని కూడా ఇవ్వలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ప్రస్తుతం ఉన్నటువంటి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్ విజయ్ కుమార్‌కి ఎర్రబోయినపల్లి గ్రామ ప్రజలు నీటి సమస్య ఉందని వివరించగా వెంటనే స్పందించిన వెంటనే బోరు వేయించి మంచి నీటి సమస్య తీర్చిన సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్ విజయ్ కుమార్‌కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నామ గెలుపు కోసం విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కల్లూరు

బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుని గెలిపించాలంటూ మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం జెడ్పీటీసీ కట్ట అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద కోరుకొండి, పోచావరం, తాళ్లూరు వెంకటాపురం గ్రామాల్లో కార్నర్ మీటింగ్ పెట్టి నామా గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా చండ్రు పట్ల గ్రామాలో ఉపాధి కూలీల వద్ద కాటంనేని వెంకటేశ్వర ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నామా కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరుతూ ప్రచారం నిర్వహించారు. కల్లూరు పట్టణంలో లక్కినేని రఘు, పడకంటి రామకృష్ణ, మేకల కృష్ణ, కిరణ్, ఎస్కే కమలి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చండ్రుపట్ల మాజీ సర్పంచ్‌లు గొల్లమందల ప్రసాద్, వల్లభనేని భాస్కరరావు, జక్కంపూడి.రమాదేవి, మాజీ వార్డ్ నంబర్ మేకల రాజేష్, పాగా ఆదాం, గ్రామ నాయకులు వల్లభనేని శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సైన్స్ సెక్షన్లు మంజూరు

నవతెలంగాణ-మధిర

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సైన్స్ సెక్షన్లో మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్ఎల్ శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకొని మధిర డిగ్రీ కళాశాలలో సైన్స్ విద్యను పొందొచ్చని ఆయన తెలిపారు. మధిర డిగ్రీ కళాశాలకు సైన్స్ సెక్షన్ మంజూరు కావడం పట్ల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

మధిరలో విద్యుత్ భద్రత వారోత్సవాలు

నవతెలంగాణ-మధిర

విద్యుత్ శాఖ కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై మంగళవారం ఏడిఈ అనురాధ ఆధ్వర్యంలో పట్టణంలో శ్రీరస్తు ఫంక్షన్ హాల్ నందు విద్యుత్ భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు అంతరాయాలు లేని విద్యుత్ అందించే క్రమంలో ఎదురవుతున్న అనుభవపూర్వక ప్రమాద సంఘటనలు గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డి ఈ ఎస్. కృష్ణ, మధిర, మధిర రూరల్, ఎర్రుపాలెం, మామునూరు ఏఈలు అనిల్ కుమార్, నాగేశ్వరరావు, అనూష, శ్రీనివాసరావు లతోపాటు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్థాయిలలో ఉన్న విద్యుత్ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

16 నుండి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహోత్సవాలు

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుండి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈనెల 17న మహిళా భక్తుల చేత కోలాట నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 18 వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలన్నారు.

ఖమ్మం గడ్డపై బీఎస్పీ జెండా ఎగరాలి

నవ తెలంగాణ-జూలూరుపాడు

ఖమ్మం గడ్డపై బీఎస్పీ జెండా ఎగరాలని బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు ఒక ప్రకటనలో కోరారు.
ఈ నెల 13వ తారీకు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ నుండి ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు, స్నేహశీలి అన్యాయాలను ప్రశ్నించే యువకుడు, స్థానికుడు, అడ్వకేట్ యెర్రా కామేష్.ఏనుగు గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారన్నారు.

ఆలయంలో చోరీ

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లిలోని శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు ఆలయంలో గర్భగుడిలోకి ప్రవేశించి శఠగోపం, స్వామివారి కిరీటాలు అపహరించుకుపోయారు. అలాగే హుండీను కూడా పగలగొట్టి నగదును దోచుకుని వెళ్ళినారు సుమారు ఆభరణాలు, నగదు మొత్తం కలిపి లక్ష రూపాయలు వరకు ఈ చోరీ విషయాన్ని ఆలయకమిటీ నిర్వాహకులు ములకలపల్లి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు.

సొసైటీ వైస్ చైర్మెన్‌కు సతీ వియోగం

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఎర్రుపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘం వైస్ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కడియం శ్రీనివాసరావుకు సతీ వియోగం కలిగింది. గత కొద్ది రోజుల నుండి అనారోగ్యం తో బాధపడుతూ శ్రీనివాసరావు భార్య శైలజ మంగళవారం మృతి చెందారు. పలువురు శైలజ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

హైకోర్టులో హత్యాయత్నం కేసు కొట్టివేత

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖానాపురం హవేలి పోలీసులు 2021 ఆగస్టు 8న మంచుకొండ గ్రామానికి చెందిన మందడపు సుధాకర్, మందడపు మాధవరావు, యల్లపల్లి హనుమంత రావులపై నమోదు చేసిన హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, భారత ఆయుధ చట్టం అభియోగాల కింద దాఖలు చేసిన కేసును కొట్టి వేస్తూ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె. సుజన ఈనెల 2న తీప్పు చెప్పారు. తీర్పు నకళ్ళు మంగళవారం వెలువడింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం భూ తగాదాలను దృష్టిలో పెట్టుకొని నిందితులు వ్యాపారి తుళ్ళూరి శ్రీనివాసరావును హత్య చేసేందుకు రౌడీషీటర్లు, బైరు వెంకన్న, దొడ్డా హరిష్, ధర్మవరపు సర్వేష్‌లకు రూ.30 వేలు నగదు ఇచ్చి రెండు పెద్ద కొడవళ్ళను సరఫరా చేశారని ఆరోపణ. తుళ్ళూరి శ్రీనివాస రావు ఇచ్చిన ఫిర్యాదు పై పోలీసులు మొత్తం ఆరుగురు నిందింతుపై కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ 10 మంది సాక్షులను విచారించి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసు ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. తమపై తప్పుడు అభియోగాలపై పోలీసులు కేసు పెట్టారని, కేసును సవాల్ చేస్తూ మందడపు సుధాకర్, మందడపు మాధవరావు, యల్లంపల్లి హనుమంత రావు లు 2022 సంవత్సరంలో రాష్ట్ర హైకోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టు కు విన్నవించారు. ఈకేసు రికార్డును క్షుణ్ణంగా పరిశీలించిన హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సుజన గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను పరిశీలించి, నిందితులు ప్రత్యక్ష చర్యలకు పాల్పడినట్లు అభియోగాలు లేనందున కేసును కొట్టివేశారు. నిందింతుల తరుపున హైకోర్టులో న్యాయవాది సి. చరణ్ రెడ్డి వాదించారు. ఖమ్మం కోర్టులో నిందితుల తరపున న్యాయవాది కిలారు బాబ్జి వ్యవహరించారు. ఈ కేసు రాజకీయంగా జిల్లాలో అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది.

సంభాని గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన

నవతెలంగాణ-సత్తుపల్లి



మాజీ మంత్రి సంభాని గో బ్యాక్ అంటూ సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం ఆందోళన చేశారు. మంగళవారం మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో సంభాని ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వర్గీయులు ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యేకి, పార్టీ కార్యవర్గాలకు ఎలాంటి సమాచారం లేకుండా సంభాని చంద్రశేఖర్ ఒంటెద్దు పోకడలు పోతున్నారని ఈ రకమైన సంస్కృతికి చరమగీతం పాడాలని అంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాకర్లపల్లి గ్రామం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. సంభాని గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ సంభాని రాకను అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపు మేరకు కాకర్లపల్లి పర్యటన వాయిదా పడినట్లు సంభాని వర్గీయులు సోషల్ మీడియా ద్వారా తెలియజేయడం కొసమెరుపు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఓటమి కోసం పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి వర్గాలను పెంచిపోషిస్తున్నారంటూ కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి 'నామ' ను గెలిపించుకుందాం

- బూత్ పరిధిలో విస్తృత ప్రచారం చేయాలి
- నేడు నామ పర్యటనను జయప్రదం చేద్దాం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి



బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న నామ నాగేశ్వరరావును గెలిపించుకుందామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గులాబీ శ్రేణులను కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య ఇంటి వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం జరిగిన సమావేశంలో సండ్ర వెంకటవీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని నామ గెలుపు కోసం పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం పార్టీ శ్రేణులు తమతమ బూత్ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రజలకు అంర్థమయ్యేలా వివరించాలన్నారు. బుధవారం నామ నాగేశ్వరరావు సత్తుపల్లి పట్టణంలో నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేసేందుకు గులాబీ శ్రేణులు కృషి చేయాలని సండ్ర పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, కౌన్సిలర్లు ఎస్కే చాంద్‌పాషా, దేవరపల్లి ప్రవీణ్, గుండ్ర రాఘవేంద్ర, మారుతి సూరిబాబు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు రూత్ క్రిస్టియానా, నాయకులు అమరవరపు కృష్ణారావు, ఆయూబ్‌పాషా, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, వేములపల్లి మధు, మరికంటి శ్రీను, చింతల సత్యనారాయణ, ఎస్కే కాశీం, చిన్నంశెట్టి రాజేశ్వరి, బెల్లంకొండ రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సామాన్య ప్రజానీకానికి అందవలసిన సంక్షేమ పథకాలను అందించలేక పోయిందని, బిఆర్ఎస్ పార్టీలో ఎన్నో సమస్యలు అనుభవించి ఆ పార్టీలో ఇమడ లేక కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పలువురు నాయకులు తెలిపారు. మండల పరిధిలోని మీనవోలు, జమలాపురం, ఎర్రుపాలెం, రేమిడిచర్ల గ్రామాలలో గల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మీనవోలు ప్రాథమిక వ్యవ సాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కుడు ముల మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు నాయ కులు జమలాపురం గ్రామానికి చెందిన ఎర్రుపాలెం మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంకశాల శ్రీనివాస రావు, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అంకిరెడ్డి, మునగలూరి మురళీధర్ తదితరులు ఎర్రుపాలెం గ్రామానికి చెందిన మాజీ గ్రామ పంచాయతీ సర్పంచ్ మొగిలి అప్పారావు, గుర్రాల పుల్లారెడ్డి, చిన్నం రాము పలువురికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలులో భాగంగా తెలంగాణ రా ష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 150 రోజులలో ఆరు గ్యారెంటీలలో 5 గ్యారెంటీలను అమలు పరచి సామాన్య ప్రజల ప్రభుత్వంగా ఏర్పడటంతో ప్రభు త్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై మండలంలో పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయని అన్నారు. ఈ కార్యక మంలో నాయకులు శీలం ప్రతాపరెడ్డి, ఐలూరు వెంకటే శ్వర రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, తలపురెడ్డి నాగిరెడ్డి, ఎంపీపీ దేవర కొండ శిరీష, రాజీవ్ గాంధీ, శీలం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేసింది మనమే..

ఓటు అడిగే హక్కుమనకే ఉంది

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత

నవతెలంగాణ-కామేపల్లి



అభివృద్ధి చేసింది, మనమే ఓటు అడిగే హక్కుమనకే ఉంది. ప్రశ్నించే గొంతుకను ప్రజలకు అందుబాటులో ఉండి పోరాడేది నేనే కొంగు పట్టి అడుగుతున్న కారు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి, ఇండియా కూటమి, బీజేపీని ఓడించండని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. మండల పరిధిలోని కొత్తలింగాల లక్ష్మి ఫంక్షన్ హాల్ నందు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఆంతోటి అచ్చయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఇల్లందు మాజీ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావుతో ఆమె కలిసి మాట్లాడుతూ.. ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలను నేరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వడియాల క్రిష్టారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, సామ.మోహన్ రెడ్డి, మూడు కృష్ణప్రసాద్, శెట్టి శ్రీనివాసరావు, భట్టు.శంకర్, కాట్రాల.రాంబాబు గండమాల.చందర్, రాంబాబు, భస్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడిద్దాం

టీపీ జేఏసీ రాష్ట్ర నాయకులు చిర్రా రవి, జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్

నవతెలంగాణ-ఖమ్మం

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడిద్దామని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జేఏసి)రాష్ట్ర నాయకులు చిర్రా రవి, జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ స్టేడియం, లకారం ట్యాంక్ బండ్ లో గత పదేండ్ల మోడీ ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసాలను ప్రజలకు వివరించే కరపత్రాలను ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల ఏ మౌలిక సమస్యలు పరిష్కరించకుండా మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నదని, ఈ ప్రభుత్వాన్ని నిలువరించాల్సిన అవసరం, చారిత్రక కర్తవ్యం దేశ ప్రజలపై ఉందని అన్నారు. 2014 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలుపరచకుండా, తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను గందరగోళపరుస్తున్నదని, దేశాన్ని అప్పులపాలు చేసి, ధరల పెరుగుదలను అరికట్టలేక దేశ సంపదను బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం ద్వారా ఉద్యోగాల కల్పన మరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో టిపి జేఏసి కో కన్వీనర్ దుర్శోజు రమేష్, నాయకులు దాసరి శ్రీను, ప్రభాకర్, దశరథ, నరేందర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యం

- ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి జిల్లా
- అధ్యక్షులు డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్

నవతెలంగాణ-ఖమ్మం



భారతదేశం ప్రజాస్వామ్య లౌకిక రాజ్యమని, రాజ్యాంగం మన దేశానికి ఆత్మ వంటిదని దాన్ని పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యం అని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్ అన్నారు. మంగళవారం ఖమ్మం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భారతదేశ ప్రజలందరికీ ధర్మ శాస్త్రమని దానివల్లనే ప్రపంచంలో భారతదేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కానీ ఈరోజు దాన్ని మార్చే కుట్ర జరుగుతున్నదని దాన్ని అడ్డుకోవలసిన బాధ్యత ప్రజాస్వామికవాదులైన మనందరిపై ఉందన్నారు. ప్రస్తుతం మన దేశం ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో 35వ స్థానంలో ఉందని, మతపరమైన ఉద్రిక్తలు ప్రజలమధ్య ద్వేషాన్ని పెంచే మత రాజకీయాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో సమాజంలో ప్రజాస్వామ్య విలువలు, లౌకిక సూత్రాలు, సామాజిక న్యాయం, సమానత్వం, సోదర భావం, మతసామరస్యాన్ని పెంపొందించేందుకు ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. అంతే కాకుండా ఈ ఎన్నికలు సాధారణమైనవి కావని, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని ప్రజలందరూ తమ ఓటును సద్వినియోగం చేసుకొని రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ దేశాన్ని కాపాడే వారికి అధికారం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎస్ఆర్ కన్వెన్షన్ ఎసి ఫంక్షన్ హాల్ లో ఎన్నికలు మన బాధ్యత అనే అంశంపై ఒక గొప్ప సెమినార్ నిర్వహించబడుతుందన్నారు. ఈ సెమినార్‌లో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, రాష్ట్ర మాజీ కార్యదర్శి జనూనె- ఇస్లామి హింద్, తెలంగాణ, మొహమ్మద్ ఇల్యాస్, తదితర మేధావులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ సెమినార్ కు కుల మతాలకతీతంగా ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ సెమినార్ను జయప్రదం చేయాలన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో దేవ రెడ్డి విజయ్, ఇలియాస్, షేక్ కాసిం తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

దేశంలోని మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తున్నదని డీసీఎంఎస్ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో మైనారిటీ నాయకులు కరీముల్లా నాయకత్వంలో సుమారు 50 కుటుంబాలు, బీఆర్ఎస్ యువజన నాయకులు రెడ్డిమల్ల మణికంఠ నాయకత్వంలో 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాల్వంచ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్ కనమతరెడ్డి సూర్య నారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగుబలహీన, మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతుందన్నారు.
కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎం.డి. కరీముల్లా, ఏనుగుల వెంకటేశ్వర్లు, ఖాజా మొహినుద్దీన్, ఎస్. కె నజీర్, ఎం.డి సాదిక్ పాషా, ఎస్. కె. యాకుబ్ అలీ, రెడ్డిమల్ల మణికంఠ, తంబల్ల నాగసత్యం, మాదిరాజు సంతోష్, వేములపల్లి సాయి ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, సందుపట్ల శ్రీనివాస రెడ్డిలి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పిస్టల్ తో బెదిరించి డబ్బులు డిమాండ్

నిందితుల అరెస్టు..రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ- ఖమ్మం

నకిలీ పిస్టల్‌తో బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపురం హావెలి సిఐ భానుప్రకాశ్ తెలిపారు. నగరంలోని కవిరాజ్ నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యాపారిని ఈ నెల 1 వ తేది మధ్యాహ్నం సుమారుగా 3:30 గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చోరబడి నక్సలైట్లమని,అర్జెంటుగా లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వలేకపోతే చంపుతామని నకిలీ పిస్టల్ చూపించి బెదిరించారు. చివరకు రూ.5 వేల రూపాయలు తీసుకొని వెళ్లిపోయారు. బాధితులు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 252/2024, యు/ఎస్ 386 ఐపిసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో శ్రీశ్రీ సర్కిల్‌లో సోమవారం చేపట్టిన వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా వారిలో కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన రాయల వెంకటేశ్వర్లు అలియాస్ ఎస్.వి.రెడ్డి, అతని భార్య రాయల శ్రీలత టైలరింగ్, కూరగాయల వ్యాపారం చేస్తున్నట్లు, ఇటీవల నగరంలోని ఓ వ్యాపారిని బెదిరించినట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారని సిఐ తెలిపారు. సులువుగా డబ్బు సంపాదించాలని, నేర ప్రవృత్తిని ఎంచుకున్నారని, గతంలో 12 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుండి మూడు వేల నగదు, బొమ్మ పిస్టల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, ఎన్డీఏ శక్తులను ఓడించాలి

ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి

నవతెలంగాణ-దమ్మపేట

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఆర్ఎస్ఎస్, ఎన్డీఏ శక్తులను ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చేల రంగారెడ్డి పిలుపునిచ్చారు. మండల సీపీఐ మాస్ లైన్ మండల స్థాయి కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం తోడం దుర్గమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెచ్చెల రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము లు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పాలిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తాను ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల నాయకులు బండి ఆదినారాయణ, వగ్గేల ప్రసాద్, తెల్లం నగేష్, కోండ్రు లక్ష్మి, సున్నం జగన్, సున్నం క్రిష్టారావు, పండూరి వీరబాబు పాల్గొన్నారు.

యువతరం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

నవతెలంగాణ-ములకలపల్లి

మండలంలోని గుట్ట గూడెం గ్రామంలో వంక సురేష్ అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో సీపీఐ(ఎం) సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్కే ఉమర్, కుంజ కృష్ణ మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం మన్యం వీరుడు అల్లూరి బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆదివాసీల హక్కుల కోసం దేశం కోసం పోరాడి ప్రాణాలను అర్పించారు. ఈనాడు దేశంలో అక్రమంగా దోచుకుంటున్నారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల సొమ్మును గుజరాతీలు అయిన బడా పెట్టుబడిదారులు అయిన అంబానీ ఆదానీలకు పెట్టుబడి దారులకు కార్పొరేట్ సంస్థలకు ఇతర దేశాలకు మన దేశ సంపదను ప్రపంచ దేశాలకు అప్పచెప్పుతున్నారు. మతం పేరుతో ఆదివాసీలపై ఎస్సీ ఎస్టీ మైనారిటీలపై దాడులు చేస్తున్నారన్నారన్నారు. ఆదివాసీలు, మైనార్టీలు, ఎస్సీలు అందరూ దేశం కోసం యువతరం మరో స్వతంత్ర పోరాటానికి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఆశయాల సాధనలో దేశం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు సవలం శేషుబాబు, దుబ్బ వెంకటేశ్వర్లు, సవ్వాల ఆదినారాయణ, దొబ్బా పూర్ణచంద్రరావు, కొర్రి సీతారాములు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ ను గెలిపించాలి

నవతెలంగాణ-పినపాక



పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాధం కోరారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఉప్పాకలో, ఈ.బయ్యారం, సీతంపేట, మల్లారం, జానంపేటలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించి, కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించారు. మే 13 న జరిగే ఎన్నికలో చేతి గుర్తు పైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో గంగిరెడ్డి వెంకట రెడ్డి, నవాతి శ్రీను, పేరం వెంకటేశ్వర రావు, ఉడుముల లక్ష్మీ రెడ్డి,సాంబ పాల్గొన్నారు.



అకాల వర్షం..

- చల్లబడిన వాతావరణం
- నేలకొరిగిన అరటి తోటలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలో మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం సంబంధించింది. మధ్యాహ్నం అర్ధ గంటకు పైగా గాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతా వేడి తగ్గి వాతావరణం చల్లబడింది. గుర్రాల చెరువులో ఈదురు గాలులకు అరటి తోటలు నేలకొరిగాయి. 70 పైగా ఎకరాలలో అరటి తోటలు ధ్వంసం అయింది. వర్షం కారణంగా మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో సుమారు 70 ఎకరాలలో అరటి తోట ధ్వంసం అయింది. చక్రాల చిట్టిబాబు, ఏరా లక్ష్మణరావు, కట్టా నాగయ్య, కలపాల రామకృష్ణకు చెందిన అరటి తోటలు నేలమట్టమయ్యాయి. నెల రోజుల్లో కోతకు సిద్ధం కాగా మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మబ్బులు కమ్ముకొని ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. అరటి తోటలకు ఎకరాకు లక్ష రూపాయలు మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. మామిడి రైతులు రోదన వర్ణణాతీతంగా ఉంది. చేతికొచ్చిన పంట అకాల వర్షం కారణంగా తమకు దక్కకుండా పోయిందని మామిడి రైతులు కంటతడి పెడుతున్నారు. జమ్మి గూడెం, గుర్రాల చెరువు, అశ్వారావుపేట, అచ్యుతాపురం గ్రామాలలో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.



మైనారిటీల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

దేశంలోని మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తున్నదని డీసీఎంఎస్ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసావు అన్నారు. మంగళవారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో మైనారిటీ నాయకులు కరీముల్లా నాయకత్వంలో సుమారు 50 కుటుంబాలు, బీఆర్ఎస్ యువజన నాయకులు రెడ్డిమల్ల మణికంఠ నాయకత్వంలో 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాల్వంచ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్ కనమతరెడ్డి సూర్య నారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగుబలహీన, మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతుందన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎండీ కరీముల్లా, ఏనుగుల వెంకటేశ్వర్లు, ఖాజా మొహినుద్దీన్, ఎస్.కె.నజీర్, ఎం.డి.సాదిక్ పాషా, ఎస్.కె.యాకుబ్ అలీ, రెడ్డిమల్ల మణికంఠ, తంబళ్ల నాగసత్యం, మాదిరాజు సంతోష్, వేములపల్లి సాయి ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, సందుపట్ల శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2 లక్షల 50 వేలు స్వాధీనం

నవతెలంగాణ-మణుగూరు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలో అంబేద్కర్ సెంటర్ వద్ద పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారుడు ఎలాంటి ధృవ పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న రెండు లక్షల యాభై వేలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సతీష్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఎస్ఎస్‌టీం తెలిపారు. ఎలాంటి ధృవ పత్రాలు లేకుండా 50 వేలకు పైగా డబ్బులు రవాణా చేస్తే సీజ్ చేస్తామన్న సీఐ సతీష్ కుమార్ తెలిపారు.

బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలి

- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు తెలిపారు. మంగళవారం ఆ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బంగారు చలక గ్రామంలో చింత చంటి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, జిల్లా నాయకులు ఆజాద్ పాల్గొని మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి తిరిగి డబ్బు, ధనం, మతంతో ప్రజలను ప్రలోభాల గురిచేసి మరోసారి అధికారంలో రావడం కోసం ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఇటువంటి దుర్మార్గమైన పార్టీని దాని మిత్రపక్షాలను చిత్తుచిత్తుగా ఓడించి మట్టి కల్పించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గూగుల్ రామచందర్, పార్టీ మండల కార్యదర్శి గుగులోత్ రామచందర్, నరసింహారావు, మంగీలాల్, నాగేశ్వరరావు, సమ్మయ్య, లక్ష్మి, రాంబాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసం

- కాపర్ వైర్ చోరీ

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం ఈ.బయ్యారం గ్రామంలో గుర్తుతెలియని దుండగులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి, కాపర్ వైరును చోరీ చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కంది అచ్చిరెడ్డి, గట్ల బాలకోటిరెడ్డి పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని పంట సాగుచేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును చోరీ చేశారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ ఏఈ కావ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుండి అన్ని రకాల రక్త పరీక్షలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

టీడీహబ్ ద్వారా ఈ నెల తొమ్మిదవ తేదీ నుండి మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు రేణుక రెడ్డి, పుల్లారెడ్డి, సుభాష్ తెలిపారు. ఈ నెల 9, 14, 16, 18, 21, 23, 25, 28, 30, తేదీలలో రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కావున మండల ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని వైద్యులు తెలిపారు. పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తమ వెంట తీసుకొని రావాలన్నారు.

గాలి దుమారానికి పడిన చెట్లను తొలగించిన ఎంపీఓ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల పరిధిలోని పాతూరు గ్రామ సమీపంలో మంగళవారం ప్రధాన రహదారికి అడ్డంగా ఓ వంతెన పై భారీ గాలి దుమారానికి పడిన చెట్లను, చెట్ల తీగలను తానే స్వయంగా స్థానిక ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ప్రజల రవాణా సౌకర్యార్థం సామాన్యుడిలా తొలగించినట్టు ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, పినపాక రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు అనంతోగు, ఆళ్ళపల్లి, పాతూరు, మర్కోడు గ్రామ పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కావలసిన కనీస మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను సూచించారు.

అనంతరం తిరుగు ప్రయాణంలో పాతూరు గ్రామం దగ్గరలో బ్రిడ్జికి అడ్డంగా పడిపోయిన చెట్లను కార్యదర్శుల సహకారంతో ఆయన తొలగించినట్టు తెలిపారు. పలువురు మండల వాసులు ఎంపీఓ, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు. ఈ కార్యక్రమంలో రాఘవాపురం, పాతూరు, అడవిరామవరం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, విజయ కుమారి, జీవన్ కుమార్, పలువురు పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



బ్యాలెట్ యూనిట్ల రాండమైజేషన్ పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. జిల్లాకు కేటాయించిన 344 బ్యాలెట్ యూనిట్లుకు రాజకీయ పార్టీ నాయకులసమక్షంలో రాండమైజేషన్ పూర్తి చేశామని ఆమె తెలిపారు. ఇల్లందు (111) నియోజకవర్గంకు 20, కొత్తగూడెం (117) నియోజకవర్గంకు 32 కంట్రోల్ యూనిట్స్ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ దారా ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రంగ ప్రసాద్, ఎస్ఐసి సుశీల్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్, కాంగ్రెస్ పార్టీ నుంచి లక్ష్మణ్ అగర్వాల్, భారతీయ జనతా పార్టీ నుంచి నోముల రమేష్, బీఎస్పి పార్టీ నుంచి జే.ఆనందరావు, సీపీఐ(ఎం) నుంచి ఏ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి ఆశ్రమ పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు విద్యార్థినీ, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా మైనర్ రిపేర్లు 15 మే నాటికి 90 శాతం పనులు పూర్తి అయ్యేలా సంబంధిత స్పెషలాఫీసర్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్పెషలాఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్, అందుబాటులో ఉన్న స్పెషలాఫీసర్లతో పాఠశాలలో మౌలిక వసతులు ఎంతవరకు పూర్తి అయినది ఇంకా చేయవలసినది ఎంత ఉన్నది అనే అంశాల పై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రతి ఆశ్రమ పాఠశాల వసతి గృహాలలో విద్యార్థినీ, విద్యార్థులు అందరూ బెడ్లపైన పడుకోవాలని పాఠశాల గదులలో గాలి వెలుతురు తప్పనిసరిగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ప్రతి పాఠశాల వసతిగృహం సర్వ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని పాఠశాలల్లో డార్మెటరీ తరగతి గదులకు ఆల్ఫాబెట్ల ప్రకారం నంబర్లు వేయించడం జరిగిందని, విద్యార్థులు పడుకునే రూములలో నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాన్ తప్పనిసరిగా ఉండే విధంగా డిజైన్ చేయడం జరిగినందున ఈనెల 20వ తేదీ నాటికి ఫ్యాన్లు ట్యూబ్లైట్లు అమర్చాలన్నారు. అదేవిధంగా టాయిలెట్లు, బాత్రూంలు మైనర్ రిపేర్లు చేయించి శుభ్రంగా ఉండేలా చూడాలని విద్యార్థులకు మంచినీరు అందించడానికి బోర్లు గాని, మంచినీటి పంపులు కానీ రిపేర్లు ఉంటే త్వరితగతిన చేయించాలన్నారు. పిల్లలు భోజనాలు చేసిన తర్వాత ప్లేట్లు కడుక్కోవడానికి ట్యాంకును ఏర్పాటు చేసి ట్యాంక్ చుట్టూ మురికి నీరు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా, నీరు నిల్వ లేకుండా డ్రైనేజీలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని అలాగే పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు సమకూర్చిన డబుల్ కాట్ మంచాలు కట్ చేయించి ప్రతి విద్యార్థి మంచాల మీదే పడుకునేలా ఏర్పాట్లు చేయాలని స్పెషల్ ఆఫీసర్లకు ఆదేశించారు. డబుల్ కాట్ మంచాలు ఎక్కువ ఉన్న పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సరిపడా ఉంచి మిగతా వాటిని వేరే పాఠశాలలకు తరలించాలని అలాగే పాఠశాల తరగతి గదులలోని గోడలు, పైన ప్యాచ్ వర్క్ పనులు త్వరగా చేయించాలని ప్రహరీ గోడ పాఠశాల తరగతి గదులలో తప్పనిసరిగా వైట్ వాష్ చేయించాలని ప్రతి తరగతి గదిలో తప్పనిసరిగా ట్యూబ్ లైట్లు ఫ్యాన్లు అమర్చాలని అన్నారు. పాఠశాల ఆవరణ చుట్టు సైడ్ కాలువలు ఏమైనా ఉంటే రిపేర్లు చేయించాలని మురికి నీరు ఆగకుండా బయటికి పోయే ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. ప్రస్తుతం వేసవిలో పాఠశాలలకు సెలవులు ఉన్నందున పాఠశాలలు అపరిశుభ్రంగా ఉంచకుండా ప్రతిరోజు శుభ్రం చేయించాలని ప్రస్తుతం కరెంటు సంబంధించిన స్విచ్ బోర్డులు మంచిగా ఉన్నచోట అవే వాడకానికి ఉంచాలని పాడైపోయినచోట లైట్లకు ఫ్యాన్లకు వేరువేరుగా ఎంసిబీ స్విచ్ బోర్డులు అమర్చాలని అన్నారు.

టాయిలెట్లలో సీట్ పాడైపోతే కొత్త సీట్లు వేయించాలని బాలికల పాఠశాలల్లో బట్టలు ఉతకడానికి తప్పనిసరిగా ధోబి గాట్ లాంటి ప్లాట్ఫామ్ వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో వసతి గృహాలలో సివిల్ వర్క్స్ ప్యాచ్ వర్క్ స్పెషల్ ఆఫీసర్లు దగ్గర ఉండి చేయించాలని, అలాగే డ్యూయల్ డేస్కులు పాడైపోతే ప్లైవుడ్ వేయించి రిపేర్ చేయించాలని విద్యార్థులు బస చేసే గదులలో మాత్రం పిల్లల తప్ప వేరే ఎవరు ఉండకూడదని లైబ్రరీ సైన్స్ ల్యాబ్ మెడికల్‌కు సంబంధించిన గది వేరుగా ఉండాలని అన్నారు. పాఠశాల వసతి గృహాలలో పనికొచ్చే వస్తువులు ఉంచి పనికిరాని వాటిని డిస్పోజల్ చేయాలని అలాగే మరమ్మతులు చేయించే ముందు చేసిన తర్వాత తప్పనిసరిగా ఫోటోలు తీయించాలని ఆయన అన్నారు. సంబంధిత స్పెషల్ ఆఫీసర్లు ఈ పనులన్నీ దగ్గర ఉండి చేయించాలని అన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో వసతి గృహాలలో చేస్తున్న పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయని ఈనెల 18 నాడు తప్పనిసరిగా స్పెషల్ ఆఫీసర్ లందరికీ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పనుల కార్యాచరణ పరిశీలించడానికి రివ్యూ తీసుకోవడం జరుగుతుందని సంబంధిత స్పెషలాఫీసర్లు తప్పనిసరిగా మీ పరిధిలోని పాఠశాలల్లో అన్ని పనులు పూర్తయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లీష్ భాషను ధారాళంగా మాట్లాడడానికి అలాగే ఇంగ్లీషులో విద్య బోధన బలోపేతం చేయడానికి సంబంధిత సబ్జెక్టు టీచర్లు తెలుగు హిందీ మినహాయించి మిగతా సబ్జెక్ట్ టీచర్లకు ఐటీసీ వారి సహకారంతో ఆశ్రమ పాఠశాల వసతి గృహాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు ఐదు రోజుల ప్రత్యేక టెస్ట్ నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అంతకుముందు 20 మంది ఒక టీచర్లకు చొప్పున వేరే కళాశాలల లెక్చరర్లతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. తప్పకుండా టీచర్లందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఇంగ్లీషు భాషలో పరిజ్ఞానం పొంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులందరికీ చక్కటి ఇంగ్లీష్ విద్యా బోధన చేసే విధంగా కృషి చేయాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్, అధికారిని మణెమ్మ, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఎఫ్‌డీసీ అశోక్, ఏసీఎంఓ రమణయ్య, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏటీడీఓ నరసింహారావు, ఏపీవో పవర్ మునీర్ పాషా, జెడిఎం హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానకు 25 కుర్చీల అందజేత

- కొత్త జంటలకు పట్టు వస్త్రాలు అందజేత

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు మున్సిపాలిటీ శివలింగాపురం పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక దవఖానకు దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కుర్చీలు అందించినట్టు చైర్‌పర్సన్ గంట రాధా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. గంట రాధా సేవలు మరింత విస్తరించాలని పేదలకు సాయం చేయడంలో ముందుండాలని వారి కోరారు. ఈ సందర్భంగా గంటా రాధా మాట్లాడుతూ ఆస్పత్రికి అనారోగ్యాలతో వచ్చే వారికి మరి తదితరులకు ఉపయోగపడతాయని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న, ఆకలితో ఇబ్బంది పడుతున్న వారికి మా దానధర్మ ట్రస్ట్ అన్నివేళలా అండగా ఉంటుందని ఆమె తెలిపారు. మే 30న జరగబోయే సామూహిక వివాహాలకు పట్టు వస్త్రాలు అందజేస్తున్నామని అన్నారు. ఆర్థిక సహాయ, సహకారాలు అందించిన పెద్దలకు, ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పార్లమెంట్ సాక్షిగా కొట్లాడి సింగరేణిని కాపాడుకున్నాం

- ఈ ప్రాంత ప్రజలతో ఎంతో అనుబంధం ఉంది
- హామీల సంగతేమిటని కాంగ్రెస్‌ను నిలదీయండి
- సింగరేణి హెడ్డాఫీస్, రుద్రంపూర్‌లో నామ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కొత్తగూడెం



కేంద్రంతో పోరాడి, వత్తిడి తెచ్చి సింగరేణి సంస్థను, కార్మికుల భవిష్యత్‌ను కాపాడుకున్నామని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొత్తగూడెం రుద్రంపూర్ 5 ఇంక్లైన్ బొగ్గు గనులతో పాటు సింగరేణి ప్రధాన కార్యాలయం, తదితర ప్రాంతాల్లో నామ నాగేశ్వరరావు మంగళవారం పర్యటించి ఎన్నికల ప్రచారం సందర్భంగా నామా సింగరేణి కార్మికులను వ్యక్తిగతంగా కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుపై ఓటు వేసి,తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రెండు సార్లు గెలిపించి, పార్లమెంట్‌కు పంపితే ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉండి చదువుకుని, ఇక్కడే రోజు కూలీ మూడున్నర రూపాయలకు పనిచేసిన అనుబంధం ప్రజలతో ఉందని అన్నారు. భద్రాచలం- కొవ్వూరు రైల్వే లైన్ కోసం కేంద్రానికి 120 లేఖలు రాసిన చరిత్ర తనది అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని, జాగ్రత్తగా ఆలోచించి ఓటు అనే వజ్రాయుదాన్ని వాడాలని కోరారు. పక్కా లోకల్ వ్యక్తినైన తనను ఎన్నుకుంటే ఏ సమయంలో ఏ కష్టమొచ్చినా ఆదుకుంటా మని, అండగా ఉంటానని నామ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకట రమణ, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, ఎంపీపీ బాదావత్ శాంతి, వనమా రాఘవ, కూసన్న వీరభద్రం, తోగరు రాజశేఖర్, తేరాల వీరభద్రం, ఎస్‌కె. అన్వర్ పాషా, యాకూబ్, వేల్పుల దామోదర్, నవతన్, అనుదీప్, మోరే భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- రఘురాం రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించండి
- మాజీ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ముక్తివి గిరీష్

నవతెలంగాణ-పాల్వంచ



రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా యువత ముందుకు సాగాలని, శక్తి వంచన లేకుండా కృషి చేసి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాం రెడ్డిని అత్యంత మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ముక్తివి గిరీష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గంలో పాల్వంచలో ఎన్ఎస్‌యుఐ యువజన కాంగ్రెస్ సంయుక్త సమావేశం గిరీష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 700 మందికి పైగా కొత్త ఓటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ ఓటర్లను ఉద్దేశించి నాయకులు మాట్లాడారు.

ఈ ఎన్నికలు మతతత్వ పార్టీకి, సెక్యులర్ పార్టీకి జరుగుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ రాబోవు రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి దేశంలో ఉన్న యువత ఎదురుచూస్తున్నారని అన్నారు. అందుకోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న యువత కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ముందుకు వెళ్లాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని భారతదేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగుతుందని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సామాన్య కుటుంబాల బతుకులు బాగుంటుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి, రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, కొత్తగూడెం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్, ఓబీసీసెల్ జిల్లా అధ్యక్షులు అల్లాడి నరసింహారావు, యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్ కుమార్, షేక్ ఆబిద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బట్టు మురళి, కట్ట సమ్మయ్య, కిరణ్ కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి..

- గురజాల గోపి ఆధ్వర్యంలో భారీ చేరికలు

నవతెలంగాణ-మణుగూరు

కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో అధిక సంఖ్యలో మహిళల చేరినట్టు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి తెలిపారు. మణుగూరు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గురజాల గోపి ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి, ఎంపీ రేణుక చౌదరి నివాసంలో మణుగూరు నుండి పెద్ద ఎత్తున మహిళలు కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. కేంద్రమంత్రి రేణుకా చౌదరి వారికి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురజాల గోపి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మణుగూరులో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని, ఇంకా చాలా మంది కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా వున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ పథకాలు, చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారని వారు అన్నారు. కండువాలు కప్పుకున్న వారిలో షబానా, మాజీ సర్పంచ్ పూణెం సరోజ, దేరంగుల సుజాత, కోరి శ్యామల, ఏప రేణుక, జమ్ముల రేణుక, వాసాల శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

ఘనంగా వడ్డేపల్లి వర్ధంతి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

దళిత నాయకుడు దళిత సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి అకాల మరణం చెందిన అన్నపురెడ్డిపల్లి గ్రామనికి చెందిన వడ్డేపల్లి నాగేశ్వరావు 30వ వర్ధంతిని మండల కేంద్రంలో దళిత సంఘం నాయకులు చంద్రుగొండ మండల జడ్పీటీసీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ముదు దశాబ్దాల క్రితం వడ్డేపల్లి నాగేశ్వరావు ఒకే పార్టీకి కట్టుబడి మరణించే వరకు అదే పార్టీకి పని చేసి ఆదర్శ నాయుకుడుగా నిలిచారన్నారు. సమాజంలో దళితులు అన్ని హక్కులు సమానంగా పొందాలని దళిత జాతి అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి అని అలాంటి నాయకుడు భౌతికంగా లేకపోయిన అయన ఆశయాలు ఇంకా బతికే వున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రమేష్, రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు : ఎంపీడీవో

- నర్సరీ, అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధి పాండురంగాపురం తండా, ఇల్లందులపాడు తండా, తవిసలగూడెం పంచాయతీల్లో జరుగుతున్న కాలువ, చెక్ డ్యామ్ పూడికతీత, భూ అభివృద్ధి పనులతో పాటు నర్సరీలను నిశితంగా పరిశీలించారు. ఉపాధి కూలీలు ఉదయం 7 గంటల లోపు పని ప్రదేశంలో హాజరు కావాలన్నారు. మార్కింగ్ ప్రకారం దినసరి వేతనం రూ.300లు వచ్చే విధంగా పనులు చేయాలని సూచించారు. ఉపాధి సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, కూలీలకు ఇబ్బంది కలగని రీతిలో విధి నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో ఫోరండ్ల రంగా, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) పుల్లయ్య, పంచాయతీల కార్యదర్శులు విజయలక్ష్మి, కాళీ, సంధ్య క్షేత్ర సహాయకులు శ్రీను, చంటిలు పాల్గొన్నారు.

దోస్త్‌కు దరఖాస్తు చేసుకోండి

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దోస్త్ (డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ) ఆన్ దరఖాస్తు విధానం ఈ 6 తేదీ నుండి 25 వరకు ఫ్రీ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉన్నందున అశ్వారావుపేట పరిసర ప్రాంత ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులు అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయ కుమార్ విద్యార్థులను కోరారు. ఆయన స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మంగళవారం ఈ విద్యాసంవత్సరం క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ఈ నెల 15వ తేదీ నుండి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ సదుపాయం ఉంటుందని అన్నారు. జూన్ 03వ తేదీన ఉన్నత విద్యా మండళి సీట్లు కేటాయిస్తుందని తెలిపారు. దోస్త్ వెబ్ సైట్, మీ సేవ, యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల మాధ్యమం (ఇంగ్లీష్ మీడియం)లో బీఏ (హెచ్ఈపీఎస్, హెచ్ఈసీఏ), బీకాం (సీఏ), బీఎస్సీ (బీజెడ్‌సీ), బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసీఎస్) గ్రూపుల్లో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంత ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ పి.రామచంద్రరావు, శ్రీనివాస్ రావు, క్రిష్ణా రావు, బంగారిలు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో కాంగ్రెస్ ప్రచారం...

నవతెలంగాణ-అశ్వారావుపేట



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గడువు సమీపించటంతో పార్టీలు ప్రచార సరళి వైవిధ్య భరితంగా నిర్వహిస్తున్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో అశ్వారావుపేటలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ నేతృత్వంలో పని ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరాయిగూడెం పంచాయతీ దుప్పలు కుంటలో ఉపాధి పనులు వద్దకు వెళ్ళి కూలీలకు నిమ్మరసం, మజ్జిగ ప్యాకెట్‌లు అందజేసి కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి చిత్రాలతో ఉన్న హస్తం గుర్తు కరపత్రాలను పంపిణీ చేసారు. కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సీపీఐ (ఎం), సీపీఐ బలపరుస్తున్న ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామ సహాయం రఘురామ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలో చాలావరకు అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల పెంపుదల, అలాగే రాబోయే రోజుల్లో యావత్ తెలంగాణ రాష్ట్ర మొత్తం ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇల్లు కూడా త్వరలో మంజూరు అవుతాయని అన్నారు. ప్రతి పేదవాడి కల నెరవేరే బాధ్యత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారని అందుకే మనమందరం కలిసి మన ఎంపీ అభ్యర్థి అయిన రఘురాం రెడ్డిని గెలిపించి ఉమ్మడి ఖమ్మం జిల్లా తరపున పార్లమెంటులో అడుగుపెట్టేలా చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రమోద్, కానూరు మోహన్ రావు, నంద్రు రమేష్, చిన్నం శెట్టి సత్యనారాయణ, మిండ హరిబాబు, తగరం ముత్తయ్య, మేక అమర్నాథ్, స్టాలిన్, నాగరాజు, సోమరాజు, కాంతారావు, రాంబాబు, వెంకటేశ్వరరావు, దివాకర్ ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాల్వంచలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పారిశుధ్య నిర్వహణపై సూచనలు

నవతెలంగాణ-పాల్వంచ



కలెక్టర్ ప్రియాంక అలా మంగళవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ఆకస్మిక తనిఖీ చేశారు. పార్లమెంటు ఎన్నికలకు ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలలో వసతులు, తాగునీటి సమస్యలు, ఉపాధి హామీ చట్టం పనులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాల్వంచ బస్టాండ్ ఏరియా, రాజీవ్ మార్కెట్ రోడ్, శాస్త్రిబొమ్మ రోడ్, ప్రాంతాలలో పారిశుధ్య, మురుగు కాలువల పూడిక తీయుట, చెత్త సేకరణకు పురపాలక సంఘం సిబ్బంది ఏ విధంగా చేస్తున్నారు అని ప్రజల వద్ద అభిప్రాయం తీసుకున్నారు. మార్కెట్ రోడ్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్ల మూతలు తొలగించి తక్షణమే పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా అనుమతి లేకుండా ఉన్న ఆక్రమణలను తొలగించమని మున్సిపల్ కమిషనర్ పాల్వంచను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి, తహసీల్దార్ వేణు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు బీఆర్ఎస్ దే

- నామా గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



భారత రాష్ట్ర సమితి ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోరుతూ.. మంగళవారం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గడపగడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. దంతెల బోర, సంఘం, నారాయణరావుపేట, నాగారం కాలనీ, రేగులగూడెం, చంద్రాలగూడెం, మల్లారం, ఉల్వనూర్ గ్రామాల్లో ఆ పార్టీ జిల్లా నాయకులు కిలారు నాగేశ్వరరావు, మల్లెల రవిచంద్ర, బారాస మండల అధ్యక్షుడు పూసల విశ్వనాథం, వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, దారా కరుణాకర్, నరేష్‌లు ఆ పార్టీ ముఖ్యులను కలిశారు. పార్టీ పురోభివృద్ధి పై చర్చించారు. సిట్టింగ్ ఎంపీ నామాను మరోసారి పార్లమెంటుకు పంపేలా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని దిశా నిర్దేశం చేశారు. మోసపూరిత మాటలతో ముందుకొస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మూడో వార్డు కబీర్ తండాలో పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల నేతృత్వంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్వతి, కళ్యాణి, జ్యోతి, సునీత, సీతా, మైతీలీ, నిరోషా, కాంతిలు పాల్గొన్నారు.

కాట వేసిన ధాన్యం...లోడింగ్ పేరుతో జాప్యం

- వర్ష భావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల ఆందోళన

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



ఆరుగాలం కష్టించి పండించి నోటి కాడికొచ్చిన పంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాశులుగా పడి ఉంది. కాటా పెట్టిన 1000 బస్తాల ధాన్యం నాలుగు రోజులుగా కేంద్రంలో మగ్గుతోంది. రెండు రోజులుగా నెలకొన్న వర్షా బావ పరిస్థితుల నేపథ్యంలో ధాన్యం వర్షార్పణ మయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోములగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజులుగా నిల్వ ఉన్న ధాన్యం తరలింపుకు అధికార యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టాలని బాధిత రైతాంగం కోరుతోంది.

మతోన్మాద బీజేపీని ఓడించండి

- కాంగ్రెస్ అభ్యర్థి బలరామ్ నాయక్‌ను గెలిపించండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్‌ను గెలిపించాలని, మతోన్మాద కార్పొరేట్ విధానాలు అనుసరిస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు జనరల్ బాడీ సమావేశం స్థానిక ఏలూరి భవన్లో మండల కార్యదర్శి అబ్దుల్ నబి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సీపీఎం సీపీఐ(ఎం) జిల్లా పార్టీ కార్యదర్శి కనకయ్య పాల్గొని మాట్లాడారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుండి ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని పోరిక బలరామ్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈడీలను, ఐటీలను, సీబీఐలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను లొంగ తీసుకోవడం లొంగని నాయకులపై అక్రమ కేసులు పెట్టించడం అన్యాయమని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని మోడీ అమలు చేయలేదన్నారు. పేదలందరికీ 10 లక్షలు ఇచ్చి ఇంటి స్థల మిత్రమన్న మాట గాలిలో కలిసిందన్నారు. జీరో అకౌంట్‌లో రూ.15 లక్షలు ఇస్తామని జీరో అకౌంట్ ఓపెన్ చేసి ఒక్క రూపాయి బిళ్ళ ఇవ్వకుండా ప్రజలను మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఒక్కరి కూడా ఉద్యోగం ఇవ్వకుండా నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యిందన్నారు. రైతు వ్యతిరేక 3 అగ్రీ చట్టాలు తెచ్చి రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమించటం వలన తప్పనిసరి పరిస్థితులలో రద్దు చేసుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి మోడీ సర్కార్‌కి ఎదురైందన్నారు. అయినా ఇంకా కనీసం మద్దతు ధర ప్రకటించినటువంటి పరిస్థితి ఉందన్నారు. ఉపాధి హామీ చట్టంలో రోజుకు రూ.600, సంవత్సరానికి 200 రోజుల పనిగా కల్పిస్తామని నిధులు కేటాయించలేదన్నారు. మున్సిపాలిటీ ఏరియాలలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయలేదన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసి పోడు భూములకు పట్టాలివ్వకుండా పోడు రైతులు అందరికీ అన్యాయం చేసింది మోడీ సర్కారు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దుచేసి మనధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించుకుందన్నారు. బీజేపీని ఓడించి మతోన్మాదాన్ని ఎండగట్టాలని చెప్పి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇల్లందు నియోజకవర్గ సీపీఐ(ఎం) ఇన్‌చార్జి దుగ్గి కృష్ణ, భద్రాద్రి జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్‌లు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, సర్వన్ కుమార్ పాసి, సంధ్య, వెంకటమ్మ, తాళ్లూరి పద్మ, శ్రీను, యాకూబ్ పాషా, నాగ రాజు, లక్ష్మణ్, ఆర్‌బీజే రాజు, రాజమొగిలి, వీరభద్రం, వీరస్వామి, మమత, తాండ్ర కాంత, కౌసల్య, కోటమ్మ, సుజాత, నీలారాణి, జ్యోతి, మంగ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డి విజయం తథ్యం

- భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెబుతాం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీపీఐ, సీపీఐ(ఎం), టీజేఎస్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక కొత్తగూడెం పట్టణంలోని శేషగిరి భవన్ నందు సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంటరీ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి పాల్గొన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంటరీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. దేశంలో మోడీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధిస్తుందనీ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, బిజెపి ప్రజా ఆదరణ కోల్పోయిన పార్టీలు గానే మిగులుతాయి అన్నారు. దేశంలో బిజెపి రాష్ట్రంలో బీఆర్ఎస్ గడిచిన 10 సంవత్సరాలలో కార్మికులకు తీరని అన్యాయం చేశారన్నారు. కార్మిక హక్కులను చట్టాలను హరించరని అన్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద సంస్థగా ఉన్న సింగరేణినీ ప్రైవేటీకరణ పేరుతో అనేక చట్టాలను తీసుకువచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ అతిపెద్ద బలమైన సంఘమని ఆయన కొనియాడారు.

అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా మాట్లాడుతూ... సిపిఐ పార్టీ అనుబంధ సంఘమైన ఏఐటీయూసీకి అనేక సంవత్సరాల అనుభవం ఉన్నదన్నారు. అనునిత్యం కార్మిక కర్షకుల సమస్యలపై పోరాటం చేస్తూ కార్మికుల పక్షాన నిలబడే కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. సింగరేణి సంస్థలో జరిగిన కార్మిక ఎన్నికల్లో అనేక దఫాలు సింగరేణి సంస్థ కార్మికుల తరపున ప్రాతినిధ్యం వహించిన ఘనత ఏఐటియూసిదే అని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మిత్ర పక్షాలు బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజా ర్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, క్రిస్టఫర్, వట్టికొండ మల్లికార్జున్, రమణ మూర్తి, వీరాస్వామి, గెద్దాడ నగేష్, కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, నాగేంద్ర త్రివేది, శివ ప్రసాద్, నాయకులు నేరెళ్ల రమేష్, మల్లెల రామనాథం, మేరెడ్డి జనార్దన్ రెడ్డి, ఆసిఫ్, ఆబీద్, నయిం ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం స్టేడియంలో ఆర్ఆర్ఆర్ ప్రచారం

ఒక్కసారి అవకాశం ఇవ్వండి...అభివృద్ధి చేసి చూపిస్తా...అంటూ కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో ఆయన ప్రచారం నిర్వహించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా పలువురు వాకర్స్‌ను కలిసి చేతి గుర్తుపై ఓటేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని, దేశంలో బీజేపీ పాలనకు బైబై చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒకసారి అవకాశం ఇచ్చి చూడాలని, ఖమ్మం జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఊకంటి గోపాల్ రావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, వీరబాబు, కరీం పాషా , కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



గంగోలు చెరువు, అచ్చుతాపురం రహదారికి మోక్షం కలుగజేయండి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీఓకు వినతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండల కార్యాలయాలకు దగ్గర్లో ఉన్న గంగోలు చెరువు, అచ్యుతాపురం రహదారికి మోక్షం కలుగజేయాలని కోరుతూ ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీఓ ముత్యాలరావుకు వినతి పత్రం అందజేశారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు మాట్లాడుతూ గంగోలు చెరువు వలన అచ్చుతాపురం ప్రజలకు గాని రైతులకు గాని ఎటువంటి ఉపయోగం లేకపోవడమే కాకుండా అనేక చర్మవ్యాధులకి నిలయంగా మారిందంటూ వాపోయారు. లక్ష్మీనగరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నుండి వచ్చే మురుగునీరు నేరుగా చెరువులోకి రావడం వలన చర్మవ్యాధులు వస్తున్నాయన్నారు. ఎండాకాలంలో చెరువులో చేపలు పట్టడానికి కూడా వీలు లేకుండా చెరువు అంత చెత్త మయమై కూరుకుపోయిందని అన్నారు. పశువులు నీళ్ల తాగడానికి వెళ్లిన సమయంలో గిరిజన రైతులకు చెందిన పశువులు మృత్యువాత పడ్డ సందర్భాలు ఉన్నాయన్నారు. గతంలో చెరువు ముందు పొలాలన్నీ పంటలు పండేవి చెరువు అలుగు పెంచడం వలన చెరువు ముందు పొలాలన్నీ నీట మునిగి భారీ స్థాయిలో పంట నష్టం జరుగుతుంది అన్నారు. తక్షణమే ఇరిగేషన్ శాఖ చెరువులో చెత్త తీసివేసి చెరువు ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. మండల దీంతోపాటు మండల కేంద్రమైన లక్ష్మీ నగరం నుండి ఎంపీడీవో ఆఫీస్ మీదుగా అచ్యుతాపురం గ్రామానికి వెళ్లే జిల్లా పరిషత్ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు వర్షాకాలంలో కల్వర్టుల సైతం కొట్టుకుపోయాయి అన్నారు. ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలు కూడా నడవని పరిస్థితి ఏర్పడిందని ఈ విషయమై అనేకమార్లు ప్రజా ప్రతినిధులు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ నేటికీ రహదారి నిర్మాణం కోసం నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గంగోలు చెరువు ప్రక్షాళన తో పాటు అచ్చుతాపురం గ్రామానికి బీటీ రహదారి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు కార్యక్రమంలో తెల్లం ధర్మయ్య, సరియం కోటేశ్వరరావు, గుడ్ల రాంబాబు, గట్టుపల్లి శ్రీను, గట్టుపల్లి వెంకటేశ్వరరావు, గట్టుపల్లి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పనుల వద్ద ఉన్న కంకర మాయం

- గ్రామస్తుల ఆరోపణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల పరిధిలోని కర్ణగూడెం గ్రామ సమీపంలో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం పనుల వద్ద ఉన్న మూడు ట్రిప్పుల 40 ఎంఎం కంకర ఇటీవల కాలంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌లలో ఎత్తుకెళ్లారని గ్రామస్తులు మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. స్థానికుల కథనం ప్రకారం.. కర్ణగూడెం గ్రామం ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు వివిధ అవసరాల నిమిత్తం వర్షాకాలంలో సైతం రవాణా సౌకర్యం, సౌలభ్యం కోసం గత ప్రభుత్వం జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం ఏర్పాటుకు కొన్ని కోట్ల నిధులు మంజూరు చేయగా దాని నిర్మణం పనులు జరిగాయి. కానీ, గత వర్షాకాలం అతివృష్టితో జల్లేరు వాగు ఉగ్రరూపం దాల్చడంతో వరద ఉధృతికి బ్రిడ్జి పనుల్లో భాగమైన రెండు పిల్లర్లు పక్కకు వాలాయి. దాంతో బ్రిడ్జి పనులు అర్ధంతరంగా నిలిచాయి. సదరు గుత్తేదారు బ్రిడ్జి నిర్మాణం పనుల వద్ద వ్యక్తిని కాపలా ఉంచి, వెళ్లారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ సహాయంతో 3 ట్రిప్పుల కంకర ట్రాక్టర్‌లలో ఎత్తుకెళ్లారని తెలిపారు. రాత్రి వాహనాల చప్పుళ్ళు అవుతుండటం గమనించిన గ్రామస్తులు, కాపలాదారు వేకువజామున బ్రిడ్జి వద్ద కంకరను వెళ్లి చూడగా జేసీబీ, ట్రాక్టర్‌ల టైర్ల అచ్చులు ఉండటం, కంకర మాయమవడం గమనించామని గ్రామస్తులు తెలిపారు. 3 ట్రాక్టర్ ట్రిప్పుల కంకర విలువ సుమారు రూ.20 వేలకు పైగా ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇదేవిధంగా మండలంలో గతంలో సైతం పలు అభివృద్ధి పనుల వద్ద కంకర, సిమెంట్, ఇనుప సామాను, తదితర వాటిని గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించినట్టు స్థానికులు చెబుతున్నారు. స్థానిక పోలీసులు ఇటువంటి దొంగతనాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, దొరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి మనుగడ

నవతెలంగాణ-టేకులపల్లి

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి మనుగడ అని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు, పార్లమెంటు ఎన్నికల మండలం కన్వీనర్ హర్ష, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ అన్నారు. మంగళవారం తొమ్మిదో మైల్ బేతంపూడి ఏరియాలలో ఉపాధి హామీ కార్మికుల వద్ద రెండు న్యూడేమోక్రసీల ఆధ్వర్యంలో ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రుణ మాఫీలు చేసిన మోడీ ప్రభుత్వం రైతులకు మద్దతుధర ఇచ్చేందుకు బిజెపి ప్రభుత్వం నిరాకరి స్తుందని, ప్రధానమంత్రి రైతు బీమా పేరుతో ఇచ్చే ఆరువేల రూపాయలు 2000 చొప్పున మూడు దఫాలుగా చెల్లిస్తుందని, రైతులకు రెట్టింపు ఆదాయాలు అందిస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం అందుకు భిన్నంగా పాలన చేస్తున్నదని, లక్షలాది మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారని విమర్శించారు. ఆదివాసీల కోసం బడుగు బలహీన వర్గాలు, పేదల కోసం పని చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీ కృష్ణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భూక్యా హర్షా, కో కన్వీనర్ కల్తీ వెంకటేశ్వర్లు, గుగుతోతు రామచందర్, బాలు, సజన్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మంగళవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. చెక్ పోస్టుల తనిఖీల్లో భాగంగా పెనగడప, దమ్మపేట మండలం మందలపల్లి, అల్లిపల్లి, అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను సందర్శించి అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. అక్రమంగా నగదు, మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లాలో అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 12 అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను, 4 అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ చెక్ పోస్టుల ద్వారా, జిల్లా పోలీసులు చేపట్టిన వివిధ తనిఖీలలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.1,19,50,531ల నగదును, రూ.16,37,324ల విలువగల 2502 లీటర్ల మద్యాన్ని, రూ.2,06,85,300ల విలువగల 828 కేజీల గంజాయిని, రూ.11,22,000ల విలువ చేసే బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి మొత్తం రూ.3,53,95,155/ల (మూడు కోట్ల యాభై మూడు లక్షల తొంభై ఐదువేలు) లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు. అనంతరం అశ్వారావుపేట అగ్రికల్చర్ యూనివర్సిటీ నందు ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూము వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాస్, శివరామ కృష్ణ, దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బీటీపీఎస్ కార్మికుల ప్రతిభ

- ఆటలలో రాణించిన కార్మికులను అభినందించిన సీఈ

నవతెలంగాణ-మణుగూరు



భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కార్మికులు ఆటలలో ప్రతిభ కనబరచి బీటీపీఎస్‌ని అగ్రస్థానంలో నిలిపారని సీఈ బిచ్చన్న మంగళవారం క్రీడాకారులను అభినందించారు. పాల్వంచ కేటీపీఎస్ విఎండ్‌విఎల్ స్టేజెస్ వారి నిర్వహణలో టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ కబడ్డీ..అథేల్టిక్స్ టోర్నమెంట్‌ను గత మూడు రోజులు నిర్వహించగా బీటీపీఎస్ తరుపున పాల్గొన్న క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. కబడ్డీలో తృతీయ స్థానం, డిస్కస్ త్రో, 800 మీటర్లు పరుగు పందెం లో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్, జవాలీన్ త్రో, 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్నని జట్టు సభ్యులు అభినందించారు. సీఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడాకారులను, కళాకారులను సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సాహయిస్తూ నే ఉంటుందని, క్రీడాకారులు నిత్యం సాధన చేస్తూ పూర్తి ఆరోగ్యంతో ఉండి ముస్ముందు జాతీయ స్థాయిలో కూడా రాణించి సంస్థ పేరుని అగ్ర భాగాన నిలపాలని తెలిపారు. సంస్థ ఉద్యోగులను ఎల్లప్పుడూ కుటుంబ సభ్యులు గానే భావిస్తుందన్నారు. మీరు కూడా అంకిత భావంతో సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి శ్రమించాలని తద్వారా సంస్థ దేశంలోని ఉత్పత్తిలో అగ్ర భాగాన నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ, ఏడీఎం పి.పార్వతి, స్పోర్ట్స్ సెక్రటరీ కల్తీ నర్సింహారావు, జట్టు సభ్యులు, బి.శేషయ్య, డి.రవి, డి.రమేష్, ఎస్.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, ప్రశాంత్, జి.సతీష్, వి.వేణు, కె.మధు, ఎన్.సురేష్, కే.రాము, ఎస్.కే మొహినుద్దీన్, ఎండీ.ఆమీర్ ఖాన్, మేనేజర్ ఆర్.మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల షిఫ్ట్ వేళల మార్పుపై యాజమాన్యం పునరాలోచన చేయాలి

- టీబీజీకేఎస్



మణుగూరు : సింగరేణి సంస్థ ప్రయోజనాలు ధ్యేయంగా పనిచేస్తున్న కార్మికుల షిఫ్ట్ వేళల మార్పుపై యాజమాన్యం పునరాలోచన చేయాలని టీబీజీకేఎస్ ఇన్‌చార్జి నాయకులు నాగెల్లి వెంకట్ మంగళవారం కోరారు. మంగళవారం కార్యాల యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ సంస్థ ప్రయోజనాలు కాపాడే విషయంలో వెనుకడుగు వేయకుండా సంస్థ పురోగతిని కాపాడుతున్న కార్మికుల పని వేళల్లో మార్పు, పని గంటల కుదింపు పై యాజమాన్యం మరో మారు పునరాలోచన చేసి కార్మికులందరికీ ఆమోద యోగ్యమైన వేళలు అమలు చేసే విధంగా చొరవ చూపాలని కోరారు. గడచిన కాలంలో ఎన్నాడు లేనటువంటి భయంకర ఎండలను ఇప్పుడు చూస్తున్నామని ఈ ఎండ తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆరెంజ్ జోన్‌లుగా గుర్తించిందని అందులో కోల్ బెల్ట్ ఏరియాలే అధిక ప్రాంతాలుగా ఉన్న దృష్ట్యా యాజమాన్యం క్వారీలో అనేక రకాల సౌకర్యాలు కల్పించినప్పటికీ భానుడి కిరణాల ముందు నిలవలేకపోతున్నాయని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు రంగయ్య, రామాచారి, బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వర రావు, వినయ్ కుమార్, పద్దం శ్రీనివాస్, రమేష్, ఈర్ల రాజేష్, రవి, శ్రీహరీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాధన్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి


- మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

ఇంటర్, పాలిటెక్నిక్‌లలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందే విద్యార్థుల కోసం సరోజిని దామోదర్ ఫౌండేషన్ వారు అందిస్తున్న 'విద్యాధన్' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతిలో 9 జీపీఏ సాధించి, సంవత్సర ఆదాయం 2 లక్షలు కలిగిన వారు ఈ స్కాలర్షిప్‌లు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పదవ తరగతి మార్కుల మెమో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో www.vidyadaan.org అనే వెబ్‌సైట్ నందు జూన్ 15వ తేదీలోపు ఆన్లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అర్హులైన వారికి జులై 7వ తేదీన ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించ బడుతుందని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా రూ.10 వేల నుండి 60 వేల వరకు స్కాలర్షిప్‌లు అందుతాయని, అన్నీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8520860785, 9663517131 అనే నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

నవతెలంగాణ-టేకులపల్లి



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల పని చేయాలని కార్యకర్తలకు మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలత్ కవిత, ఇల్లందు మాజీ శాసన సభ్యురాలు భానోత్ హరిప్రియ నాయక్ దిశా నిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో దాస్ తండ గ్రామపంచాయతీలో మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ పరోక్షంగానో, ప్రత్యక్షంగానో చేరాయని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. అమలు చెయ్యలేని 6 గ్యారంటీల కాంగ్రెస్‌ను గంగలో కలపాలన్నారు. సీఎం అభ్యర్థులు లేని బీజేపీ, కాంగ్రెస్లను ప్రజలు నమ్మొద్దని బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చి మరింత అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ పెన్షన్ విడుదల చేయాలి

నవతెలంగాణ-ఖమ్మం

వరంగల్ ప్రాంతీయ ఈపిఎఫ్వో కార్యాలయం పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ఈపిఎస్ పెన్షనర్ల ఏప్రిల్ నెల పెన్షన్ ఇప్పటి వరకు చెల్లించలేదని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.గోపీచంద్, కల్యాణం నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈపిఎఫ్వో ప్రాంతీయ అధికారి బదిలీ అయినారనే కారణంతో వేరే అధికారి జాయిన్ కాకపోవడం వల్ల పెన్షన్లు చెల్లించలేదని, కిందిస్థాయి సిబ్బంది తెలిపారని, పై అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి పెన్షన్లు విడుదల చేయాలన్నారు. ఆలస్యం చేసినట్టయితే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



అకాల వర్షంతో తడిచిన ధాన్యం

నవతెలంగాణ-పెనుబల్లి

అకాల వర్షం కారణంగా మంగళవారం బ్రాహ్మాలకుంట, లంకాసాగర్ తదితర గ్రామాల్లో కల్లాలపై ఉన్న ధాన్యం తడిసిపోయింది. పట్టాలు కప్పుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాటాలు వేసేందుకు సంబంధిత శాఖ అధికారులు తూర్పాల ఆరుదాలపై ఆంక్షలు విధించడంతో కొందరు రైతులు దళారీలకే తమ ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజుల తరబడి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాటా వేయకపోవడం వల్ల అకాల వర్షాలకు పంట తడిసిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని నూతనకల్ వద్ద రాష్ట్రీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరుకు చెందిన తెల్లూరి కృష్ణ(60) మృతి చెందాడు. బాధితుల కథనం ప్రకారం కల్లూరు శాంతినగర్‌కు చెందిన ఏలూరు కృష్ణ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కల్లూరు నుండి మిట్టపల్లికి ప్యాసింజర్లను తీసుకుని వచ్చి దింపి తిరిగి వెళుచుండగా, కల్లూరు వైపు నుండి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదంలో ఏలూరు కృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

నిక్షిత్ పూర్ణను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వ్యక్తిగత సహాయకుడు, మట్టా యువసేన సభ్యుడు బత్తుల భరత్‌కుమార్, అశ్విని కుమారుడు చిరంజీవి నిక్షిత్ పూర్ణ మొదటి పుట్టినరోజు వేడుకలు స్థానిక చెర్రీస్ రెస్టారెంట్ మినీ ఫంక్షన్‌హాలులో మంగళవారం జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే రాగమయి-దయానంద్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిక్షిత్ పూర్ణ పేరున తయారు చేయించిన కేక్ కట్‌చేసి చిరంజీవిని ఆశీర్వదించారు. ఈ వేడుకల కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, మట్టా యువసేన సభ్యులు పాల్గొని నిక్షిత్ పూర్ణను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, ఎస్కే నాగుల్‌మీరా, నాయకులు గాదె చెన్నకేశవరావు, ఎండీ కమల్‌పాషా, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, బుక్కా కృష్ణవేణి, మందపాటి ముత్తారెడ్డి, కుటుంబ, బంధు మిత్రులు బత్తుల రాఘవరావు, పరిటాల సుబ్బారావు (రిటైర్డ్ తహసీల్దారు), ముత్యాల వీరభద్రరావు, మార్వతు వెంకటేశ్వరరావు, కురిశెట్టి మోహనరావు, కందుల రఘు పాల్గొన్నారు.

మోడీ గెలిస్తే రిజర్వేషన్లు మాయం

ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్

నవతెలంగాణ-ఖమ్మం

దేశ భవిష్యత్తును నిర్ణయించే పార్లమెంట్ ఎన్నికలు ప్రజల ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కారానికి, కార్పొరేట్ సంస్థల దోపిడీ వ్యవస్థలకు మధ్యన జరుగుతున్న ఎన్నికలుగా భావించి తీర్పు ఇవ్వాలని ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని డాక్టర్ మల్లేశ్వర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, సామాజిక న్యాయం సాధిద్దాం, కేంద్రంలో మార్పు కోసం ఓటేద్దాం అనే రెండు పేజీల కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ పాలనలో ఎన్నడూ లేనంత స్థాయిలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, విద్యావంతులైన యువతీ, యువకులు ఉద్యోగాలు లభించక సాంఘిక భద్రత లేక అశాంతికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలకు అందిస్తున్న రిజర్వేషన్లు కూడా తీసివేయడానికి కుట్ర జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో మోడీ గెలిస్తే రాజ్యాంగం తారుమారయ్యే అవకాశం ఉన్నదన్నారు. సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గట్టి ఎల్లయ్య , బీసీ సంఘం నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, పెరిక కుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు గజవెల్లి సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు బరుపటి ప్రసాద్, ముత్తినేని రత్నాకర్, బుడిమే విజయ్ కుమార్, సోమిశెట్టి రాధ శేఖర్ పాల్గొన్నారు .

అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా

- అడ్డుకున్న గ్రామస్తులు
- రవాణాదారులకు పోలీసుల మద్దతు..?



నవతెలంగాణ -చర్ల

ఇటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను సాయి నగర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళవారం మితిమీరిన వేగంతో ఇష్టానుసారంగా రోడ్లపై రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లను ఆపారు. రోడ్డుపై చిన్నపిల్లలు, వృద్ధులు సంచరిస్తూ ఉంటారు. కాబట్టి డ్రైవర్లు మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను తోలవద్దని గత మూడు రోజుల నుండి ఎన్ని మార్లు చెప్పిన డ్రైవర్లు పెడచెవిన పెట్టి ఇష్టా నుసారంగా డెక్కులు సౌండ్ పెట్టుకొని ఇసుక రవాణా చేయడాన్ని సాయి నగర్ ప్రజలు మూకుమ్మడిగా ట్రాక్టర్లను ఆపి ఇసుక తోలడానికి మీకు అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. దాంతో ఇసుక తోలేందుకు పరిమిషన్ లేని ట్రాక్టర్ డ్రైవర్లు ఓనర్లు చేసేది లేక స్థానిక ఒక అధికారితో పోలీసులను రంగంలోకి దింపడంతో ఇసుక తోలకాలను ఆపవద్దని పోలీస్ అధికారి గ్రామస్తులను హెచ్చరించినట్లు సమాచారం. తమకు కలిగే ఇబ్బందిని అధికారులు గుర్తించకుండా పోలీసులకు మాపై ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి సాయి నగర్ వాసులను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి

సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ముద్ద పిచ్చయ్య

నవతెలంగాణ -దుమ్ముగూడెం

ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, దాని అనుబంధ మిత్రపక్ష పార్టీలను చిత్తుగా ఓడించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ముద్ద పిచ్చయ్య పిలుపునిచ్చారు. మంగళవారం రామచంద్రంపేట గ్రామంలో పార్టీ మండల కార్యదర్శి దాసరి సాయన్న అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ముద్దా బిక్షం మాట్లాడుతూ 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని, మిత్రపక్ష పార్టీలను ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బి.నారాయణ, మండల నాయకులు బాబురావు, శంకర్, డివిజన్ నాయకులు శాంతక్క వెంకటేశ్వర్లు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అడ్డగోలు హామీలు

మాజీ ఎంఎల్‌ఏ సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-పెనుబల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ఆ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపుకై ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం పెనుబల్లి సీనియర్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబు నివాసంలో మండల స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, జెడ్పిటిసి చెక్కిలాల మోహన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి భూక్య ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, నీలాద్రి మాజీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, పెనుబల్లి మాజీ సర్పంచ్ తేజావత్ తావునాయక్, మందడి అశోక్ కుమార్, లగడపాటి శ్రీను, గోదా చెన్నారావు పాల్గొన్నారు.



ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్ రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు చాలా ముఖ్యమని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యక లాపాలపై నిఘా పెట్టాలని సూచించారు సామజిక మాధ్యమాలలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే డ్రగ్స్ నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువ నమోదవు తున్నాయో వాటి నియంత్రణకై దృష్టి పెట్టాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు ముమ్మరం చేయాలని, పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో అప్పగించిన భాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ.... పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచాలన్నారు.

చెక్ పోస్ట్ లను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

కూసుమంచి : పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాయకన్ గూడెం చెక్ పోస్ట్, తిరుమలాయపాలెం మండలం, సుబ్లేడ్ క్రాస్ రోడ్ లో గల జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి తనిఖీ చేశారు. ఈనెల 13వ తేదీన పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణ జరుగకుండా పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. సరిహద్దు ఇరువైపులా వచ్చి పోయే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. తనిఖీల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు పాటిస్తూ... ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలయ్యేలా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా తనిఖీల వల్ల సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజలు ఎవరైనా నగదును వెంటబెట్టుకొని ప్రయాణాలు చేయాల్సి వస్తే సరైన ఆధారాలు కలిగి ఉండాలని సూచించారు. ఆధారాలు లేనట్లయితే నగదు జప్తు చేస్తారని అన్నారు.

రామసహాయం మెజార్టీ

చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోవాలి



మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-దమ్మపేట

ఈ నెల 13న జరగబోవు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డికి వచ్చే మెజార్టీ పార్లమెంటు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని, అందుకు ఇండియా కూటమి తరుపున ప్రతి పార్టీ కార్యకర్త నాయకులు తీవ్ర స్థాయిలో విశేషమైన కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో జరిగిన అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి 184 బూత్ కమిటీల సభ్యులు, 5 మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందంటే 100శాతం అమలు చేసి తీరుతామని దీంట్లో ఎటువంటి అనుమానం లేదని ఆయన అన్నారు. పార్టీకోసం కష్టపడే నాయకులకు, కార్యకర్తలకు సుఖపడే రోజులు వ ం ు న వ్వ ం ు ద ు ం ఉన్నాయన్నారు. తొలుత ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, టీడీపీ నాయకులు కట్రం స్వామి, సీపీఐ నాయకులు యస్.డి. సలీం, రాష్ట్ర ఆయిల్ ఫాం రైతు సంఘ అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

పామాయిల్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఏడో గ్యారెంటీగా ధర స్థిరీకరణ చేయాలి : కొక్కెరపాటి

మండలంలోని గండుగులపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఇండియా కూటమి అభ్యర్థి రామసహాయం రెడ్డి గెలుపును కాంక్షిస్తూ జరిగిన సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పామాయిల్ రైతులు పామాయిల్ సాగుపై ఆధారపడుతూ జీవిస్తున్నారని, టన్ను పామాయిల్ గెలలకు రూ॥ 20 వేలు తగ్గకుండా ధర స్థిరీకరణ 7వ గ్యారెంటీగా కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి తుమ్మల, శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఈ ప్రాంతంలో రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి, కాబట్టి పామాయిల్ రిఫైనరీ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆ యూనిట్ వేరే జిల్లాకు వెళుతుందని పుకార్లు షికార్లు చేయడంతో పామాయిల్ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో పామాయిల్ రిఫైనరీ యూనిట్‌ను ఏర్పాటు చేసి పామాయిల్ రైతుల మనసులు గెలుచుకోవాలన్నారు. పామాయిల్ రైతులకు సాగుకు సంబంధించిన అన్ని విషయాల్లో సబ్సిడీలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఇండియా కూటమి ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఉంటుందని రామసహాయం రఘురామరెడ్డి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించడానికి పార్టీ తరపున తమ పాత్రను 100 శాతం కమిట్‌మెంట్‌తో పనిచేస్తామన్నారు.



మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-ములకలపల్లి



మండలంలో కలెక్టర్ ప్రియాంక అలా మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత సీతారాంపురం పంచాయతీ పాతూరు గ్రామశివారు చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులు పరిశీలించి అక్కడ కూలీలతో మాట్లాడారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ కూలీలతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సుబ్బనపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించి సౌకర్యాలపై ఆరాతీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాత గంగారం పంచాయతీ వలస గ్రామమైన వాగొడ్డుగుంపును సందర్శించి ఆదివాసీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు తన దృష్టికి రావడంతో వెంటనే వాటిని పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ సునీష్కు సూచించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు చూడాలని, ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నామాను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఉపాధి కూలీలతో మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని అంకంపాలెంలో గల ఉపాధి హామీ కూలీలను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం కలుసుకొని ఆత్మీయంగా మాట్లాడారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుని గెలిపించాలని మెచ్చా వారితో మాట్లాడి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న వారితో మాట్లాడుతూ రాష్ట్రంలో మాయ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలు అమలు చేసే పనిలో లేదని, అలాగే కేంద్రంలో కూడా తెలంగాణ రాష్ట్రంపై చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సోడెం గంగరాజు, ఊకె వెంకటేశ్వరరావు, సున్నం కష్ణ, కాక భద్రయ్య, చంద్ర శేఖర్, చక్రయ్య, బాల కష్ణ ,వెంకటేశ్వరరావు, మల్లేష్, అశోక్, నడ్డి సత్యనారాయణ, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

బవిరిశెట్టికి నివాళి అర్పించిన మెచ్చా

దమ్మపేటకు చెందిన బవిరిశెట్టి శ్రీనివాసరావు మంగళవారం మరణించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను సంఘీభావం తెలిపారు.

మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ విస్తృత ప్రచారం

దుమ్ముగూడెం : మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ మంగళవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా సీతారాంపురం గ్రామంలోని 125వ బూత్‌లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణ మూర్తి, సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, ఎస్సి సెల్ అధ్యక్షులు మోతుకూరి శ్రీకాంత్, పొడియం సుబ్బారావు పాల్గొన్నారు.

అలుపెరుగని నేత కిరణ్

ఐదో వర్ధంతి సభలో యూఈఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకిరెడ్డి

నవతెలంగాణ-పాల్వంచ

విద్యుత్ రంగంలో కార్మికుల సమస్యల పట్ల అలుపెరుగని పోరాటం చేసిన నేత ఎస్.కిరణ్‌ని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకిరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కేటీపీఎస్ సీఐటియు యూనియన్ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా ఆ చిత్రపటానికి పూలమాలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో కార్మికుల సంక్షేమం కోసం వారి సమస్యల పట్ల నిరంతర పోరాట నిర్వహించారని, కార్మిక సంఘాలను ఐక్యం చేసి సమస్యల పట్ల పోరాటాలు నిర్వహించి విజయం సాధించిన ఘనత ఆయనదని చెప్పారు. ఇదే స్ఫూర్తితో అనే ఆశయాలకు కనుగుణంగా అందరం కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు సాంబశివరావు దొడ్డ రవికుమార్, సత్య శేషయ్య, ముసలయ్య, పత్యం వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, రాజు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

మిత్రపక్షాల బలపరిచిన ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 3, 5 వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊకంటి గోపాలరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం ద్వారా రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రుణం తీర్చుకోవాలని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేయడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పరమేష్ యాదవ్, అనిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.వీరబాబు, ఆకునూరి కనకరాజు, కమర్, తాండ్ర నాగబాబు, గొల్ల శ్రీను, కౌన్సిలర్స్ తంగేళ్ల లక్ష్మణ్, పల్లపు లక్ష్మణ్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి 1969 ఉద్యమకారుల మద్దతు..

ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామ సహాయం రఘురామిరెడ్డి విజయానికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సమితి తెలిపారు. ఉద్యమకారుల సమస్యలను కాంగ్రెస్‌తోనే పరిష్కారమవుతాయని అందుకే తాము మద్దతు ఇస్తూ విజయానికి దోహద పడుతామని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అభ్యర్థి రఘురామిరెడ్డిని చుంచుపల్లి లోని క్యాంప్ కార్యాలయంలో కలిసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో 1969 ప్రత్యేక తెలంగాణ తొలి, మలి దశ సమితి ప్రధాన కార్యదర్శి కెజిఎస్.మాథ్యూస్, కార్యవర్గ సభ్యులు డి.నాగేశ్వరరావు, బ్రహ్మం, జయరాజ్, రామచందర్, సీతారాం, కనకరాజు, వీరాస్వామి, అప్పా రాజయ్య లక్ష్మీనారాయణ, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో చల్లబడ్డ కాలం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మునుపెన్నడూ లేనంతగా ఈ ఏడాది వేసవి ఎండలు అధికంగా ఉండడంతో ఎండ తీవ్రతలకు కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు, చెట్ల కింద సేద తీరుతున్న ప్రజలకు మంగళవారం ఉరుములు మెరుపులతో కురిసిన కొద్దిపాటి వర్షానికి ఉపశమనం కలిగినట్లు అయింది. మంగళవారం ఉదయం నుండి వాతావరణం మబ్బుగా ఉండటంతో పాటు మధ్యాహ్నం ఒక్కసారి గా కొద్దిపాటి ఉరుములతో గాలి వాన రావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో చిన్న పెద్ద తేడా లేకుండా సుమారు రెండు నెలలకాలంగా తీవ్రమైన ఎండలకు మాడిపోతున్న ప్రజలు హమ్మయ్య కాలం చల్లబడింది అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద బాధితునికి సాయం

నవతెలంగాణ-కారేపల్లి

ఎద్దు పొడిచిన ప్రమాదంలో వెన్నుముక్కకు తీవ్రగాయాలతో మంచానికి పరిమితమైన యువకునికి ఇల్లందుకు చెందిన ఆదివాసీ హెల్ప్‌లైన్ మంగళవారం ఆర్థిక సాయం అందించింది. కారేపల్లి మండలం పోలంపల్లికి చెందిన కొర్స కిరణ్ 8 నెలల క్రింత చేను వద్ద నుండి ఎద్దుకు తోడ్కోని వస్తున్న సందర్భంగా వెనక నుండి ఎద్దు, కిరణ్ పొడిచింది. దీంతో వెన్నుపూసకు తీవ్ర గాయమై చికిత్స తీసుకుంటున్నాడు. ఇప్పటికే రూ.10 లక్షలు కాగా కిరణ్ మంచానికే పరిమితమైనాడు. ఇప్పటికి నెలకు రూ.15 వేలు మందులకు ఖర్చు అవుతుంది. కిరణ్ పరిస్థితిని తెలుసుకున్న ఇల్లందు ఆదివాసీ హెల్ప్‌లైన్ సభ్యులు విరాళాలు సేకరించి ఆదివాసీ హెల్ప్‌లైన్ వ్యవస్థాపకులు కబ్బాకుల రవి, అధ్యక్షులు కుర్సం అంజయ్య చేతుల మీదగా రూ.17,500లను అందజేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు కొర్స కిరణ్ మంచానికి మూడు చక్రాల సైకిల్ పరిమితమైనాడని, అతనికి పూర్వ జీవితం ఇవ్వటానికి దాతలు ముందురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హెల్ప్ లైన్ కోశాధికారి ఉండం నాగేందర్‌రావు, ఉపాధ్యక్షులు చాపల రమేష్ బాబు, సభ్యులు కొర్స రాజేష్, చీమల కృష్ణయ్య, తుడుందెబ్బ నాయకులు పూనెం శివరాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-కారేపల్లి

బీఆర్ఎస్ శ్రేణుల వలసల పరంపర సాగుతుంది. మంగళవారం కారేపల్లిలో బీఆర్ఎస్ యూత్ సభ్యులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కారేపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో నూతనంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇల్లందులో రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్ కారేపల్లిలో వైరా ఎమ్మెల్యేను కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యేకు మిఠాయి అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, నాయకులు బానోత్ రామ్మూర్తి, మేదరి వీరప్రతాప్, అడ్డగోడ ఐలయ్య, నర్సింగ్ శ్రీనివాస్, సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, సురేందర్ మనియార్, గుగులోత్ బీముడు, దారావత్ వినోద్, భూక్యా జామ్లా, ఎండీ.హనీఫ్, తాజుద్దీన్, మేదరి రాజా, చీకూర్తి రవీందర్, బానోత్ కోటి, హారు, సోందు, సోమందుల వెంకటేశ్వర్లు, షఫీ తదితరులు ఉన్నారు.

ఉచిత మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ

నవతెలంగాణ- నేలకొండపల్లి

నేలకొండపల్లిలోని భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సర్వీస్ సొసైటీ మాజీ ప్రధాన కార్యదర్శి యలమద్ది లెనిన్ కుమారుడు యలమద్ది అర్జున్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఉచిత మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ చేపట్టారు. నేలకొండపల్లి పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న పరిసర ప్రాంత ప్రజలకు ఎండల తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ మంచినీళ్ల పంపిణీ ఏర్పాటు చేసినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు. గత 15 రోజులుగా దాతల సహకారంతో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని నేలకొండపల్లి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుట్టినరోజు జరుపుకుంటున్నటువంటి యలమద్ది అర్జున్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని దీవెనలు అందించారు. ఈ బృహత్తర కార్యక్రమానికి తమ వంతు సహకారాన్ని అందించాలనుకునే దాతలు భక్త రామదాసు సర్వీస్ సొసైటీ సభ్యులను రేలా నరసింహారెడ్డి ఫోన్ నెంబర్ 9989505749ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పొన్నగాని శ్రీనివాస్ గౌడ్, దండా రవీంద్రబాబు, మాజీ అధ్యక్షులు వల్లంచెట్ల భాస్కరరావు, కోడూరు వెంకటాచారి, పచ్చ తిరుపతయ్య, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, చావ గణపతి, రేలా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని వాహనదారుడు మృతి

నవతెలంగాణ-కొణిజర్ల

టూవీలర్‌ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నుండి వైరా వైపు వెళ్తున్న టూ వీలర్ వాహనదారుడు వైరా నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బస్సు పల్లిపాడు వద్ద ఢీకొనడంతో టూవీలర్ నడుపుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లికి చెందిన కొరడాల రామకృష్ణ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని



హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

పినపాక మాజీ శాసనసభ్యులు రేగా

నవతెలంగాణ-పినపాక

పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్టం సుభిక్షంగా ఉందని, తెలంగాణ హక్కులు తెలంగాణ అస్తిత్వం కాపాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు కోరారు. మంగళవారం సాయంత్రం పినపాక మండలం ఈ.బయ్యారం క్రాస్ రోడ్ లో గల పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంకొచ్చి చేతులు ఎత్తేసారని ఆరోపించారు. మహబూబాద్ పార్లమెంటు అభివృద్ధి జరగాలంటే మాలోత్ కవితను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఎంపీటీసీ సత్యం, ఆత్మ కమిటీ చైర్మెన్ భద్రయ్య, దొడ్డ శ్రీనివాస రెడ్డి, కొండెరు రాము, వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ఘానికి గురై ఒకరు మృతి

నవతెలంగాణ - అశ్వారావుపేట

విద్యుత్ఘాతానికి గురై ఓ తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన జరిగింది. స్థానిక ఎస్.హెచ్.ఓ ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. ఏపీలోని కాకినాడ జిల్లా రౌతం పూడి మండలం బలరామ పురానికి చెందిన దాసరి సూరిబాబు(40) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కొద్ది రోజుల క్రితం అశ్వారావుపేటకు చెందిన తాపీ మేస్త్రీ పీ.లక్ష్మణరావు, అశ్వారావుపేటలో ఓ భవన నిర్మాణ పనులు చేసేందుకు సూరిబాబుతో పాటు కొద్దిమంది కార్మికులను తీసుకొచ్చాడు. వీరంతా స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో నివాసం ఉంటూ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి పని ముగిసిన తర్వాత సూరిబాబు స్నానం చేసి తడిసిన టవల్ ను పిల్లర్లుకు కట్టిన ఉన్న మోటరు వైరుపై ఆరేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్కు గురై కింద పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికు తరలించగా వైద్యులు పరీక్షించి మార్గమధ్యలోనే పరిస్థితి విషమించి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి అన్నయ్య దాసరి అప్పన్నబాబు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేడిగడ్డను సందర్శించిన..

జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్

- ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన



నవతెలంగాణ-భూపాలపల్లి/మహాదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా పరిధి కాళేశ్వరం ప్రాజెక్టుపై చేపట్టిన న్యాయ విచారణలో భాగంగా జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్ర గోష్, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మేడిగడ్డ బ్యారేజ్‌లో మేజర్‌గా దెబ్బతిన్న 20వ నంబర్ పిల్లర్‌ను, పాక్షికంగా దెబ్బతిన్న 19, 21 పిల్లర్లను కమిషన్‌కు సంబంధించిన అధికారులు, నిపుణుల బృందం సభ్యులు పరిశీలించారు. బ్యారేజీపై ఏడో బ్లాకులో వంతెనపై కాలినడకన సాగుతూ అణువణువూ పరిశీలించారు. ఏడవ బ్లాక్‌లో 20 పిల్లర్ దెబ్బతిన్న ప్రాంతాన్ని చూసి అధికారుల నుంచి వివరాలను సేకరించారు. బ్యారేజీ దిగువకు చేరుకొని 19, 20, 21 పిల్లర్ల కింది భాగంలో వచ్చిన పగుళ్లను పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న పరిస్థితులు, పిల్లర్ల కుంగుబాటు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్ర గోష్ మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన విషయంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటన చేస్తున్నట్టు చెప్పారు. ఇరిగేషన్ శాఖ నిపుణులతో కలిసి మేడిగడ్డ బ్యారేజి పరిశీలించామన్నారు. పరిశీలనలో వెలుగులోకి వచ్చిన విషయాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఅండ్ఎం జనరల్ అనిల్ కుమార్, ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్ రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఈఈ తిరుపతిరావు, ఎల్అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ రజనీష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీలు రాలే.. లూటీలు షురూ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్‌కు చెప్పి బంద్ చేయించిండు' అని ఆరోపించారు. "కరెంటు వస్తుందా..? పొలాలు ఎండుతున్నాయి.. కేసీఆర్ ఉన్నప్పుడు ఉన్న కరెంటు ఇప్పుడు ఎక్కడికి పోయింది. మంచినీళ్లు వస్తున్నాయా..? భగీరథతో బ్రహ్మాండంగా నీళ్లు ఇచ్చాం. మరి ఇప్పుడు ఏమైంది. ధాన్యం కొంటున్నారా..? వరికి బోనస్ బోగస్ అయింది. ఊర్లకు పోవుడు.. ఒట్లు పెట్టుడు కేసీఆర్‌ను తిట్టుడే రేవంత్‌రెడ్డి పని అయింది. పని చేసే సిపాయి ఎక్కడైనా ఒట్టు పెడతాడా..?" అని ప్రశ్నించారు.

అబ్‌కి బార్.. పెట్రోల్ డీజిల్ '400 పార్'

'దేశ ప్రధానిగా మోడీ పదేండ్లుగా పని చేసిండు. 150 హామీలు ఇచ్చిండు. ఒక్క హామీ నెరవేరిందా..? సబ్‌కా వికాస్ అంటూ సబ్‌కా సత్యానాశ్ చేసిండు. ఎక్స్‌పోర్ట్స్ బంద్ అయ్యాయి. ఇన్‌పోర్ట్స్‌లు పెరిగాయి. మేకిన్ ఇండియా.. డిజిటల్ ఇండియా అన్నాడు. ఏమైనా జరిగిందా..?' అని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు జరగలేదని, రూపాయి విలువ పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడి కృష్ణా, గోదావరి నదుల నీళ్లను ఇతర రాష్ట్రాలకు తరలించుకోవాలని చూస్తోందని చెప్పారు. 'అబ్‌కి బార్ 400 పార్ అని మోడీ అంటున్నాడు. ఈసారి మోడీ వస్తే పెట్రోల్, డీజిల్ 400 పార్ అవుతాయి' అని అన్నారు. బీజేపీ ఎప్పుడైనా దోపిడీదారులు, పెట్టుబడిదారుల పార్టీయే తప్ప.. అది పేదల పార్టీ కాదని అన్నారు. తెలంగాణకు ఏనాడూ ఒక్క మంచి పని నరేంద్ర మోడీ చేయలేదని విమర్శించారు. పైగా తెలంగాణ ముచ్చట ఎప్పుడు వచ్చినా తల్లిని చంపి.. బిడ్డను బతికించారని ఓ దిక్కుమాలిన మాట మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతసేపూ మతవిద్వేషం.. ప్రజల మధ్య చిచ్చుపెట్టడం, గందరగోళం చేసుడే తప్ప.. ఏ ఒక్క మంచి పని ప్రజలకు చేసింది లేదని విమర్శించారు. అందువల్ల బీజేపీకి ఓటు వేసినా వేస్టే అని, ప్రజలకు ఏం లాభం జరగదని అన్నారు. దేశంలో సంకీర్ణ ప్రభుత్వమే రానుందని, బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు ఇస్తే కేంద్రంలో కీలకం అవుతామని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం కాపాడేది బీఆర్ఎస్సేనని, కాంగ్రెస్ ఇచ్చిన పథకాలు మెడలు వంచి అమలు చేసే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని అన్నారు. కావునా లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజిబుద్దీన్ తదితరులున్నారు.

తక్షణమే సహాయక చర్యలు చేపట్టండి

- జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, పోలీసు అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- లోతట్టు కాలనీలు, ట్రాఫిక్, విద్యుత్ సమస్యపై సమీక్ష
- సహాయక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారీ వర్షం, ఈదురుగాలులతో ఇబ్బంది పడుతున్న వారికి తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవడం, ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలపై వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. వరంగల్ పర్యటనలో ఉన్న సీఎం అక్కడి నుంచే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్.ఏ.ఎం రిజ్వీ, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇండ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలనీ, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

ఆందోళన వద్దు...

తడిచిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

- సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ కోరారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయిందన్న సమాచారంతో మంగళవారం ఆయన సిద్ధిపేట జిల్లా కొముురవెల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వడగండ్ల వానలతో వరి ధాన్యంతో పాటు ఇతర పంటలకూ నష్టం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకూ కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొంటుందని భరోసా కల్పించారు. సొంత స్థలంలో కాకుండా అద్దెకు నడుపుతున్న కేంద్రాల అద్దెలను రైతుల నుంచి వసూలు చేయకుండా సొసైటీలు, ఐకేపీ భరిస్తాయని వివరించారు. ఇకపైన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

ప్రచారానికి ప్రతికూలంగా ప్రకృతి

- గాలివాన బీభత్సానికి కరీంనగర్ కాంగ్రెస్ సభ రద్దు
- మంథనిలోనూ రద్దయిన రాజస్థాన్ సీఎం బీజేపీ ప్రచార సభ
- నేటి ప్రధాని వేములవాడ సభపైనా తర్జనభర్జన
- మొన్నటివరకూ 45డిగ్రీల ఎండ ప్రచండం.. ఇప్పుడేమో గాలివాన బీభత్సం
- కరీంనగర్‌లో 'వెలిచాల'కు కలిసిరాని సీఎం సభలు
- నిరుత్సాహంలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు



చిరిగిపోయిన ఫ్లెక్సీలు

వేములవాడలో నేడు నిర్వహించబోయే ప్రధాని మోడీ సభ వేదికలో కూలిన టెంట్లు, చెల్లాచెదురు అయిన కుర్చీలు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు ఈ వేసవిలో ప్రకృతి ప్రతికూలంగా మారింది. ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు ప్రచండంగా దంచికొట్టి అభ్యర్థుల ప్రచారాన్ని ఉదయం, సాయంత్రం వేళలకే పరిమితం చేయగా.. మంగళవారం ఈదురుగాలులతో బీభత్సం చేసిన భారీ వాన ప్రచార సభలను రద్దయ్యేలా చేసింది. కరీంనగర్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనాల్సిన కాంగ్రెస్ జనజాతర సభ ప్రారంభ సమయానికే కురిసిన భారీ వర్షం కారణంగా రద్దయింది. మంథనిలో బీజేపీ ప్రచారసభకు రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఆలస్యంగా రావడం, అప్పటికే వాన జోరందుకోవడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఈ భారీ వర్షాలు మూడు రోజులపాటు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న క్రమంలో.. నేడు వేములవాడలో ప్రధాని మోడీ ప్రచారసభ సైతం జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదేమైనా కరీంనగర్ అభ్యర్థి 'వెలిచాల'కు మాత్రం సీఎం సభలు కలిసిరాకపోవడం ఆ పార్టీ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది.

సోమవారం వరకు మండిపడిన ఎండ రాజకీయ పార్టీల పగటి ప్రచారానికి బ్రేక్ వేసింది. ఏప్రిల్‌లోనే ఈ ఎండల ప్రభావం 103 ఏండ్ల ఆల్‌టైం రికార్డ్‌ను బ్రేక్ చేసి 40డిగ్రీల నుంచి క్రమంగా 46డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలకు చేరుకుంది. సోమవారం వరకు దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 45 నుంచి 46డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆయా పార్టీల నాయకులు ఉదయం 11గంటల వరకే ప్రచారం ముగించుకుని సాయంత్రం 5గంటల తరువాత తిరిగి నిర్వహించుకుంటూ వచ్చారు. మంగళవారం కురిసిన వాన భారీ బహిరంగ సభలకు బ్రేక్ వేసింది.

ప్రచారానికి, సభలకు భారీ వర్షం బ్రేక్

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఎస్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ జనజాతర సభకు భారీఎత్తున ఏర్పాట్లు చేయగా.. భారీ వర్షంతో చివరి నిమిషంలో రద్దయింది. తొలుత ఆ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ వస్తారని చెప్పిన నేతలు చివరకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని ప్రకటించగా.. సభా ప్రాంగణానికి ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తునే చేరుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేసినా.. సభ ప్రారంభ సమయమైన 4గంటలకే ఈదురుగాలుతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో సభా ప్రాంగణంలోని కుర్చీలన్నీ చెల్లాచెదురయ్యాయి. టెంట్లన్నీ కూలిపోయాయి. సభా వేదిక సైతం కుప్పకూలింది. గంటపాటు ఎడతెగకుండా కురిసిన వర్షం సాయంత్రం 5.30కు చిరుజల్లులతో ఆగిపోయింది. అల్గునూర్ మానేరు బ్రిడ్జి మొదలు ఎస్ఆర్ఆర్ కాలేజీ వరకు రోడ్డు పొడవునా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఫ్లెక్సీలన్నీ చిరిగిపోయి, పలుచోట్ల నేతల కటౌట్లు పడిపోయి సభా ఉత్సాహాన్ని నీరుగార్చేలా చేశాయి. అయితే సభను కొనసాగిస్తామని తొలుత జిల్లా నాయకత్వం ప్రకటించినా 6గంటల సమయంలో మళ్లీ వాన జోరందుకోవడంతో జనజాతర సభను రద్దు చేస్తున్నట్టు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రకటించారు.



కరీంనగర్‌లో కూలిపోయిన కాంగ్రెస్ సభావేదిక, టెంట్లు, చెల్లాచెదురైన కుర్చీలు.

మంథనిలో బీజేపీ సభ రద్దు

పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కోసం రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ పర్యటన మంగళవారం ఖరారైంది. అయితే రాజస్థాన్ సీఎం మంథనిలో క్యాంపెయిన్ నిర్వహించేందుకు ఆలస్యంగా చేరుకున్నారు. ఒక్కసారిగా ఈదురుగాలులు, వర్షం మొదలవడంతో సభా వేదిక వద్దకు వచ్చిన జనమంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. బీజేపీ సీఎం టూర్ నేపథ్యంలో భారీగా జన సమీకరణ చేపట్టినప్పటికీ చివరి నిమిషంలో వరుణుడు అడ్డుకోవడం ఆ పార్టీ శ్రేణులను నిరుత్సాహపరిచింది. సభావేదిక ప్రాంగణంలో వేసిన కుర్చీలు, టెంట్లు చెల్లాచెదురయ్యాయి.

నేటి ప్రధాని మోడీ సభపై తర్జనభర్జన

నేడు (బుధవారం) వేములవాడలో నిర్వహించబోయే ప్రధాని మోడీ సభపైనా వర్షం ప్రభావం చూపుతోంది. వాతావరణ శాఖ సైతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్‌పై వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. ఈ క్రమంలో మంగళవారం నుంచే వేములవాడలో ఏర్పాటు చేసిన సభా వేదిక ఈదురుగాలులకు కుప్పకూలింది. టెంట్లు, షామియాలన్నీ చిరిగిపోయాయి. కుర్చీలన్నీ చెల్లాచెదురయ్యాయి. దీంతో బుధవారం ఉదయం కల్లా ఏర్పాట్లన్నీ పునరుద్ధరిద్దామన్నా.. అర్ధరాత్రి వరకూ వర్షం ఆకంటపరుస్తూనే వచ్చింది. వర్షం ఇలాగే కొనసాగితే ప్రధాని సభ కూడా రద్దయ్యే అవకాశం ఉండటంతో కమలం శ్రేణుల్లో నిరుత్సాహం అలుముకుంది.

రాజ్యాంగ రక్షణకు కార్మికవర్గం నడుం బిగించాలి

సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు

- ఘనంగా మేడే వారోత్సవాల ముగింపు సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత రాజ్యాంగ రక్షణకు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికవర్గం నడుం బిగించాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ గార్డెన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. అంతకుముందు సీఐటీయూ కార్యాలయం నుంచి సభ వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో సాయిబాబు మాట్లాడుతూ.. కార్మికులు హక్కులు, ఎనిమిది గంటల పని దినం కోసం ప్రాణాలర్పించి చట్టాలు సాధించుకున్నారని గుర్తు చేశారు. 1886 మే 1న అమెరికాలోని చికాగోలో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఎనిమిది గంటల పని దినం కోసం ఉద్యమించిందన్నారు. ఆ క్రమంలో అక్కడి ప్రభుత్వం వారిపై పోలీసులతో కాల్పులు జరిపించడంతో అనేక మంది కార్మికులు అమరుల య్యారని చెప్పారు. వారి త్యాగాల కారణంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాలు అమలవుతున్నాయన్నారు. కార్మికులు చిందించిన రక్తపు మడుగులోనే ఎర్రజెండా పుట్టిందన్నారు. అనంతరం కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ అనేక ఉద్యమాలు చేసి సాధించిందని గుర్తు చేశారు. నేడు దేశంలో రాజ్యాంగం, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రమాదంలో ఉన్నాయని, వాటి రక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగం మౌలిక సూత్రాలపై దాడి చేస్తోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ చట్టాల సవరణ చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నదని, దేశ కార్మిక, కర్షక వర్గం నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు చౌకగా అమ్మేస్తుందని వివరించారు. లౌకిక ప్రజాతంత్ర భారత రాజ్యాంగం బీజేపీ పాలనలో ప్రమాదంలో పడిందన్నారు. కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి, పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని సవరించి, 12 గంటలకు పెంచి శ్రమ దోపిడీకి గురి చేసేలా విధానాలు రూపొందిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కృషి చేయాలని, పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద, కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అభ్యుదయ, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ కుమార్, కోశాధికారి కె.సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, నైతం శోభ, డి.వెంకటమ్మ, సహాయ కార్యదర్శులు ఎం.సుజాత, జితేందర్, పెర్క దేవిదాస్, అగ్గిమల్ల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి పాల్గొన్నారు.



మూడో నెంబర్

"గుర్తుం"దా...!

- సింగిల్ హ్యాండ్‌కి ఓటు వేయండి
- ఆర్ఆర్ఆర్‌ని గెలిపించండి : సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్

నవతెలంగాణ-ఖమ్మం

"అమ్మా.. అక్క.. బాబూ.. తాతా.. చెల్లి.. తమ్ముడూ ఈవీఎంలో మూడో నెంబర్ "గుర్తుం"దా..! అదేనండి మన హస్తం గుర్తు. ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో మన ఆర్ఆర్ఆర్‌కి ఓటు వేసి గెలిపించండి" అంటూ సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ ప్రచారం నిర్వహించారు. ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్ నుంచి పాత బస్టాండ్, జెడ్పీసెంటర్, పాత కలెక్టరేట్ మీదుగా ఇల్లందు క్రాస్ రోడ్ వరకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, తన వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం రోడ్ షో నిర్వహించారు. మంత్రి పొంగులేటి, ఎంపీ రేణుకా చౌదరి, అభ్యర్థి ఆర్ఆర్ఆర్ పాల్గొన్న ఈ రోడ్ షోలో ప్రసంగించారు. అక్కడ భద్రాచలంలో శ్రీరాముడు.. ఇక్కడ ఖమ్మంలో రఘురాముడు.. ఈ రఘురాముడికి ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అన్నారు. అందరికీ "గుర్తుం"ది...! కదా... ఈనెల 13..! ఆ రోజు ఈవీఎంలో మూడో నెంబర్ హస్తం గుర్తుకు వేయండి. ఓటు వేయడం మన బాధ్యత... మన హక్కు.... అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

ఎనీ టైం... ఎనీ సెంటర్ అంటూ సందడి

ఎనీ టైం .. ఎనీ సెంటర్.. సింగిల్ హ్యాండ్ రఘురాముడు.. ఖమ్మం.. ఖమ్మం.. ఖమ్మం.. కమాన్ అంటూ సినీ హీరో వెంకీ నగరంలో సందడి చేశారు. ఖమ్మం ప్రజానీకం వెంకటేష్‌ను చూసేందుకు ఉత్సాహం చూపారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ రోడ్ షోకు నీరా'జనం' పలికారు. అభివాదం చేస్తూ.. హస్తం గుర్తుకు ఓటు వేసి ఆర్ఆర్ఆర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన ముందుకు సాగారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, నాయకులు నవీన్ రెడ్డి, బషీర్, భుక్యా శ్రీను, తిరుపతిరావు, బి.సుదర్శన్, కాంగ్రెస్ జిల్లా నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, జావిద్, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, కార్పొరేటర్ కమర్తపు మురళి, బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు జానీమియా, పోటు కళావతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

కవితకు కస్టడీ పొడిగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులో 14 వరకు కస్టడీని పొడిగించిన కోర్టు, సీబీఐ కేసులో 20 వరకు కస్టడీ పొడిగిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈడీ, సీబీఐ కేసులో గతంలో కవితకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో... మంగళవారం మధ్యాహ్నం కవితను జైలు సిబ్బంది స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. తొలుత ఈడీ కేసులో వాదనలు జరగగా... కేసు దర్యాప్తు పురోగతిని ఈడీ తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ కె మట్ట కోర్టుకు వివరించారు. ప్రస్తుతం దర్యాప్తు కీలక దశలో ఉన్నందున కవిత కస్టడీని పొడిగించాలని కోరారు. అంతకు ముందు కవిత న్యాయవాదులు నితేశ్ రాణా, మోహిత్ రావులు మూడు విజ్ఞప్తులను కోర్టు ముందుకు తెచ్చారు. కవితను కలిసేందుకు హైదరాబాద్ నుంచి తమ కుటుంబ సభ్యులు వచ్చారని, కవితతో 15 నిమిషాలు మాట్లాడేందుకు వారిని అనుమతించాలని కోరారు. అలాగే జైలులో కవితకు మరో 10 పుస్తకాలు అనుమతించాలని కోరారు. కోర్టు లాకప్ లో కవితకు తన భర్త తెచ్చిన ఆహారం తినేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జైలులో కవితకు ఇంటి భోజనం అందించేందుకు మార్చి 26 ఆదేశాల్లో కోర్టు అనుమతించిందని, అయితే ఈ భోజనాన్ని 10, 15 మంది జైలు సిబ్బంది చెక్ చేయడంతో కలుషితం (కాంటామినేషన్) అవుతోందని కోర్టు దృష్టికి తెచ్చారు. అందువల్ల హోం ఫుడ్ ఇవ్వడం ఆపేసామని, అలా కాకుండా జైలు డాక్టర్ చెక్ చేసి కవితకు ఫుడ్ అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన జడ్జి, ఇంటి భోజనం ఆపేసిన తరువాత మళ్లీ ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. కవితకు ఇంటి భోజనం అందించే అంశంపై జైలు సూపరింటెండెంట్ వివరణ కోరతామని చెప్పారు. అనంతరం ఈడీ వాదనలను పరిగణలోకి తీసుకొని కవిత జ్యుడీషియల్ కస్టడీని 14 వరకు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కోర్టు లాకప్‌లో కవితను కలిసేందుకు అనుమతించడంతో పాటు, జైల్లో చదువుకునేందుకు వీలుగా మరో 10 పుస్తకాలకు అనుమతి ఇచ్చారు. అనంతరం ఆమెను కోర్టుకు తరలించారు.

సీబీఐ కేసులో 20 వరకు కస్టడీ..

సీబీఐ కేసులో కస్టడీపై అరగంట వ్యవధిలోనే వాదనలు జరిగాయి. సీబీఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పంకజ్ గుప్తా వాదనలు వినిపించారు. కేసు వ్యవహారంలో మరింత మందిని విచారించాల్సి ఉందని, కీలక అంశాలు రాబట్టాల్సి ఉందని అన్నారు. దర్యాప్తు సజావుగా సాగేందుకు కవిత కస్టడీని పొడిగించాలని కోరారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని 20 వరకు పొడిగిస్తున్నట్టు వెల్లడించింది. తదుపరి విచారణ మే 20న చేపడతామని స్పష్టం చేసింది.

వారం రోజుల్లో కవితపై చార్జ్ షీట్ దాఖలు : ఈడీ

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత పాత్రపై వచ్చే వారం రోజుల్లో చార్జ్ షీట్ దాఖలు చేయనున్నట్టు ఈడీ తరపు న్యాయవాది ఎన్ కె మట్ట కోర్టుకు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలింగ్ తుది దశకు చేరినట్టు ఆయన మీడియాకు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని యోచిస్తున్నట్టు చెప్పారు.

రేవణ్ణను దేశం దాటించి, నాలాంటి వాళ్లను అరెస్ట్ చేస్తారా? : కవిత

ప్రజ్వల్ రేవణ్ణ లాంటి వారిని దేశం దాటించి, తనలాంటి వాళ్లను అరెస్ట్ చేయడం అన్యాయమని కవిత అన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని ఆమె కోరారు. కోర్టు హాల్లోకి వెళ్లే ముందు కేవలం జై తెలంగాణ, జై భారత్ అనే నినాదాలు చేశారు. అయితే సీబీఐ కేసులో విచారణ తరువాత బయటకు వచ్చిన కవిత, రేవణ్ణ అంశాన్ని ముడిపెడుతూ కేంద్రంలోని బీజేపీపై పరోక్షంగా విమర్శలు చేశారు.

బెయిల్‌పై నేడు హైకోర్టుకు కవిత

ఈడీ, సీబీఐ కేసుల్లో రౌస్ ఎవెన్యూ కోర్టు బెయిల్ నిరాకరించడంతో నేడు (బుధవారం) కవిత ఢిల్లీ హై కోర్టును ఆశ్రయించనున్నారు. ఈ మేరకు కవిత అరెస్ట్‌ను చాలెంజ్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్టు ఆమె భర్త అనిల్ తెలిపారు. పీఎంఎల్ఏ చట్టం లోని నిబంధనలకు విరుద్ధం, అక్రమంగా కవితను అరెస్ట్ చేశారని పిటిషన్ లో పేర్కొననున్నట్టు తెలిసింది. అలాగే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ కు ముందు రోజు ఆమెను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేయనున్నట్టు సమాచారం.

- చిగురుటాకులా వణికిన భాగ్యనగరం
- ఈదురుగాలులకు తోడుగా భారీ వర్షం
- మియాపూర్‌లో అత్యధికంగా 13.35 సెంటీమీటర్లు నమోదు
- రోడ్లన్నీ అస్తవ్యస్తం.. స్తంభించిన జనజీవనం
- రాష్ట్రంలోనూ పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వాన
- రాత్రి 10 గంటల వరకు 609 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- రెండు, మూడు డిగ్రీల మేర తగ్గిన ఉష్ణోగ్రతలు

మండుటేసవిలో భారీ వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మండుటేసవిలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం భాగ్యనగరాన్ని చిగురుటాకులా వణికించింది. పలు జిల్లాల్లో ఈదురుగాలుల వానతో పంటలు నేలకొరిగాయి. మంగళవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో చాలా చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మొత్తంగా 609 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని మియాపూర్‌లో అత్యధికంగా 13.35 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి, నల్లగొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల భారీ వాన పడింది. 25 ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. అందులో గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రాంతాలే ఎక్కువగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల వడగండ్ల వాన పడింది. బుధ, గురువారం కూడా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలుల వర్షం పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయి. సాయంత్రం, రాత్రి సమయాల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు పడే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీలుగా ఉండొచ్చు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. నిన్నటితో పోలిస్తే మూడునాలుగు డిగ్రీల మేర పడిపోయాయి. వచ్చే రెండ్రోజులు కూడా రెండు, మూడు డిగ్రీల మేర తగ్గే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉష్ణోగ్రతలు తగ్గినప్పటికీ ఉక్కపోత మాత్రం తీవ్రంగా ఉంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

నిజామాబాద్	44.7 డిగ్రీలు
బిచ్కుంద(కామారెడ్డి)	44.7 డిగ్రీలు
నర్సాపూర్(నిర్మల్)	44.3 డిగ్రీలు
దానూర్(నిర్మల్)	44.1 డిగ్రీలు
మగ్దుంపూర్(కామారెడ్డి)	44.0 డిగ్రీలు

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివే

మియాపూర్ (రంగారెడ్డి)	13.35 సెం.మీ.
కూకట్‌పల్లి (మేడ్చల్ మల్కాజిగిరి)	11.78 సెం.మీ.
చందానగర్(రంగారెడ్డి)	10.75 సెం.మీ.
జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం	10.50 సెం.మీ.
బాచ్‌పల్లి (మేడ్చల్ మల్కాజిగిరి)	10.45 సెం.మీ.
ఎమ్ఎమ్‌టీఎస్ లింగంపల్లి(రంగారెడ్డి)	10.08 సెం.మీ.

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలు



కొబ్బరి నీటిలోని కాల్షియం ఎముకల్ని, పళ్ళను దృఢంగా ఉంచి, కండరాల బలోపేతానికి సహకరిస్తుంది. శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయిన పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. విరోచనా లతో ఇబ్బంది పడే వారు శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు కొబ్బరి నీరు తాగాలి. మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం, సోడియం వంటి పోషకాలు ఉన్న కొబ్బరి నీరు తాగడం వల్ల గర్భవతులకు మలబద్దకం, జీర్ణకోశంలో సమస్యలు తలెత్తవు. పాలిచ్చే తల్లులు ఈ నీళ్ల తాగితే పాల ద్వారా వారి బిడ్డలకు ఈ పోషకాలు అందుతాయి. కొబ్బరి నీరు తల్లి పాలలో చేరి లారిక్ యాసిడ్‌ను పెంచుతుంది. దీనిలో యాంటీఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఉంటాయి.

ప్రొటీన్ మనకు చాలా అవసరం...



మన శరీరంలో జుట్టు, చర్మం, ఎముకలు, కండరాలు ఏర్పడటానికి, పెరుగుదలకి ప్రొటీన్ అవసరం. శరీరంలో ఎంజైమ్స్, హార్మోన్స్, నరాల పనితీరుకి కూడా ప్రొటీన్స్ అవసరం. ఈ ప్రొటీన్స్ ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన చిన్న అమైనో ఆమ్లాల గొలుసులు. ఇది కండరాల పెరుగుదలని మెరుగ్గా చేస్తుంది. మొత్తం 20 అమైనో ఆమ్లాలు ఉన్నాయి. వాటిలో తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు. ఈ తొమ్మిది శరీరంతో ఉత్పత్తి కావు. మనం తినే ఆహార పదార్థాల నుంచి వీటిని పొందొచ్చు. ఈ అమైనో ఆమ్లాలని ప్రధానంగా ప్రోటీన్ల నుంచి పొందొచ్చు. ఈ అమైనో ఆమ్లాలు.. మాంసం, చేపలు, చికెన్, సోయా, క్వినోవా, గోధుమ వంటి మాంసాహార ఆహారాల్లో ఉంటుంది.



'స్త్రీలు ఎక్కడ పూజింపడతారో అక్కడ దేవతలు నడయాడుతారు అంటారు. స్త్రీ ఔన్నత్యానికి సమాజంలో వారికి ఉన్న ప్రాధాన్యతకు మన భారతీయ సంస్కృతి ఇచ్చిన గౌరవం అది. కానీ ఈ రోజు జరుగుతున్నది ఏమిటి? మహిళలు అంటే అడుగడుగునా అవమానాలు, లైంగికదాడులు, హత్యలు. అందుకే ప్రతి స్త్రీ మూర్తికి ప్రణమిల్లి చెబుతున్నాం. మీ రక్షణ కోసం, సమాజంలో మీకు సమున్నత గౌరవం కోసం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుంది' ఒకానొక సందర్భంలో బీజేపీ నాయకులు అన్న మాటలు ఇవి. కానీ ఆచరణలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. బీజేపీ కాలంలోనే మహిళలపై దాడులు మరింత పెరిగిపోయాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 'బేటీ బచావో, బేటీ పడావో', 'మహిళా శక్తి' అంటూనే మనువాదాన్ని ప్రవేశపెట్టి మహిళలకు తిరిగి ఇంటికి పరిమితం చేయాలని చూస్తున్నది బీజేపీ ప్రభుత్వం. ఎవరి నోట విన్నా ఇప్పుడు ఇవే వినిపిస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మీకు ఎలాంటి పాలన కావాలని అడిగితే మహిళల స్పందన ఎలా ఉందో చూద్దాం...

మాటల్లోనే మహిళా శక్తి



మహిళా అణచివేత చరిత్ర కలిగిన ఆర్ఎస్ఎస్ నుంచి బీజేపీ ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. వారి సనాతన విశ్వాసాలు, పితృస్వామ్య మనస్తత్వం స్త్రీలను బలహీనులుగా మాత్రమే చూస్తాయి. స్త్రీలు ఎప్పుడూ మగవారికి లోబడి ఉండాలని చెప్తారు. సొంత నిర్ణయాలు తీసుకోలేని వారిగా, గొంతు లేని వారిగా చిత్రీకరిస్తున్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో మహిళలపై పెరుగుతున్న నేరాలే దీనికి నిదర్శనం. 2014కు ముందు మహిళల పట్ల ఇంతటి దిగజారుడు తనాన్ని మనం చూడలేదు. ఉన్నావ్, హత్రాస్ కేసులలో బాధితులు, వారి కుటుంబాలపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుల గురించి విన్నాం. కాపాడాల్సిన వారే నేరస్థులతో చేతులు కలపడం కండ్లారా చూశాం. అంతేనా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులన్నీ నేటి బీజేపీ పాలనలో హరించివేయబడుతున్నాయి. మహిళలను రక్షిస్తామని చెబుతున్న కేంద్రం ఆచరణలో మాత్రం మనువాద విధానాలతో మరింత దుస్థితిలోకి నెట్టివేస్తోంది.

అభద్రతా భావంలో బతుకుతున్నారు

హింసకు గురైన బాధితులను న్యాయానికి దూరం చేసి దేశంలో మహిళలకు రక్షణ లేకుండా చేశారు. అభద్రతా భావంలో బతికేలా చేస్తున్నారు. దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన రెజ్లర్‌లు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని నడిరోడ్డుపై నినదించినా వారి ఆర్తనాధాలు వినిపించుకోలేదు. మణిపూర్‌లో మహిళలపై సామూహిక లైంగిక దాడి చేసి, వివస్త్రలను చేసి ఊరేగించినా నోరు మెదమని పాలకుల చేతుల్లో మన దేశం ఉంది. అందుకే మహిళలు భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి మరింత దిగజారి పోతుందనీ, తమ ఉనికే ప్రశ్నార్థమవుతుందని వారు ఆందోళన చెందడం సహజం.

పూర్తి భిన్నంగా ఉన్నాయి

21వ శతాబ్దంలో మహిళలు సమానత్వం, స్వేచ్ఛను కోరుకుంటున్నారు. వారు తమ కార్యాలయంలో, కుటుంబంలో, సామాజిక సమూహాలలో, సమాజంలో సమానత్వాన్ని కోరుకుంటున్నారు. సొంత ఎంపికలు చేసుకునే స్వేచ్ఛను కోరుకుంటున్నారు. కానీ నేడు దేశాన్ని పాలిస్తున్న పాలకుల విధానాలు మహిళల ఆలోచనలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. భారతదేశంలోని ప్రతి స్త్రీకి సమానత్వాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వుంది. అలాంటి ప్రభుత్వం కావాలని మహిళలు కోరుకుంటున్నారు.

సేకరణ : సలీమ



బీజేపీతో దేశానికి నష్టమే



కేంద్రంలో పదేండ్ల నుండి బీజేపీ పాలిస్తుంది. ఇప్పటి వరకు దేశానికి చేసింది ఏమీ లేదు. పైగా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. మహిళల గురించి తక్కువగా మాట్లాడుతున్నారు. మణిపూర్‌లో మహిళలను లైంగిక దాడి చేసి వివస్త్రలుగా చేసినా నోరు విప్పలేదు. ఇలాంటి వారి వల్ల దేశానికి నష్టం తప్ప ఎలాంటి లాభం లేదు. పైగా జీఎస్టీ తెచ్చి పన్నుల భారం మరింత పెంచాడు. నేను ఈ మధ్య నాలుగు చీరలు కొంటే పదిహేను వందలు జీఎస్టీనే కట్టాల్సి వచ్చింది. పెట్రోల్, గ్యాస్ రేట్లు పెంచారు. ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ ఏదో రేట్లు తగ్గిస్తున్నట్టు గ్యాస్‌పై కొంత తగ్గించారు. ఇవన్నీ సామాన్యులకు భారాలుగా మారాయి. కాబట్టి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ వస్తే దేశానికి కాస్త అయిన మంచిదని అనిపిస్తుంది.

- ఊర్మిళ, ఉప్పల్

బీజేపీని ఓడించాల్సిందే



దేశంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ప్రజాస్వామ్యం అంటే విలువ లేకుండా పోతోంది. బీజేపీ వాళ్ళు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. అమ్మాయిలు చదువులు మానేసి మళ్ళీ ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి వచ్చేలా అనిపిస్తుంది. రెజ్లర్‌లు తమపై దాడులు జరిగాయని అన్ని రోజులు ధర్నాలు చేసినా అస్సలు పట్టించుకోలేదు. మణిపూర్‌లో కూడా అంతే. మనువాదాన్ని ప్రవేశపెట్టి మహిళల జీవితాలను పాతాళంలోకి నెట్టేసేలా ఉన్నారు. మహిళలు పిల్లల్ని కని పెంచితే సరిపోతుందని మాట్లాడుతున్నారు. ఇలాంటి ప్రధాని వల్ల దేశానికి నష్టం తప్ప ప్రయోజనం ఉండదు. కాబట్టి ఈసారి బీజేపీ ఓడిపోయి కాంగ్రెస్ వస్తే కొద్దిగైనా బాగుందనిపిస్తుంది.

- కె.సుమతి, ఫ్యాషన్ డిజైనర్

మతం పేరుతో విడదీస్తున్నారు



బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం పరిస్థితి బాగా మారిపోయింది. నోట్లు రద్దు చేసినప్పుడు ఎంతో మంది చాలా ఇబ్బందులు పడ్డారు. జీఎస్టీ తెచ్చి మనపై విపరీతమైన భారాలు మోపారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు. అన్నిటికంటే ముఖ్యంగా కలిసి మెలిసి ఉండే ప్రజలను మతం పేరుతో విడదీయాలని చూస్తున్నారు. ఇక్కడే పుట్టి, పెరిగిన ముస్లింలను ఇక్కడి వారు కాదన్నట్టు ప్రచారం చేస్తున్నారు. పాఠశాల విద్య నుండి రామాయణ, మహాభారతం వంటికి ప్రవేశపెట్టి మతోన్మాదాన్ని పెంచి పోషించాలని చూస్తున్నారు. పైగా రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్నారు. ఇలాంటి వారు దేశాన్ని పాలిస్తే మరింత నష్టం తప్ప ఎలాంటి ఉపయోగం లేదు. కాబట్టి బీజేపీ ఓడిపోవాల్సిందే.

- అమీన, ప్రైవేట్ ఉద్యోగి

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. ఈ ప్రాంతానికి ఎన్ని నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి మారిన బూర నర్సయ్యగౌడ్ ఐదు సంవత్సరాలు ఎంపీగా ఉండి ఎన్ని నిధులు తెచ్చి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. సొంత ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. వైద్యసంస్థలను పెంచుకోవడమే పనిగా పెట్టుకున్నారు తప్ప ప్రజలకు సేవ చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రజల కోసం ఎక్కడ ధర్నాలు చేశారు, ఎప్పుడైనా జైళ్లకు పోయారా అని ప్రశ్నించారు. ప్రజల వెన్నంటి ఉండి పనిచేస్తున్న తనను గెలిపిస్తే ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు తెస్తానని అన్నారు. గోదావరి జలాలు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. పిలాయిపల్లి కాల్వ సాధన కోసం 130 రోజులు దీక్షలు చేపట్టామన్నారు. సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగానే ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వలు సాధించామన్నారు. పార్లమెంట్‌కు దద్దమ్మలు ఎన్నికవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాట నాయకులను గెలిపించి ఆయుధం ఇవ్వాలని కోరారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, నాయకులు ఎమ్‌డి.పాషా, బండారు నర్సింహా, నందిపాటి మనోహర్, అవ్వారు రామేశ్వరి, ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ బెయిల్ పై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేయాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణ గురువారం లేదా వచ్చే వారంలో జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఓ పార్టీ అధినేతగా ఆయన ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని విచారణ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ఒకవేళ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తే.. అప్పుడు ఎక్సైజ్ పాలసీ కేసుతో లింకున్న ఫైల్స్‌ను కేజ్రీ చూడరాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రిగా అధికారిక బాధ్యతలు నిర్వర్తించొద్దని సూచించింది. అయితే, సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ఈడీ వ్యతిరేకించింది. సీఎం అయినంత మాత్రాన ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించకూడదని అభిప్రాయపడింది. కేసుల విషయంలో రాజకీయ నాయకులకు మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేసింది. ఇరు పక్షాల వాదనలూ విన్న అత్యున్నత న్యాయస్థానం ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. తన నిర్ణయాన్ని రిజర్వ్‌లో ఉంచింది.

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు కస్టడీని మరోసారి రౌస్ అవెన్యూ కోర్టు పొడగించింది. మంగళవారంతో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో అధికారులు ఆయన్ను తీహార్ జైలు నుంచి రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా, కేజ్రీవాల్‌కు 20 వరకు కస్టడీని పొడిగించారు. దీంతో కేజ్రీవాల్ మరో 14 రోజులు జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.

రైతు భరోసాకు ఈసీ బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

నగదు జమ చేయాలని ఈసీ స్పష్టం చేసింది. ఈ నెల తొమ్మిదో తేదీలోపు అందరికీ రైతుభరోసా చెల్లింపులు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎస్.వేణు కుమార్ అనే వ్యక్తి ఈసీకి ఫిర్యాదు చేశారు. సీఎం వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం నివేదిక తెప్పించుకుంది. ఇప్పటికే కొనసాగుతున్న పథకాలకు సంబంధించిన నగదు బదిలీకి ఎలాంటి ప్రచారం లేకుండా గతంలో అనుమతించినట్టు ఈసీ తెలిపింది. గత శాసనసభ ఎన్నికల సమయంలో కూడా అప్పటి ఆర్థిక మంత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు రైతుబంధు చెల్లింపులకు అనుమతి నిలిపివేసినట్టు పేర్కొంది. ఈసీ నిర్ణయంతో రైతు భరోసా నిధుల చెల్లింపులు ఆగిపోయాయి.

మేడిగడ్డకు మరమ్మతులు వృథానే !

(మొదటిపేజీ తరువాయి)

విచారించిన అనంతరం ఎన్డీఎస్ఏ బ్యారేజీల పునరుద్ధరణ సంబంధించిన మధ్యంతర నివేదికను రాష్ట్ర సాగునీటిపారుదల శాఖకు ఈనెల ఒకటిన నివేదిక ఇచ్చింది. వానాకాలంలోపు బ్యారేజీల వైఫల్యంపై జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ (జీపీఐ), జియో సాంకేతిక పరీక్షల అనంతరం డిజైన్లు, డ్రాయింగులు సిద్ధం చేసి, మరమ్మతులకు పూనుకోవాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) చైర్మెన్ అనిల్ జైన్ మధ్యంతర నివేదిక మంగళవారం లీక్ కావడంతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019 జూన్‌లో మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభించగా మొదటి వరదల అనంతరం 2019 నవంబరులో గేట్లు మూసివేయగా, బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు (సీసీ బ్లాకులు), ఏప్రాన్ దెబ్బతిన్నట్టు గుర్తించడం జరిగిందని అన్నారు. అయితే మరమ్మతులతోపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) పనులు చేయకుండా బ్యారేజీని వినియోగించడంతో 2023 అక్టోబరు 21వ తేదీన బ్యారేజీ కుంగిపోయిందని ఎన్డీఎస్ఏ నివేదిక స్పష్టం చేసింది. మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్ నెం.16 నుంచి 21 దాకా ఆయా స్థాయిల్లో కుంగిపోయి, దెబ్బతిన్నాయని వివరించింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ ఏప్రాన్లు దెబ్బతిన్నాయనీ, సీసీబ్లాకులు చెల్లాచెదురు అయ్యాయని గుర్తు చేసింది. అన్నారం బ్యారేజీతో పాటు గేట్ల వద్ద ఇసుక మేటలు వేస్తుండటంతో నీటి పారుదల శాఖ నిరంతరం వీటిని తొలగించి, వరద సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరింది. వానాకాలంలోపు బ్యారేజీలకు తగిన పరీక్షలు చేసి, మరమ్మత్తులు చేయాల్సిన బాధ్యత డ్యామ్ సేఫ్టీ చట్టం -2023 ప్రకారం డ్యామ్ ఓనర్(రామగుండం చీఫ్ ఇంజనీర్)దేనని పేర్కొన్నది. ఈ సందర్భంగా బ్యారేజీల పునరుద్ధరణకు పలు సూచనలు చేసింది.

మరమ్మతులకు ఎన్డీఎస్ఏ సూచనలు

1. మేడిగడ్డ బ్యారేజీ మరింత దెబ్బతినకుండా మరమ్మత్తులు చేయాలి. మరమ్మత్తులు యధాతథాస్థితిని కొనసాగించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. భవిష్యతులో ఏ పరిణామాలు చోటుచేసుకున్నా బ్యారేజీ దెబ్బతినకుండా ఉంటుందనే గ్యారంటీ లేదు.

2. పగుళ్లను నిరంతరం పరిశీలించాలి. బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో సీసీ బ్లాకులు ధ్వంసమయ్యాయి.

3.పిల్లర్లు 16 నుంచి 22 దాకా పగుళ్లు వచ్చాయి. ఆ పిల్లర్లు మరింత దెబ్బతినకుండా వాటికి ఇనుప పట్టీలు వేయాలి.

4. రాఫ్ట్(పునాది)పై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

5. రాఫ్ట్ కింద ఉన్న ప్రెషర్ రిలీవ్ వాల్వ్ మరమ్మతులు చేయడం లేదా మార్చడం చేయాలి.

6. బ్లాకు-7 కుంగుబాటును నిరంతరం పరిశీలించడానికి వీలుగా టోటల్ స్టేషన్‌ను వినియోగించాలి. బ్లాక్-7 రాఫ్ట్ కిందకు ఇసుక చేరింది. దీనికోసం ఇసుక నింపిన బస్తాలతో పాటు సిమెంట్ బస్తాలను వరుస క్రమంలో పెట్టాలి.

7. బ్యారేజీ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైల్‌ను పరిశీలించాలి. ప్లింత్ శ్లాబు కింద ఇన్వర్టర్డ్ ఫిల్డర్లపై ఉన్న కాంక్రీట్ బ్లాకులు దెబ్బతిన్నాయి. ప్లింత్ స్లాబులపై కింద ఉన్న ఫిల్డర్లనుంచి ఇసుక కొట్టుకుపోయిందా...? లేదా వరిశీలించాలి.

8. జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ చేసి, సీకెంట్ ఫైల్స్ దెబ్బతిన్న చోట షీట్ ఫైల్లు దించాలి. సీకెంట్ ఫైల్స్ ఎండ్‌సీల్ మధ్య సిమెంట్, ఇసుక మిశ్రమంతో గ్రౌటింగ్ చేయాలి.

9. సీకెంట్ ఫైల్స్ వైఫల్యంతో రాఫ్ట్ (పునాది) కింద భారీ రంధ్రాలు(బొరియలు) పడ్డాయి. వీటిని మూయడానికి రాఫ్ట్ 5 నుంచి 7 సెంటీమీటర్ల మేర రంధ్రాలు వేయాలి. రెండు మీటర్ల కన్నా ఎక్కువ వేయరాదు. సిమెంట్, ఇసుక, నీళ్లతో గ్రౌటింగ్ చేయాలి. వాటిని గుర్తించడానికి బోర్ రంధ్రాల్లోకి కెమెరాలను పంపాలి. గ్రౌటింగ్ చేసే క్రమంలో రాఫ్ట్‌పై ఒత్తిడి, భారం పడకుండా చూసుకోవాలి.

10, వర్షాకాలంలో ఏడో బ్లాకు గేట్లన్నీ ఎత్తి ఉంచాలి. గేట్లు ఎత్తే క్రమంలో అన్ని గేట్లను సమగ్రంగా పరిశీలించాలి. వర్షాకాలంలో బ్యారేజీ గేట్లతో పాటు అన్ని కాంపోనెంట్లను తనిఖీచేయాలి. ప్రధానంగా ఏడో బ్లాకులోని 15 నుంచి 22 గేట్లు ఓపెన్ కావడం లేదు. దీనికోసం క్రేన్లను ఏడో బ్లాకుపై కాకుండా వేరే చోట పెట్టి, గేట్లను ఎత్తాలి. ఈ క్రమంలో పిల్లర్లకు ఇనుప పట్టీలను బిగించాలి.

11. పిల్లర్ నెంబర్ 20-21 మధ్య ఉన్న గేట్లను తొలగించాలి.

12. బ్యారేజీ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైళ్లు, శ్లాబును కలిపే సీసీ బ్లాకులు, ప్లింత్ స్లాబులు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి కట్టాలి. ఈ క్రమంలో వాటి కింద ఉన్న ఇసుకను సరిచేయాలి.

అన్నారం, సుందిళ్లకు ఒకే తరహా మరమ్మతులు

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే తరహా సమస్యలు ఉండటంతో వాటికి ఒకే తరహా మరమ్మత్తులను ఎన్డీఎస్ఏ సూచించింది.

1. అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సీకెంట్ పైళ్లను పరిశీలించాలి.

2. నాలుగు వరుసల ఉన్న బ్లాకులను తొలగించి, వాటి కింద ఉన్న ఇన్వర్టర్డ్ పిల్లర్ల స్థానంలో జియో టెక్స్‌టైల్ పిల్లర్లు పెట్టాలి. రాళ్లు లేకుండా చేసుకోవాలి.

3. నాలుగు వరుసల్లోని సీసీ బ్లాకులను ఇనుప కడ్డీలతో అనుసంధానం చేసి, పరదను దిగువకు వదిలిపెట్టినప్పుడు అవి కొట్టుకుపోకుండా చూసుకోవాలి. ఇక రాఫ్ట్ కింద రంధ్రాలు ఉంటే గుర్తించి, గ్రౌటింగ్ చేయాలి.

ఈ సీజన్‌లో కూడా బ్యారేజీలకు హాలీడే

బ్యారేజీల మరమ్మతుల కోసం జియో ఫిజికల్, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసి, మరమ్మతుల కోసం తగిన డిజైన్లు, డ్రాయింగులు సిద్ధం చేయాలని ఎన్డీఎస్ఏ రాష్ట్ర నీటిపారుదల శాఖకు గుర్తు చేసింది. అయితే మరో నాలుగు వారాల్లో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉందనే సంకేతాలున్నాయి. ఆయా పరీక్షలు చేయడానికే దాదాపు నెలరోజులకు పైగా సమయం పడుతుంది. ఇక డిజైన్లు, డ్రాయింగ్‌లకు కనీసం 15 రోజుల సమయం కావాల్సిందే. అదే జరిగితే ఈ సీజన్లో మరమ్మతులకు అవకాశాల్లేవు. ప్రధానంగా ప్రాణహితకు భారీగా వరదలుంటాయి. మేడిగడ్డకు ప్రతియేటా జూన్ నుంచి ఫిబ్రవరి దాకా ప్రాణహితకు వరదలు వస్తుంటాయి. డిసెంబరులోనే కాస్తా తగ్గుముఖం పట్టినా, రోజుకు 11 వేల క్యూసెక్కుల వరద ఫిబ్రవరి దాకా వస్తుంది. అన్నారం, సుందిళ్లకు నవంబరులో వరదలు తగ్గుముఖం పడతాయి. ఈ బ్యారేజీలను మరమ్మత్తులు చేయడానికి అవకాశం ఉన్నా, మేడిగడ్డకు మరమ్మత్తు అంత సులభం కాదు. మేడిగడ్డ మరమ్మత్తులు కత్తిమీద సాములాంటివే. మేడిగడ్డ లేకుండా ఇతర బ్యారేజీలన్నీ దండగే అని నీటిపారుదల శాఖ అధికారులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నా, తాపీగా వానాకాలానికి నెలరోజుల ముందు ఎన్డీఎస్ఏ నివేదిక ఇవ్వడంతో మరమ్మతులు ఇక ప్రశ్నార్థకం కానున్నాయి.

ఏమిచ్చినవో చెప్పి వరంగల్‌కు రా..

(మొదటిపేజీ తరువాయి)

నిధులిచ్చింద్రో చెప్పాలన్నారు. వేయిస్తంభాల గుడికి ఏం గుర్తింపు ఇచ్చింద్రు ? ఏం ఇవ్వకుండా బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి ? అని ప్రశ్నించారు. బిడ్డకు బెయిల్ ఇప్పించుకునేందుకు కార్యకర్తలను ఫణంగా పెట్టి బీజేపీతో కేసీఆర్ చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ నుంచి ఒక నేతను బయటకు పంపి ఆ నేతకే బీజేపీ టికెట్ ఇచ్చి పోటీ చేయిస్తుందన్నారు. డిసెంబర్‌లో కేసీఆర్‌ను ప్రజలు బండకేసి కొట్టినా ఆయనలో మార్పు రాలేదన్నారు. కారు షెడ్డుకు పోయిందని, దీంతో కేసీఆర్ బస్సులో బయల్దేరిండన్నారు. వరంగల్ నగరాన్ని రెండో రాజధానిలా అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంచనాలను రివైస్ చేసి పంపించాలని సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను పునరుద్ధరిస్తామన్నారు. ప్రధాని మోడీ పరిశ్రమలన్నీ గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను 10 ఏండ్లలో నెరవేర్చలేదని, మాజీ సీఎం కేసీఆర్ కూడా అడగలేదని ఆరోపించారు. అందుకే ఈ ఎన్నికలు తెలంగాణ, గుజరాత్ మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. మొన్న డిసెంబర్‌లో జరిగిన ఎన్నికలు సెమీఫైనల్ మ్యాచ్ అయితే, పార్లమెంటు ఎన్నికలు ఫైనల్ మ్యాచ్ అన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌ను డకౌట్ చేయాలన్నారు. ఢిల్లీ సుల్తానులను ఎదిరించిన గడ్డ కాకతీయ గడ్డ.. ఇప్పుడు ఒకపక్క మోడీ.. అమిత్ షా, మరోపక్క రాహుల్.. రేవంత్‌రెడ్డి మధ్య పోరాటం జరుగుతోందన్నారు. ఈ పోరాటంలో కాకతీయుల వారసులైన మీరు నా పక్క వుండి గుజరాత్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

తులసివనంలో గంజాయి మొక్కలా ఒక పక్క ఎర్రబెల్లి, మరోపక్క 'అరూరి' అనకొండ వున్నారని, భూమి కనిపిస్తే అనకొండలా మింగుడేనని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదని, రెండూ కలిసి దొంగ దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నాయని అన్నారు.

నన్ను నమ్మండి..ప్లీజ్

(మొదటిపేజీ తరువాయి)

స్నేహితులమంటూ కపట ప్రేమను ప్రదర్శిస్తారు. కానీ ముస్లిం సమాజం చైతన్యవంతంగా మారింది. త్రిపుల్ తలాక్ రద్దు చేసినప్పుడు వారి ఆందోళనపై నేను నిజాయతీగా ఉన్నానని ముస్లిం సోదరీమణులు భావించారు. ఆయుష్మాన్ కార్డులు ఇచ్చినప్పుడు, కోవిడ్ వ్యాక్సిన్లు అందుబాటులోకి తెచ్చినప్పుడు వారు అలాగే భావించారు. నేను ఎవరిపైనా వివక్ష చూపడం లేదని వారు అర్థం చేసుకున్నారు. విపక్షాల అబద్ధాలు బయటపడ్డాయి. అదే వారి బాధ. అందుకే తప్పుదోవ పట్టించేందుకు రకరకాల అబద్ధాలు చెప్తూనే ఉంటారు" అని మోడీ విపక్షాలపై విరుచుకుపడ్డారు.

కొద్దిరోజుల క్రితం ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపద అంతా మైనార్టీలైన ముస్లింలకు పంచుతుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. "ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చెప్పింది. ఆమేరకు దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు" అని విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో లబ్ది కోసం ఒక వర్గానికి వ్యతిరేకంగా ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. ఈ క్రమంలోనే మోడీ స్పందన వచ్చింది. అలాగే తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ముస్లిం వర్గానికి పిలుపునిచ్చారు. ఇప్పటిదాకా జరిగిన మూడు విడతల పోలింగ్‌లో ఫలితాలు తారుమారు అవతాయని సంకేతాలు రావటంతో మోడీకి ముస్లింలపై ప్రేమవచ్చిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

అధికారంలోకి రాగానే అగ్నివీర్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

భారత సైన్యం ప్రారంభించలేదని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని రాహుల్ గాంధీ విమర్శించారు. ఇలాంటి చర్యలతో దేశం కోసం ప్రాణత్యాగం చేసే అమరవీరుల్లో విభజన సరికాదని ఆయన అన్నారు. జార్ఖండ్‌లోని గుమ్లా పట్టణంలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. 'ఇండియా వేదిక అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తాం. ఈ పథకాన్ని సైన్యం తీసుకుని రాలేదు, ప్రధానమంత్రి మోడీ తీసుకొని వచ్చారు. అలాగే అమరవీరుల మధ్య విభజనలు మాకు ఇష్టం లేదు. దేశం కోసం ప్రాణత్యాగం చేసినవారందరూ అమరవీరులే. వారికి పెన్షను ఇవ్వాలి' అని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. జీఎస్టీపై ఆయన మాట్లాడుతూ ఐదు ట్యాక్స్ శ్లాబులతో బీజేపీ ప్రభుత్వం తప్పుడు విధానాలు అమల్జేస్తోందన్నారు. దీనిని సవరించి పేదలపై భారాలు పడనిరీతిలో పన్ను శ్లాబ్ విధానం తీసుకొస్తామన్నారు. గిరిజనలకు బీజేపీ అడుగడుగునా ద్రోహం చేస్తోందని రాహుల్ విమర్శించారు. 'వనవాసీ' పేరుతో ఆదివాసీల అటవీ హక్కులను బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని, అడవి బిడ్డల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రతిష్టాపనకు, న్యూఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా ప్రధాని మోడీ అవమానించారని ఆయన విమర్శించారు. మంగళవారం ముందుగా చైబాసాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేలు మొదలైన వాటిని బడా పారిశ్రామిక వేత్తలకు కాషాయ పార్టీ అప్పగిస్తుందని అన్నారు. అదానీ, అంబానీల కోసమే మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. తాము అధికారం లోకి వస్తే కోట్లాది మందిని లక్షాధికారులుగా మారుస్తామని హామీ ఇచ్చారు. పేద మహిళలకు ఏటా రూ. లక్ష సహాయం అందజేస్తామని చెప్పారు.

పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్లు, ఇతర ప్రభుత్వ అధికారులు మే 13న వేతనంతో కూడిన సెలవు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రంలోని 17 లోకసభ నియోజక వర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ ఎన్నికలకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొంది.

బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్

బాహుబలి చరిత్రలో కొత్త అధ్యాయం



రాజమౌళి

'బాహుబలి ఫ్రాంచైజీకి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్'తో బాహుబలి చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించడం అద్భుతంగా అనిపిస్తుంది' అని దర్శకుడు రాజమౌళి అన్నారు.

డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో రాబోయే బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్ యానిమేటెడ్ సిరీస్ యూనివర్స్‌ని హైదరాబాద్‌లోని ఏఎంబి సినిమాస్‌లో గ్రాండ్‌గా ఆవిష్కరించారు. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియావర్క్స్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, విజనరీ ఫిల్మ్ మేకర్ రాజమౌళి, శరద్ దేవరాజన్, శోభు యార్లగడ్డ దీనిని నిర్మించారు. జీవన్ జె. కాంగ్, నవీన్ జాన్ దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ ఈనెల 17న డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది.

"బాహుబలి' కోసం క్యారెక్టర్ ఆర్క్స్, ప్రీ స్టోరీ, పోస్ట్ స్టోరీ రాసినప్పుడు బాహుబలి యూనివర్స్‌లో ప్రేక్షకులకు చెప్పడానికి ఇంకా కథ ఉందనిపించింది. వెస్ట్రన్ కంట్రీస్‌లో ఒక సినిమా విజయవంతమైతే ఆ బ్రాండ్ అనేక మీడియమ్స్‌లో ముందుకు వెళ్తుంది. ఇక్కడ మాత్రం అలా జరగడం లేదు. సినిమా విజయవంతమైతే అక్కడితో అయిపోతుంది. అయితే మేము ఈ విజయాన్ని కొనసాగించాలని వీర్ ఫిలిమ్స్, సిరీస్ ఇలా చాలా విధాలుగా ప్రయత్నించాం. ఇలాంటి సమయంలో శరత్ వచ్చారు. యానిమేషన్‌లో ఆయన విజన్ నాకు చాలా నచ్చింది. అలా వారితో అసోసియేట్ అయ్యాం. ఆయనతో చాలా కథా చర్చలు జరిగాయి. బాహుబలి ప్రతి పాత్రలో సోల్, ఎమోషన్ ఉంటుంది. ఆ ఎమోషన్ ప్రేక్షకులను గొప్పగా హత్తుకుంటుంది. ఈ యానిమేషన్ సిరీస్‌ని శరత్ కూడా ఆ సోల్ పట్టుకొని అద్భుతంగా రూపొందించడం ఆనందంగా వుంది. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియావర్క్స్, డిస్నీం హాట్‌స్టార్‌లతో కలిసి పనిచేయడం ఒక అద్భుతమైన అనుభవం' అని ఎస్.ఎస్.రాజమౌళి చెప్పారు.

నవచిత్రం

వైభవంగా నవతిహి ఉత్సవం



తెలుగు చిత్ర సీమ 90 ఏళ్ల ప్రయాణాన్ని నవతిహి ఉత్సవంగా ఘనంగా నిర్వహించేందుకు మలేషియా వేదిక కానుంది. ఈ కార్యక్రమం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా)ప్రెసిడెంట్ విష్ణు మంచు ఆధ్వర్యంలో ఘనంగా జరగనుంది.

కౌలాలంపూర్‌లోని బుకిట్ జలీల్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ స్టేడియంలో జూలై 20న ఈ వేడుకని అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నారు. ఈ వేడుకలో సినిమా రంగానికి చెందిన అతిరథులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఈ వేడుక ప్రాముఖ్యతను వివరించడంతోపాటు దీనికి ప్రోత్సాహకరంగా నిలుస్తున్న భాగస్వాములను అందరినీ పరిచయం చేస్తూ సన్‌వే పిరమిడ్, సన్‌వే రిసార్ట్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది.

మూడు దేశాల నుండి వచ్చిన ప్రతిపాదనలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఈ ప్రతిష్టాత్మకమైన ఈవెంట్‌ను మలేషియాలో నిర్వహించడం ఉత్తమమని నిర్ణయం తీసుకున్నారు. మలేషియా టూరిజం, మా, స్థానిక ఈవెంట్ ఆర్గనైజర్ ఎంసి ఎంటర్‌టైన్‌మెంట్ భాగస్వామ్యంతో ఈ గ్లోబల్ వేడుకను ఘనంగా నిర్వహించబోతున్నారు.

నవతిహి ఉత్సవం కేవలం సినిమా విజయాలకు వేడుక మాత్రమే కాదు. మలేషియా ప్రజలు, తెలుగు మాట్లాడే వర్గాల మధ్య పరస్పర అవగాహన, గౌరవాన్ని పెంపొందించే సాంస్కృతిక మార్పిడికి చిహ్నంగా ఈ ఈవెంట్ జరగనుందని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు తెలిపారు.

రియల్ ఇన్సిడెంట్‌తో 100 క్రోర్స్



2016లో జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్‌ని బేస్ చేసుకుని వినోదభరితంగా '100 క్రోర్స్' చిత్రాన్ని నిర్మించారు. దివిజా కార్తీక్, సాయి కార్తీక్ నిర్మాతలుగా ఎస్.ఎస్.స్టూడియోస్ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రానికి విరాట్ చక్రవర్తి రచయిత, దర్శకుడు. కళ్యాణ్ చక్రవర్తి.జి సహ నిర్మాతగా, వెంకట్ సుధాకర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన ఈ ఈవెంట్‌లో దర్శకులు వీర శంకర్, మల్లిక్ రామ్, నిర్మాత హర్షిత్ రెడ్డి, నిర్మాత దామోదర ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

సాయి కార్తీక్ మాట్లాడుతూ, '2016లో జరిగిన వాస్తవ కథ. ఈ మూవీ చాలా బాగా వచ్చింది. చూసిన వాళ్లంతా బాగుందని అన్నారు. ఈ మూవీ పెద్ద విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు.

హీరో చేతన్ మాట్లాడుతూ, 'తెలుగు పరిశ్రమలోకి హీరోగా వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని చెప్పారు. "డీమానిటైజేషన్‌లో వంద కోట్ల చుట్టూ తిరిగే కథ అని, ఫస్ట్ టైం సినిమాను నిర్మిస్తున్నానని సాయి కార్తీక్ చెప్పారు. ఆయన సంగీతం అంటే నాకు చాలా ఇష్టం. కన్నడ పరిశ్రమ నుంచి తెలుగులోకి వస్తున్న చేతన్‌కు స్వాగతం' అని హర్షిత్ రెడ్డి తెలిపారు. వీర శంకర్ మాట్లాడుతూ, 'డీమానిటైజేషన్ బ్యాక్ డ్రాప్‌లో ఈ మూవీ అందరినీ ఆకట్టుకుంటుంది. విరాట్ నాకు ఎప్పటి నుంచో పరిచయం. సాయి కార్తీక్ ఈ చిత్రంతో మంచి లాభాలను రాబట్టుకోవాలి' అని అన్నారు.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X లక్నో
వేదిక : ఉప్పల్, రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



ఫ్రేజర్ మెరుపులు..

• అభిషేక్ అర్ధసెంచరీ • ఢిల్లీ క్యాపిటల్స్ 221/8



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. అభిషేక్ పొరెల్(65), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(50)లు రాజస్థాన్ బౌలర్లను ఉతికారేశారు. వీరిద్దరి అర్ధసెంచరీలకి తోడు చివర్లో స్టబ్స్(41) చెలరేగడంతో ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. తొలి వికెట్‌కు ఫ్రేసర్, అభిషేక్ 4.1ఓవర్లలో 60పరుగులు చేసి గట్టి పునాది వేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి శుభారంభం దక్కింది. ఆసీస్ యువ ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(50; 20బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లు) క్రీజ్‌లో ఉన్నంత సేపు విధ్వంసం సృష్టించాడు. బౌల్ట్ వేసిన తొలి ఓవర్లో ఒకటే ఫోర్ కొట్టినా.. ఆ తర్వాత సందీప్ శర్మ, అవేశ్ ఖాన్‌లను ఉతికేశాడు. ఆవేశ్ వేసిన నాలుగో ఓవర్లో రెచ్చిపోయిన మెక్‌గుర్క్ వరుసగా.. 4, 4, 4, 6, 4, 6 బాది అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఫ్రెజర్ కేవలం 20 బంతుల్లోనే అర్ధసెంచరీని కొట్టాడు. దీంతో ఈ సీజన్‌లో మరోదఫా ఫ్రెజర్ 20బంతుల్లోనే అర్ధసెంచరీని నమోదు చేశాడు. అశ్విన్ ఓవర్లో మెక్‌గుర్క్ కవర్ డ్రైవ్ ఆడి ఫెరారీ చేతికి చిక్కాడు. దాంతో 60పరుగుల వద్ద ఢిల్లీ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షాహ్ హెూప్(1) రనౌట్ కాగా.. అక్షర్ పటేల్(15)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. ఆ దశలో మరో ఓపెనర్ అభిషేక్ పొరెల్(65) ధాటిగా ఆడుతూ బౌండరీలతో చెలరేగాడు. కెప్టెన్ రిషభ్ పంత్(15)తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్(41; 20బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు) వీరవిహారం చేశాడు. చాహల్ వేసిన 18వ ఓవర్లో స్వీప్ షాట్లతో మూడు ఫోర్లు, ఆఖరి బంతికి సిక్సర్ బాది 21పరుగులు పిండుకున్నాడు.



అహిక, సుతీర్థ ఓటమి

సౌదీ స్మాష్ 2024

జెద్దా (సౌదీ అరేబియా): సౌదీ స్మాష్ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ జోడీలకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో అహిక ముఖర్జీ, సుతీర్థ ముఖరీ జోడీ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో నిరాశపరిచింది. మియు (జపాన్), కిమ్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఆసియా క్రీడల కాంస్య పతక విజేతలు 2-3తో ఓటమి చెందారు. 6-11, 11-9, 10-12, 11-6, 11-8తో అహిక, సుతీర్థ పోరాడి ఓడారు. మెన్స్ డబుల్స్ విభాగంలో మనుశ్ షా, మానవ్ ఠాకూర్‌లు స్లోవేకియా, హాంగ్‌కాంగ్ ప్యాడర్ల చేతిలో 18-20, 11-4, 11-6, 9-11, 11-7తో పరాజయం పాలయ్యారు.

గుకేశ్‌పైనే ఫోకస్

నేటి నుంచి గ్రాండ్ చెస్ టూర్



వార్సా (పోలాండ్) : క్యాండిడేట్స్ కింగ్‌గా నిలిచిన తర్వాత డి. గుకేశ్ తొలి పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఐదు అంచెల్లో సాగే గ్రాండ్ చెస్ టూర్ నేటి నుంచి పొలాండ్‌లో షురూ కానుంది. ప్రపంచ మేటీ తొమ్మిది మంది గ్రాండ్‌మాస్టర్లు ఇందులో పోటీపడుతున్నారు. గుకేశ్‌తో పాటు ఆర్. ప్రజ్ఞానంద సైతం ఎత్తులు వేయనున్నాడు. రోమానియా, క్రోయేషియా, యుఎస్‌ఏలో చివరి నాలుగు అంచెల పోటీలు ఉంటాయి. ఐదు అంచెల పోటీల అనంతరం విజేతను ప్రకటిస్తారు. ఫాబియానో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నాడు. పొలాండ్‌లో అర్జున్, క్రోయేషియాలో విదిత్ గుజరాతీలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వనున్నారు. గ్రాండ్ చెస్ టూర్ ఓవరాల్ ప్రైజ్‌మనీ సుమారు రూ.15 కోట్లు.



ఇక చావోరేవో!

నేడు లక్నోతో హైదరాబాద్ ఢీ

నవతెలంగాణ-హైదరాబాద్

ఐపీఎల్ 17 ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. రాజస్థాన్, కోల్‌కత దాదాపుగా ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టగా.. చెన్నై, లక్నో, హైదరాబాద్‌లు టాప్-4లో చోటు కోసం పోటీపడుతున్నాయి. ఈ మూడు జట్లు 11 మ్యాచుల్లో ఆరు విజయాలతో 12 పాయింట్లతో సమవుజ్జీలుగా కొనసాగుతున్నాయి. చివరి మూడు మ్యాచుల్లో మెరిసిన జట్టును ప్లే ఆఫ్స్ బెర్త్ వరించనుంది. నేడు ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్‌తో సూపర్‌జెయింట్స్ ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు ప్లే ఆఫ్స్ రేసులో ఓ అడుగు ముందుకేయనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ చివరి మూడు మ్యాచులను సొంతగడ్డపైనే ఆడనుంది. ఇది పాట్ కమిన్స్ సేనకు అతిపెద్ద అనుకూలత. ఈ సీజన్లో ఇక్కడ ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడింట సన్‌రైజర్స్ విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ సీజన్లో సన్‌రైజర్స్ ఐపీఎల్ బ్యాటింగ్ రికార్డులను తిరగరాసింది. బౌలర్లు సైతం అద్భుతంగా రాణిస్తున్నారు. కొత్త బంతితో భువనేశ్వర్ కుమార్, మిడిల్ ఓవర్లలో పాట్ కమిన్స్, డెత్ ఓవర్లలో నటరాజన్ అదరగొడుతున్నారు. స్పిన్నర్లు సైతం మెరిస్తే హైదరాబాద్ బౌలింగ్‌కు ఎదురులేదు. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ నిలకడగా రాణిస్తున్నా.. హెన్రిచ్ క్లాసెన్ ఫామ్ కోల్పోయాడు. చావోరేవో తేల్చుకోవాల్సిన సమయంలో క్లాసెన్ ఫామ్ సన్‌రైజర్స్‌కు అత్యంత కీలకం. నితీశ్ కుమార్ రెడ్డి, షాబాజ్ అహ్మద్, అబ్దుల్ సమద్ మరింత క్రియాశీల పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.



బాస్కెట్‌బాల్ చాంప్స్ : 54 జట్లు పోటీపడిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. అండర్-17 గర్ల్స్, బాయ్స్ విభాగం ఫైనల్లో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, పుష్పన్ స్పోర్ట్స్ అకాడమీలు పోటీపడగా.. రెండింట్లోనూ ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ జట్లు విజయం సాధించాయి. భారత బాస్కెట్‌బాల్ జట్టు కోచ్ పిఎస్ సంతోశ్ విజేతలకు బహుమతులు అందజేశారు.



పోల్ వార్-2024

రాష్ట్ర రాజకీయాలు కలుషితం

సీఎం అయినా రేవంత్‌రెడ్డి మాట తీరు మారలేదు

- మల్కాజిగిరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు పోటీనే కాదు : మీట్ ది ప్రెస్‌లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర రాజకీయాలు కలుషితమయ్యాయనీ, 20 ఏండ్లలో ఇలాంటి రాజకీయాలను తానెన్నడూ చూడలేదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులెవ్వరో ప్రజలకు సరిగా తెల్వదనీ, వారు తనకు పోటీనే కాదని చెప్పారు. వారికి డిపాజిట్లు కూడా వస్తాయోరావో అన్న సందేహం కలుగుతోందన్నారు. సర్వేలకు అందని రీతిలో తాను విజయం సాధించబోతున్నాననే ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏదీ అమలు కావట్లేదని విమర్శించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2,500, రూ.4వేల పింఛన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై చర్యలుంటాయనుకుంటే కమిటీలతో కాలయాపన చేస్తున్నారనీ, ఫోన్ ట్యాపింగ్ కేసు ఊసెత్తడం లేదని విమర్శించారు. రుణమాఫీ, రైతులకు రూ.15 వేల పంట సహాయం, కౌలురైతుకు రూ.12 వేలు, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఎందుకివ్వటం లేదని నిలదీశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరని నాలుగు నెలల్లోనే తేలిందన్నారు. సీఎం అయినా ఆయన మాట తీరు మారలేదని విమర్శించారు. చిల్లర చేష్టలు చేసేవారు రాజకీయాల్లో ఎక్కువ కాలం మనుగడ సాధించలేరనీ, వారు ఖతం అయిపోతారని చెప్పారు. 20 ఏండ్ల రాజకీయ జీవితంలో తానెన్నడూ సంస్కారహీనంగా ప్రవర్తించలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పడానికి తానూ కారణమే అని జరుగుతున్న ప్రచారాన్ని కొట్టి పడేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ బిల్లు చేతికందాలన్నా ఏడు నుంచి 10 శాతం ఇస్తే ముట్టజెప్పితేగానీ విడుదల కావడం లేదని ఆరోపించారు. కులం చూసి ఓట్లు వేస్తే వ్యవస్థ ఆగమైపోతుందని చెప్పారు. కులం పునాది మీదుగా రాజకీయాలు చేసేవారెన్నడూ విజయం సాధించలేరని స్పష్టం చేశారు. దొడ్డిదారి రాజకీయాలు దిగజారుడు తనానికి పరాకాష్ట అన్నారు. ప్రజలు అత్యంత శక్తివంతులనీ, వారే చరిత్ర నిర్మాతలని చెప్పారు. దేశంలో సంకీర్ణ రాజకీయాలకు కాలం చెల్లిందనీ, కేంద్రంలో మళ్లీ మోడీ సర్కారే అధికారంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో మెజార్టీ ముస్లిములు బీసీ జాబితాలో ఉన్నారనీ, అలాంటప్పుడు మత ఆధారిత రిజర్వేషన్లు ఎందుకని అడిగారు. పఠాన్‌లు, సయ్యద్‌లు ఈడబ్ల్యూఎస్ పరిధిలోకి వస్తారనీ, అలాంటప్పుడు ముస్లిం రిజర్వేషన్లు ఎందుకు అని ప్రశ్నించారు. మల్కాజిగిరి ప్రజలను తాను తాగుబోతులన్నట్టుగా వీడియో మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారం చేస్తున్నవారిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కేసీఆర్‌ను ప్రజలు నమ్మట్లేదన్నారు. తానెప్పుడూ పోరాటంలోనే ఉంటాననీ, మంత్రిగా ఉండి కూడా మున్సిపల్, ఆర్టీసీ కార్మికుల సమ్మెలకు మద్దతు తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలపడం, ముక్కుసూటిగా ఉండటం వల్లనే బీఆర్ఎస్ నుంచి తనను బయటకు పంపారన్నారు. ఈ సమావేశంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్. వేణుగోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వనజ, సభ్యులు ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు వాటా దక్కనీయకుండా బీజేపీ మహాకుట్ర

అందులో భాగంగానే 400 సీట్లు అడుగుతుంది

- అవకాశం దొరికితే రిజర్వేషన్లు మార్చేందుకు యత్నం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఎవరి తరం కాదు
- అబద్ధాల ముసుగులో మాజీ సీఎం కేసీఆర్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 90 శాతం వాటా దక్కనీయకుండా బీజేపీ మహాకుట్ర చేస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క విమర్శించారు. అందులో భాగంగా రిజర్వేషన్ల రద్దు చేసేందుకు సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 400 సీట్లు అడగడంలో అంతర్యం ఇదేనన్నారు. ఆ పార్టీ అసలు ఎజెండా కులాల రిజర్వేషన్లు రద్దు చేయడమేనన్నారు. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ బీజేపీకి వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు బండ్ల గణేష్, సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటివరకు ఉంటదో కూడా తెలియదంటూ ఆ రెండు పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ అబద్ధాల ముసుగులో బతుకున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో 2/3 మెజార్టీ సాధించి, రాజ్యాంగంలోని సెక్యులర్ పదాన్ని తొలగించాలని కమలనాథులు చూస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల ప్రభుత్వ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైందన్నారు. అలాంటి రాష్ట్రాన్ని మూడు నెలల్లోనే చక్కదిద్దామని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు చెప్తున్నందుకే సీఎం రేవంత్‌ను భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. హిట్లర్, ముస్సోలినీలాగా కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలని బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశం అల్లకల్లోలంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యత బడుగు, బలహీన వర్గాలు బీజేపీ అధికారంలోకి రాకుండా చూడాలని కోరారు. దేశంలో ఇలాంటి దుస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. తిరిగి ఆ పార్టీ అధికారంలోకి వస్తే దళిత, గిరిజనులు, బలహీన వర్గాలు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆ పార్టీకి ఓటేస్తే వేస్తే మన గొంతు మనమే కోసుకున్నట్టు ఉంటుందని, ఆయా వర్గాలకు భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఆ పార్టీ నిర్వాకం వల్ల భారతదేశం పెను ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ కుట్ర, కుతంత్రాలను పసిగట్టిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర, న్యాయయాత్ర చేశారని గుర్తు చేశారు. ఓబీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం ఆస్తులను పంచుతామంటూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కులగణన చేపడుతున్నదని చెప్పారు. రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణన ప్రక్రియ మొదలైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ఇవ్వడాన్ని ప్రస్తావించగా... ఆయనకు భావస్వేచ్ఛ ఉందని చెప్పారు.

కుర్‌కురే.. కిరికిరి పార్టీలకి బుద్ధి చెప్పండి

- బీజేపీతో దోస్తీ ఉంటే నా చెల్లి జైల్లో ఎందుకుంటది..: అంబర్‌పేట్‌లో రోడ్‌షో కేటీఆర్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ కోసం కొట్లాడే బీఆర్ఎస్ పార్టీ ఒక దిక్కు.. కుర్ కురే బీజేపీ.. కిరికిరి కాంగ్రెస్.. చెరో దిక్కున్నాయని.. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. జూన్ 2 తర్వాత బీజేపోళ్లు ఖచ్చితంగా హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారన్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ తిలక్‌నగర్‌లోని ఫీవర్ ఆస్పత్రి దగ్గర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో కలిసి కేటీఆర్ రోడ్డు షో నిర్వహించి మాట్లాడారు. హైదరాబాద్‌పై బీజేపీకి పట్టు దొరుకుతలేదని, అందుకే కేంద్రపాలిత ప్రాంతం చేయాలని కుట్రలు చేస్తోందని అన్నారు. దాన్ని అడ్డుకోవాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఖచ్చితంగా ఉండాలని చెప్పారు. ఐదుగురు ఎంపీలతో కేసీఆర్ తెలంగాణ తెచ్చారని గుర్తు చేశారు. ఐదేండ్లలో కిషన్ రెడ్డి అంబర్‌పేటకు ఒక్క రూపాయి తెచ్చిండా?.. ఒక్క గుడి కట్టిండా, బడి కట్టిండా? ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. బీజేపీతో దోస్తీ ఉంటే నా చెల్లెలు జైల్లో ఉండేదా అని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఐ(ఎం) పార్లమెంటు ఎన్నికల ప్రసంగం

నేడు దూరదర్శన్, ఆకాశవాణిలో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దూరదర్శన్, ఆకాశవాణిలో బుధవారం రాత్రి 8.30 గంటలకు ఐదు నిమిషాల పాటు సీపీఐఐ(ఎం) ఎన్నికల ప్రసంగం ప్రసారమవుతుంది. దూరదర్శన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, ఆకాశవాణిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్ ప్రసంగిస్తారు. ఈ ప్రసంగాలను వీక్షించాలని ప్రజలకు ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

రైతులపై బీజేపీ, బీఆర్ఎస్‌లది కపట ప్రేమే :మంత్రి పొన్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్‌లు రైతులపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రైతులందరికీ రైతు భరోసా డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తే ఆయా పార్టీలకు చెందిన నేతలు ఓర్వలేకపోయారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా నిదులను విడుదల చేసేందుకు తమ ప్రభుత్వం భావిస్తుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష పార్టీలు దాన్ని అడ్డుకున్నాయని విమర్శించారు. రైతు భరోసాను ఆపాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయనీ, దీంతో రైతు ఖాతాల్లో డబ్బులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు..

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886